వారాంతే
గత వారం రోజుల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-1-2026 సోమవారం సంపుటి: 31 సంచిక: 335 పేజీలు: 10+4 వెల: 6.50


**కిమ్ మళ్లీ కవ్వింపు చర్యలు**
క్షిపణిపరీక్షలతో తూర్పు ఆసియాలో ప్రకంపనలు

**పుతిన్‌ను ఇలాగే తీసుకు రాగలరా?**
అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రోఖన్నా

5

# 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం

**ఆ లక్ష్యంగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాం**

**వారణాసిలో జాతీయ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ**



ఆదివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జనవరి 4:** క్రీడా రంగంలో భారతదేశం సరికొత్త శిఖరాలను అధిరోహించే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్ షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే లక్ష్యంగా భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక >>2

# అసోం ఎన్నికల ఇన్‌ఛార్జిగా ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, జనవరి 4:** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాం స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆమెను నియమించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలకు స్క్రీనింగ్ కమిటీలను నియమించారు. >>2

# నిధుల దుబారాపై నజర్



**ప్రస్తుత బడ్జెట్‌లో 20 శాతం కోత**

**ఆర్థిక నియంత్రణ తప్పనిసరి**

**30 నుండి 50 శాతం ఖర్చు తగ్గుదల**

**2025-26 ఆర్థికం చివరి మూడు నెలలపై ఆంక్షలు**

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** మరో రెండు నెలల్లో ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆశించన మేర ఆదాయం రాకపోగా, ఖర్చులు పెరుగుతుండటంతో రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక సంవత్సరం చివరి మూడు నెలల్లో నిధుల వినియోగంపై ఆచితూచి వ్యవహరించనుంది. వివిధ శాఖల్లో జరుగుతున్న నిధుల దుబారాను నియంత్రించేందుకు ఆర్థిక శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా నిధుల వ్యయంపై ఆంక్షలు విధించినట్లు తెలియవచ్చింది. కేంద్ర ఆర్థిక సహకారంపై ఆశలు పెట్టుకున్న సర్కార్ ప్రధానంగా ఆరు గ్యారంటీ పథకాల అమలుకు కావాల్సిన నిధుల సేకరణపై దృష్టి సారిస్తూనే, మరోవైపు ఇతర విభాగాల్లో వ్యయాన్ని కట్టడి చేయనుంది. ఆర్థిక నియంత్రణను పాటించేలా ప్రభుత్వ శాఖలన్నీ తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత బడ్జెట్‌లో 20 శాతం కోతపడే అవకాశాలు ఉన్నట్లు ఆర్థిక శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఆర్థికం ముగిసే మార్చి 31వ తేదీ వరకూ అన్ని శాఖలు చేయనున్న వ్యయాన్ని 30 నుండి 50 శాతం వరకూ తగ్గించేలా ఆర్థిక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లోనే ప్రస్తుత 2025-26 బడ్జెట్‌ను సవరించిన అంచనా బడ్జెట్ పరిమాణాన్ని దాదాపు 20 శాతం తగ్గించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత బడ్జెట్ ప్రకారం మొత్తం ఆదాయం రూ.2.84 లక్షల కోట్లుగా ఉండాలి. కానీ మార్చి నాటికి ఇది రూ.2.60 లక్షల కోట్ల వరకు పరిమితం కావచ్చని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం పన్నుల ద్వారా రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు రూ.1 లక్ష కోట్లకు పైగా వసూళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మార్చి నాటికి పన్నుల వసూళ్లు బాగా పెరగవచ్చని అంచనా. >>2

# నల్లమల సాగర్‌ను అడ్డుకుందాం

**'సుప్రీం'లో బలమైన వాదనలు వినిపిద్దాం**

**తెలంగాణకు జరిగే నష్టం సమగ్రంగా వివరిద్దాం**

**ముంబయిలో అభిషేక్ సింఘ్వీతో ప్రత్యేకంగా సమావేశమైన సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్**

**నేడు సుప్రీంలో విచారణకు రానున్న తెలంగాణ ప్రభుత్వం వేసిన రిట్ పిటిషన్**



ఆదివారం ముంబయిలో అభిషేక్ సింఘ్వీతో సమావేశమైన సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి4:** గోదావరిపై ఏపీ తలపెట్టిన పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సీనియర్ న్యాయ నిపుణులతో చర్చలు జరిపింది. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం వేసిన రిట్ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదివారం ముంబైలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం తరఫున సమర్థమైన వాదనలు వినిపించాలని న్యాయ నిపుణులకు సూచించారు. అవసరమైన అన్ని ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఇరిగేషన్ అధికారులను >>2

**రేవంత్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కక్ష..**

## పాలమూరుపై పగ

తెలంగాణకు నంబర్-1 విలన్ కాంగ్రెస్

సాగునీటి ప్రాజెక్టులపై హరీష్ ప్రజెంటేషన్



2



**రేవంత్ రెడ్డికి బేసిన్లు,**

## బేసిక్స్ తెలవదు

రాష్ట్ర ప్రజలను మోసం చేసినందుకు రేవంత్, రాహుల్‌ను ఎన్నోసార్లు ఉరి తీయాలి: కెటిఆర్



**ఫోన్ ట్యాపింగ్ కేసు:**

## వేగం పెంచిన సిట్

**బిఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావును 11 గంటల పాటు విచారణ**

**ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులతో ఉన్న సంబంధాలపై ఆరా**

**త్వరలో బిఆర్ఎస్ ముఖ్య నేతలకు తాఖీదులు?**

**హైదరాబాద్, (జూబ్లీహిల్స్) జనవరి 4, ప్రభాత వార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వేగం పుంజుకుంది. ఈ కే సులో ఇటీవలే ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావును సిట్ అధికారులు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రెండు వారాల పాటు కస్టడీలో తీసుకుని విచా రించడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన నుంచి కీలక సమాచారం రాబట్టడం విదితమే. ప్రభాకర్ రావు విచారణ ముగిసిన పది రోజుల తరువాత ఆదివారం ఉదయం బిఆర్ఎస్ ఎంఎల్‌సి నవీన్ రావును విచారణకు రావాలని సిట్ అధికారులు నోటీసులు పంపారు. వాస్తవానికి నవీన్‌రావును 2024 లో ఒకసారి మూడు గంటలకు పైగా విచారించారు. శనివారం ఆయనకు నోటీసులు ఇచ్చినా ఆదివారం ఉదయం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సిట్‌నోటీసులు అందుకున్న నవీన్ రావు ఉదయం 11 గంటలకు జూబ్లీ హిల్స్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఆ సమయంలో ఫోన్ ట్యాపింగ్‌పై మొదటగా ఏర్పాటు చేసిన సిట్‌కు అధిపతిగా వున్న జూబ్లీహిల్స్ ఎసిపి >>2

# తీరు మార్చుకోకపోతే... మీపైనా చర్యలు తప్పవు!



న్యూయార్క్ జైలుకు మదురోను తరలిస్తున్న పోలీసులు

**క్యూబా, మెక్సికో, కొలంబియాలకు ట్రంప్ వార్నింగ్**

**న్యూయార్క్ డ్రగ్స్ ఏజెన్సీ కార్యాలయంలో బేడీలతో మదురో**

**వెనిజులాను పాలించేది మేమే: అమెరికా అధ్యక్షుడు**

**దేశ తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్**

**మా ప్రజలకు స్వేచ్ఛ లభించింది: ప్రతిపక్ష నేత మచాడో**


**అక్కడి పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం: భారత్ విదేశాంగ శాఖ ప్రకటన**

5

**చమురు నిల్వల కోసమే వెనిజులాపై ట్రంప్ దాడులు**

**అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమల హారిస్ ధ్వజం**

**వెనిజులా ప్రజలకు మస్క్ స్టార్‌లింక్ ఉచిత ఇంటర్నెట్**



వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**సెర్చ్ వారంట్లు ఎలా**

## జారీచేస్తున్నారు?

**పోలీసు అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** తెలంగాణలో పోలీసుల చర్యలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పోలీసు కమిషనర్ లేదా ఎసిపి స్థాయి అధికారులు తమంతట తాముగా సెర్చ్ వారంట్లు జారీ చేస్తుండడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేబట్టిన చీఫ్ జస్టిస్ అపరేష్ కు మార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. దీనిపై పిటిషన్ దాఖలు చేసిన విజయ్‌గోపాల్ వాదనలు వినిపిస్తూ సిఆర్‌పిసి 93, హైదరాబాద్ సిటీ పోలీసు యాక్ట్‌లోని సెక్షన్ 47ను పోలీసులు దుర్వినియోగం >>2

# మళ్లీ పెరిగిన ఎరువుల ధరలు



**యూరియా మినహా మిగిలిన వాటిపై రూ.50 పెంపు**

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** పెరిగిన ఎరువుల ధరలు రైతాంగానికి భారంగా మారుతున్నాయి. ప్రస్తుత యాసంగి సీజను ప్రారంభంలో ఎరువుల ధరలు పెరగ్గా, మళ్లీ ఇప్పుడు ఇదే సీజనులో మరోసారి పెరుగుదల చోటు చేసుకుంది. ఇలా ఈ రబీ సీజనులో రెండుసార్లు ఎరువుల ధరలు పెరగడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం సీజన్లో అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులు పడ్డరైతులకు పెరుగుతున్న >>2

# ఛాలెంజ్‌గా ఆలయ పునరుద్ధరణ

**మేడారంలో సమ్మక్క సారలమ్మ దేవాలయంలో పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి, సీతక్క**



మేడారంలో సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రులు పొంగులేటి, సీతక్క

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాతవార్త:** మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయానికి ఆదివారం హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి, మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., మహబూబాబాద్ ఎస్పీ శబరిష్ , భూపాలపల్లి ఎస్.పి. సిరిశెట్టి సంకీర్త్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్లతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పలు శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులను పరిశీలించారు.జంపన్న వాగు వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి బ్యాంబు చికెన్ క్యాంటీన్ ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి,మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టి.ఎస్ లతో కలిసి ప్రారంభించారు.అనంతరం మంత్రులు ఎంపి బలరాం నాయక్‌తో కలిసి మేడారం లోని హరిత హోటల్ లో సంబంధిత శాఖల ఉన్నత >>2



ఆదివారం మేడారంలో సమ్మక్క, సారలమ్మ గద్దెల అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి, సీతక్క

# ఆలయ పునరుద్ధరణ

>> స్థాయి అధికారులతో, గుత్తేదారులతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రాకారం పిటి బీమ్స్ అమరికా పనులను, గద్దెల రాతి స్తంభాలపై బ్రాకెట్ లను త్వరిత గతిన ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రాంగణ మరియు జాతర సివిల్ వర్క్స్, క్యూ లైన్స్ షేడ్స్ నిర్మాణం మొత్తం జనవరి 12వ తేది వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. నూతనంగా నిర్మించిన రహదారులకు ఇరువైపులా సైడ్ బర్మ్‌లను ఏర్పాటు చేయాలని పబ్లిక్ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి చూస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా త్రాగునీటి సమస్య రాకుండా ఏర్పాటు చేయాలని, మేడారం ప్రాంతం సంక్రాంతి పండుగ ముందు నుంచి జనవరి 31 వరకు విద్యుత్ కాంతుల వెలుగులతో భక్తులకు కనిపించాలని వాటికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబధిత అధికారులకు సూచించారు. జాతర పరిసరాలను జోన్స్, సెక్టార్స్ వారిగా సిబ్బందిని ఏర్పాటు చేసుకొని పారిశుధ్య పనులను చేపట్టాలని , పనుల విషయం లో నిర్లక్ష్యం వహిస్తే అధికారులు ఐనా గుత్తేదారులకు ఐనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ఎం పి బలరాం నాయక్ లు సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకొని, ఆలయ అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ...దేశ చరిత్రలోనే కాదు ప్రపంచ చరిత్రలో గిరిజనులు సాంప్రదాయ బద్ధంగా, కోట్లాదిమంది గిరిజనేతరులు ఆరాధ్య దైవంగా పూజించే సమ్మక్క సారలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అనుకున్న గడువులోగా ఆలయ పునరుద్ధరణ పనులు సాగుతున్నాయి. ఈనెల 20వ తేదీలోగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకరోజు ముందే ఇక్కడికి వచ్చి రాత్రి బస చేసి తెల్లవారి ఉదయం ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తయిన సందర్భంగా ప్రారంభించుకునే కార్యక్రమం చేపట్టబోతున్నాం అని తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరలో మౌలిక వసతులతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని పేర్కొన్నారు. మంత్రి సీతక్క ఇక్కడే ఉండి పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ పునరుద్ధరణ పనులు అనుకున్న సమయానికి పూర్తి చేసే విధంగా కృషి చేస్తున్నారు. అమ్మవార్ల దయతో ఆలయ పునరుద్ధరణ పనుల కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఛాలెంజ్ గా తీసుకొని చేపట్టిందని, తక్కువ సమయంలో రాతితో 200 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా ఉండే విధంగా ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టాం అని స్పష్టం చేశారు. ఆలయ పునరుద్ధరణ పనులు ప్రారంభించుకున్నది మొదలుకుని అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు ఎంతో సహకరిస్తున్నారని అన్నారు. ఆలయ పునరుద్ధరణ పనులు వేగవంతంగా సాగే విధంగా సహకరిస్తున్న, సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్న అని అన్నారు. అనంతరం హెలికాప్టర్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి సీతక్క, ఎం పి బలరాం నాయక్ లు హైదరాబాద్ కు బయలుదేరివెళ్లారు.

# భారత్ ఆతిథ్యం

>> ఈవెంట్ హక్కులను దక్కించుకోవడానికి ఎక్కడా రాజీపడకుండా కృషి చేస్తున్నామన్నారు. అలాగే, 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో భారత్ తన సత్తాను చాటుతోందని, గత దశాబ్ద కాలంలో అండర్17 ఫిఫా వరల్డ్ కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్లతో సహా 20కి పైగా అంతర్జాతీయ ఈవెంట్లను మన దేశం విజయవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు. వాలీబాల్ క్రీడ గొప్పతనాన్ని వివరిస్తూ ఇది కేవలం ఆట మాత్రమే కాదని, సహకారం, సమతుల్యత (బ్యాలెన్స్)తో కూడిన ప్రక్రియ అని మోదీ అభివర్ణించారు. బంతిని కింద పడకుండా గాలిలోనే ఉంచేందుకు చేసే ప్రయత్నంలో క్రీడాకారుల పట్టుదల కనిపిస్తుందన్నారు. టీమ్ ఫస్ట్ అనే నినాదంతో ప్రతి క్రీడాకారుడు జట్టు విజయం కోసమే ఆడాలని సూచించారు. వ్యక్తిగత నైపుణ్యాలు వేరైనా, సమష్టి కృషితోనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఆదివారం నుంచి 11 వరకు జరగనున్న ఈ 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, సంస్థల నుంచి 58 జట్లు పాల్గొంటున్నాయి. సుమారు 1,000 మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ టోర్నీ ద్వారా భారతీయ వాలీబాల్‌లో ఉన్న అత్యుత్తమ ప్రమాణాలు, క్రీడాస్ఫూర్తి వెలుగులోకి వస్తాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

# నిధుల దుబారాపై నజర్

>> కాగా మార్చి నెలాఖరు వరకు రూ.2.60 లక్షల కోట్ల ఆదాయం సాధ్యమా అనేదానిపై ఆర్థిక శాఖ తర్జన భర్జనలు పడుతోంది. ఇందులో భాగంగా గతేడాది 2024-25 ఆర్థిక సంవత్సరం కన్నా ప్రస్తుత 2025-26లో 10 శాతం ఎక్కువ పన్నుల వసూళ్లు సాధించమని ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తెచ్చిపెట్టే ప్రధాన శాఖలను ఆదేశించింది. 2024-25లో పన్నుల ద్వారా లక్ష్యంగా పెట్టిన రూ.1.64 లక్షల కోట్లకు చివరికి రూ.1.40 లక్షల కోట్లు మాత్రమే సాధించగలిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత 2025-26లో రూ.1.75 లక్షల కోట్ల లక్ష్యానికి చేరే అవకాశం ఉన్నప్పటికీ, మార్చి నాటికి సాధ్యమైన వసూళ్లు రూ.2.60 లక్షల కోట్ల పరిధిలోనే ఉండవచ్చని ఆర్థిక శాఖ సీనియర్ అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ప్రస్తుత ఆర్థికంలో పన్నేతర ఆదాయం, కేంద్రం నుండి అందుకునే గ్రాంట్లను కలిపి రూ.53 వేల కోట్లకుపైగా రావచ్చని అంచనా. అయితే ఇప్పటివరకు వాటిలో కేవలం రూ.11 వేల కోట్ల మాత్రమే కేంద్రం విడుదల చేసింది. మరోపక్క ఎఫ్ఆర్‌బిఎం పరిమితులు, మార్కెట్ రుణాలు, బడ్జేటేతర రుణాలపై ఆంక్షల నేపధ్యంలో రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.40 వేల కోట్లకు పైగా లోటును ఎదుర్కొంటోంది. ప్రస్తుత ఏడాది దాదాపు రూ.44 వేలకోట్ల మేరలోటు వచ్చే అవకాశాలు ఉండటంతో వీటన్నింటి దృష్ట్యా ఆర్థిక నియంత్రణ తప్పనిసరిగా అమలు చేయాలని ఆయా శాఖలకు ఆర్థిక శాఖ దిశా నిర్దేశం చేసింది. వ్యవసాయ, సంక్షేమ, ఇరిగేషన్ వంటి ప్రాధాన్యతా రంగాలకు మినహాయించి, మిగిలిన శాఖల్లో కేటాయింపుల విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితి తప్పడం లేదని ఆర్థిక శాఖ అధికారులు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

# నల్లమల సాగర్‌ను అడ్డుకుందాం

>> అప్రమత్తం చేశారు. అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు లింక్ చేసేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను నిలిపివేయాలని కోరుతూ ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. తక్షణమే పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఈ పనులు ఆపేలా సుప్రీంకోర్టు ఆదేశించాలని పలు అంశాలను ప్రస్తావించింది. మొదట్లో ఆమోదించిన మేరకు పోలవరం ప్రాజెక్టు పనుల స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కావని ఈ పిటిషన్ లో స్పష్టం చేసింది. తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమలసాగర్ ప్రాజెక్టు ప్రీ ఫిజిబులిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించటం సమంజసం కాదని అభ్యంతరం తెలిపింది. అందుకు సంబంధించి కేంద్ర జల సంఘం, కేంద్ర జల మంత్రిత్వ శాఖ, గోదావరి నీటి యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం డీపీఆర్ తయారీకి సిద్ధపడుతోందని, వెంటనే ఈ చర్యలను ఆపాలని కోరింది. ఏపీ తలపెడుతున్న ఈ విస్తరణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా, కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో ప్రస్తావించింది

## అసోం ఎన్నికల ఇన్‌ఛార్జిగా ప్రియాంక గాంధీ

>> ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలోని అస్సాం స్క్రీనింగ్ కమిటీలో సప్తగిరి శంకర్ ఉలక, ఇమ్రాన్ మసూద్, సిరివెల్ల ప్రసాద్ సభ్యులుగా ఉన్నారు. అస్సాంతో పాటు, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లకు స్క్రీనింగ్ కమిటీలను కూడా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసింది. కేరళ కమిటీకి మధుసూదన్ మిస్త్రీ అధ్యక్షత వహిస్తారు. సయ్యద్ నసీర్ హుస్సేన్, నీరజ్ డాంగి, అభిషేక్ దత్ సభ్యులుగా ఉంటారు. మరోవైపు తమిళనాడు, పుదుచ్చేరి స్క్రీనింగ్ కమిటీకి టీఎస్ సింగ్ డియో నేతృత్వం వహిస్తారు. యశోమతి ఠాకూర్, జీసీ చంద్రశేఖర్, అనిల్ కుమార్ యాదవ్ సభ్యులుగా ఉంటారు. పశ్చిమ బెంగాల్ కమిటీకి బీకే హరిప్రసాద్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. మహ్మద్ జావేద్, మమతా దేవి, బీపీ సింగ్ సభ్యులుగా ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక, అంతర్గత సంప్రదింపులు వంటి బాధ్యతలను స్క్రీనింగ్ కమిటీలు నిర్వహిస్తాయి.

## వారం - వర్జ్యం

05-01-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
విదియ ఉ.9.59
పుష్యమి మ.1.29
వర్జ్యం : రా.1.41-3.13, 2)మ.2.50-3.35
దు.మ.12.36-1.21, సా.5.30-6.30
శుభసమయం : ఉ.9.45-10.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పేవారు అధికంగా ఉంటారు. తగు జాగ్రత్తలు పాటించండి.

**మిథునం:**ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్తులకు అను కూలంగా ఉంటుంది. నరదృష్టి అధికంగా ఉంటుంది.

**కర్కాటకం:**మీ ఆత్మ గౌరవానికి మచ్చ తేవడానికి ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు ఫలించవు. వెన్నునొప్పి బాధిస్తుంది.

**సింహం:** సనాతన విద్యల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. ఒక సమస్య తీరితే మరో సమస్య పరిష్కారించుకోవలసి వస్తుంది.

**కన్య:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. మిత్రులకు మీ వంతు సహాయం అందిస్తారు. సంబంధబాంధవ్యాలు మెరుగుపడతాయి.

**తుల :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:**దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. షేర్లు భూముల క్రయ విక్రయాలు ప్రోత్సాహకరంగా వుంటాయి.

**ధనుస్సు:** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తి కాగలవు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**మకరం:**స్థిరాస్తి వివాదాలు, కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఉద్యోగులకు బదిలీలు వుంటాయి.

**కుంభం:**ఓర్పు, నేర్పులతో ముఖ్య వ్యవహారాలు సానుకూల పరుచుకునే యత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం:** మీ మనస్సులోని మాటను ఇతరులకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## రేవంత్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కక్ష..

# పాలమూరుపై పగ

## తెలంగాణకు నంబర్-1 విలన్ కాంగ్రెస్

## సాగునీటి ప్రాజెక్టులపై హరీష్ ప్రజెంటేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి4:** అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుకథలు చెప్పారని, తాము పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తే.. వాళ్ల బండారం బయటపడుతుందనే తమకు అవకాశం ఇవ్వలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అయినా తాము ఊరుకునేది లేదని, కృష్ణా జలాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ భవన్‌లో ఆదివారం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన హరీశ్‌రావు.. కేసీఆర్ నాయకత్వంలో మరో జలపోరాటానికి శ్రీకారం చుడుతామని చెప్పారు. కేసీఆర్ పదేళ్లపాటు అపరభగీరథుడిలా కష్టపడి నిర్మించిన ప్రాజెక్టులను ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా నిరక్ష్యం చేస్తున్నరు. కాళేశ్వరంపై కక్ష గట్టింద్రు. పాలమూరుపై పగబట్టింద్రు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన రిటైర్డ్ సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్‌రావు నీళ్లునిజాలు అనే పుస్తకం రాశారు. అలాంటి నిపుణుల సలహాలతో పాలమూరు-రంగారెడ్డికి, కాళేశ్వరానికి కేసీఆర్ రూపకల్పన చేశారు. అసుంటి ప్రాజెక్టులో మేడిగడ్డ వద్ద ఇయ్యాల రెండు పిల్లర్లు కుంగిపోతే మొత్తం కాళేశ్వరాన్నే పండబెట్టింద్రు' అని హరీశ్‌రావు విమర్శించారు. రెండు వందల కోట్లు ఖర్చుపెడితే ఐదారు లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చే అవకాశం ఉన్నా, ఈ రెండేళ్లలో రెండు రూపాయలు కూడా ఇయ్యలే. రైతాంగం మీద, ఉత్తర తెలంగాణ మీద నువ్వు పగబట్టినవ్. మేడిగడ్డ బ్యారేజీ లేకపోయినా నదీ ప్రవాహం నుంచి గూడా కన్నెపెల్లి పంప్‌హౌస్‌ను నడిపి నీళ్లిచ్చే అవకాశం ఉన్నా కావాలనే కాళేశ్వం మీద కక్షగట్టి పండబెడుతున్నవ్. విద్యాసాగర్ రావు సలహా మేరకు.. కేసీఆర్‌గారు శ్రీశైలం దన్నుతో మన రాష్ట్రానికి మేలు జరుగుతదని భావించి పాలమూరు ప్రాజెక్టును కడితే రెండేళ్ల నుంచి పట్టించుకున్న పాపానపోలేవ్. ఇయ్యాల ప్యాకేజీ 3 కింద ఉన్న ఓ బుడ్డ కాలువను పూర్తిచేస్తే 50 టీఎంసీల నీళ్లు నిలుపుకునే అవకాశం ఉండె. ఆ అవకాశాన్ని నువ్వు కాలరాసినవ్. పాలమూరుపై పగబట్టినవ్ఠ అని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. 'నీటి పంపకాల కోసం సెక్షన్3 ప్రకారం ట్రిబ్యునల్ వేయాలని బీఆర్ఎస్ హయంలో నాటి సీఎం కేసీఆర్ కేంద్రానికి 32 లేఖలు రాశారు. ప్రధానమంత్రికి లేఖలు రాశారు. ఫస్ట్ అఫెక్స్ కౌన్సిల్‌లో మాట్లాడారు. సెకండ్ అఫెక్స్ కౌన్సిల్‌లో మాట్లాడారు. చివరికి సుప్రీంకోర్టుకు వెళ్లి సెక్షన్3 సాధించారు. నాడు కేసీఆర్ తెలంగాణ కోసం కొట్లాడి ఎంత మేలు చేసింద్రో.. ఆ తర్వాత సెక్షన్3 సాధించి కూడా అంతే మేలు చేశారు. సెక్షన్3 సాధించడం వల్లనే కదా ఇయ్యాల మనం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించగలుగుతున్నాం'అని అన్నారు. ప్రాణాలకు తెగించి కొట్లాడి స్వరాష్ట్రం సాధించిన కేసీఆర్.. తెలంగాణకు నీళ్లలో అన్యాయం చేస్తడంటే ఎవరూ నమ్మరు. సెక్షన్3 కోసం అప్పటి తెలంగాణ సర్కారు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దాంతో కేంద్రం దిగివచ్చింది. సుప్రీంకోర్టులో పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకుంటే వెంటనే ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. దాంతో రాష్ట్రం పిటిషన్‌ను ఉపసంహరించుకుంది అని చెప్పారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకుంటే వెంటనే ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామన్న బీజేపీ నేతృత్వంలోని కేంద్రం.. మాటతప్పింది. మనం 2021 అక్టోబర్ 6న పిటిషన్‌ను ఉపసంహరించుకుంటే.. వెంటనే ట్రిబ్యునల్ వేయకుండా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం సరిగ్గా రెండేళ్ల తర్వాత.. అంటే 2023 అక్టోబర్ 6న సెక్షన్3 అమలుకు ఆమోదం తెలుపుతూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అంటే ఏకంగా రెండేళ్లు తాత్సారం చేసింద్ఠి అని అన్నారు. కేసీఆర్‌ను తీయడం కాదు, అసెంబ్లీలో అబద్ధాలు మాట్లాడి శాసనసభ వ్యవస్థను తప్పుదారి పట్టించిన రేవంత్‌రెడ్డి నాలుక కొయ్యాలె'అని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. మన ప్రాంతాన్ని ఆంధ్రాతో కలిపింది కాంగ్రెస్. మన విద్యార్థులను పొట్టన పెట్టుకుంది కాంగ్రెస్. మన ప్రాజెక్టులను రద్దుచేసింది కాంగ్రెస్. చివరికి 11వ షెడ్యూల్‌లో కూడా పాలమూరు, దిండి ప్రాజెక్టులను పెట్టకుండా పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు అన్యాయం చేసింది కాంగ్రెస్. ఇంక సోనియాగాంధీ రక్షణలు కల్పించిందని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నడు. ఏం రక్షణలు కల్పించింది..? పాలమూరు, దిండి ప్రాజెక్టులను 11వ షెడ్యూల్‌లో పెట్టకపోవడం రక్షణనా, నీటి పంపకాలు సెక్షన్ 3 ప్రకారం చేయాలని చెప్పకపోవడం రక్షణనా..? అని ప్రశ్నించారు. 1956కు ముందు హైదరాబాద్ రాష్ట్రంగా తెలంగాణ ప్రాంతం ఉండేది. ఆనాడు ఈ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌తో కలిపిందే కాంగ్రెస్ పార్టీ. తెలంగాణను సొంత రాష్ట్రంగా ఉంచాలని ఫజల్ అలీ కమిషన్ స్పష్టంగా చెప్పినా తెలంగాణను ఏపీలో కలిపి మరణశాసనం రాసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ తొలిదశ ఉద్యమ సమయంలో 1969లో సిటీ కాలేజీలో 369 మంది విద్యార్థులను కాల్చిచంపిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. మలిదశ ఉద్యమ సమయంలో ఇచ్చిన తెలంగాణను వెనక్కి తీసుకుని వందలాది మంది యువకులను పొట్టన పెట్టుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. నాడు ఫజల్ అలీ కమిషన్ తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌తో కలుపవద్దని స్పష్టంగా చెప్పింది. ఒకవేళ కలిపితే 174 టీఎంసీల నీటి వినియోగం లక్ష్యంగా అప్పర్ కృష్ణ, తుంగభద్ర ఎడమ కాలువ, బీమా వంటి ప్రాజెక్టులను రద్దు చేయవద్దని, కొనసాగించాలని స్పష్టంచేసింది. అయినా నాడు ఆ ప్రాజెక్టులను రద్దుచేసి పాలమూరు జిల్లాను వలసల జిల్లాగా మార్చింది ఈ కాంగ్రెస్ పార్టీ. పాలమూరు వలసలకు కారణమే కాంగ్రెస్ పార్టీ. హైదరాబాద్ సొంత రాష్ట్రంగా ఉంటే ఆ ప్రాజెక్టులు పూర్తయ్యేవి. నల్లగొండ ఫ్లోరైడ్ బాధలు, పాలమూరు వలసల బాధలు తప్పేవి అని పేర్కొన్నారు. 'తెలంగాణ ప్రాంతానికి నాడైనా, నేడైనా నెంబర్‌వన్ విలనే కాంగ్రెస్ పార్టీ అని కేసీఆర్ చెప్పిన మాటలు అక్షర సత్యమని ఇయ్యాల తేలిపోయింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కృష్ణా ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పజెప్తం అంటడు. కృష్ణానదీ జలాల్లో అతితక్కువ వినియోగం చేస్తరు. ఇప్పుడు గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై లోపాయికారిగా ఒప్పందం చేసుకుంటరు'అని హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. ఏపీలో కలవక ముందు తెలంగాణలో 16.03లక్షల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో 48.74లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది అని పేర్కొన్నారు.



న్యూఢిల్లీలో ఆదివారం మొక్కను నాటుతున్న కేంద్ర వ్యవసాయమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

# వేగం పెంచిన సిట్

>> వెంకటగిరితో పాటు రెండవ దఫా ఏర్పాటైన సిట్ బృందంలో ని ఎస్‌పి రవీందర్ రెడ్డి వున్నారు. ఆయనతో పాటు మరికొందరు సిట్ స భ్యులు కూడా వున్నారు. రాత్రి తొమ్మిది గంటల వరకు నవీన్ రావును సిట్ బృందం విచారించింది. నవీన్ రావుకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, కా ర్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్‌తో సన్నిహిత సంబంధాలున్నాయని సిట్ భావిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ సమయంలో బ్యూరోక్రాట్లతో పాటు వ్యాపారులు, సెలబ్రటీలు, జడ్జిలు, జర్నలిస్టులు, రాజకీయ నేతల ఫోన్‌లను కూ డా ట్యాప్ చేయడం తెలిసిందే. రాజకీయ నేతల్లో ప్రతిపక్ష నేతలతో పాటు స్వపక్ష నేతలు కూడా వుండడం విదితమే. బిఆర్ఎస్‌లో అసంతృప్తితో వు న్న పలువురు నేతల ఫోన్‌లు కూడా అప్పట్లో ట్యాపింగ్‌కు గురైనట్లు వార్తలు వచ్చాయి. రాజకీయ నేతల ఫోన్‌ల ట్యాపింగ్ వెనుక నవీన్ రావు హస్త ం వుందని ఆరోపణలు వచ్చాయి. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన బాధితుల్లో కొందరు నవీన్ రావు పేరును సిట్‌కు చెప్పారని తెలిసింది. ఈ నే పథ్యంలోనే ఆయనను తాజాగా ఎనిమిది గంటల పాటు విచారించింది. విచారణ సమయంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, మాజీ మంత్రి కెటిఆర్ లతో వున్న సంబంధాలపై నవీన్ రావును సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో పాటు మీడియా అధినేత శ్రవణ్ రావు, ఎస్ఐబి నాటి బాస్ ప్రభాకర్ రావు, ఇదే కేసులో అరెస్టయిన నలుగురు నిందితులతో వున్న పరిచయాల గురించి సిట్ అధికారులు నవీన్ రావును ప్రశ్నించినట్లు తె లిసింది. దీంతో పాటు ఫోన్ ట్యాపింగ్ జరిగిన సమయంలో నవీన్ రావు ఏం చేశారు...? ఎవరెవరితో భేటీ అయ్యారు... ? అప్పట్లో ఆయన వా డిన ఫోన్ నంబర్లు ఏమిటీ...? వాటి కాల్ డేటాపైనా సిట్ ఆరా తీసింది. ఆయన ఫోన్ నుంచి అప్పట్లో ఎవరెవరికి ఫోన్ లు వెళ్లాయి...? ఇందు లో నాటి ఎస్ఐ బి బాస్ ప్రభాకర్ రావుకు ఏమైనా కాల్స్ వెళ్లాయా...? వెళ్లి వుంటే ఎన్నిసార్లు వెళ్లాయి...? ఈ సమయం లో ఏ విషయమై ఇద్ద రు చర్చించారు...? అనే దానిపై సిట్ ఆరా తీసింది. కాగా విచారణ తరువాత నవీన్ రావు మీడియాతో మాట్లాడుతూ తన విచారణ రాజకీయ కో ణంలో జరిగిందని తెలిపారు. ఫోన్ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని, అయితే కావాలని తనను ఇందులో ఇరికెంచే ప్రయత్నం జరుగుతు ందని ఆయన తెలిపారు. ఈ కేసులో నిందితులుగా వున్న వారితో తాను ఏనాడు మాట్లాడలేదని, ఇదంతా తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగిం చేదిగా వుందని ఆయన తెలిపారు. ఈ కేసులో 2024లో ఒకసారి తనను విచారించారని, ఇది రెండవసారి అని ఆయన తెలిపారు. ఫోన్ ట్యాపిం గ్‌తో సంబంధం వున్న వ్యక్తులతో ఏమైనా పరిచయాలు వున్నాయా....? అని అడిగారని, ట్యాపింగ్‌కు వాడిన ఉపకరణాల గురించి అడగలేదని నవీ న్ రావు తెలిపారు. మరోసారి తనను విచారణకు రావాలని సిట్ అధికారులు కోరలేదని, ఒకవేళ రమ్మంటే వస్తానని ఆయన తెలిపారు. కాగా నవీన్ రావు వెల్లడించిన సమాచారం ఆధారంగా బిఆర్ఎస్‌లో కొందరు ప్రముఖులను సిట్ అధికారులు విచారించే వీలుందని తెలిసింది. వీరితో పాటు మరి కొందరు రాజకీయ నేతలను కూడా విచారించే వీలుందని సమాచారం.

# రేవంత్ రెడ్డికి బేసిన్లు, బేసిక్స్ తెలవదు

## రాష్ట్ర పజలను మోసం చేసినందుకు రేవంత్, రాహుల్‌ను ఎన్నోసార్లు ఉరితీయాలి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి4:** కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణ ప్రజలను మోసం చేసినందుకు రేవంత్‌ని, రాహుల్‌గాంధీని కాంగ్రెస్ నేతలను ఎన్నోసార్లు ఉరితీయాలి, మాట తప్పిన హామీలకు లెక్కవేస్తే కాంగ్రెస్ నాయకులను ఎన్నిసార్లు ఉరితీయాలో కూడా తెలియదు అని వ్యాఖ్యానించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నదీ జలాలపై కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా తెలంగాణకు చేస్తున్న ద్రోహాలను ప్రజలకు ముందు తీసుకొస్తున్నామంటూ బిఆర్ఎస్ తరపున ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా కెటిఆర్ మాట్లాడారు. ఉరిశిక్షల గురించి మాట్లాడుతున్న రేవంత్‌పై ఘాటుగా స్పందించిన కెటిఆర్ అశోక్ నగర్ అడ్డా మీద 2లక్షల ఉద్యోగాలిస్తామని మాట తప్పినందుకు రాహుల్ గాంధీపై రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పినందుకు వరంగల్, బీసీలకు 42శాతం రిజర్వేషన్ అని చెప్పి మాట తప్పినందుకు కామారెడ్డిలో కాంగ్రెస్ నాయకత్వంపై ప్రజలు తీర్పు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సర్వభ్రష్ట ప్రభుత్వానికి అధినేత రేవంత్ ముఖ్యమంత్రి అని కెటిఆర్ ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డికి ఒక్క భాషే వచ్చని.. తమకు మూడు నాలుగు భాషల్లో తిట్టుడు వచ్చంటూ వార్నింగ్ ఇచ్చారు.

సీఎం రేవంత్ రెడ్డికి ఐఐటి, ఐఐఐటికి మధ్య తేడా తెలియదని ఎద్దేవా చేశారు. బచావత్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు తేడా తెలవదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఒక అజ్ఞాని అని.. ఆయనను ఉష్ట్రపక్షి అని అభివర్ణించారు. నదీ జలాల్లో తెలంగాణకు కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. 65 ఏళ్ల కాంగ్రెస్, 17ఏళ్ల రేవంత్ పాత బాస్ చంద్రబాబు నాయకత్వంలో రేవంత్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అన్నారు. 2014 వరకు రాష్ట్రాన్ని నిరాటకంగా పాలించిన కాంగ్రెస్,టిడిపి పార్టీ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలకు పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు జరిగిన ద్రోహానికి కాంగ్రెస్ ప్రధాన కారణంగా పేర్కొన్నారు.

మనం చరిత్రలో ఎన్నో చూశాం. కానీ చెక్‌డ్యామ్‌లను పేల్చే ఇలాంటి చెత్త ప్రభుత్వం భారతదేశంలోని ఇంకెక్కడా కానీ ఉండదు. కరువు నేలల్లో సిరులు పండించి మరణ మృదంగాలు మోగిన చోట జీవకళ తెచ్చిన పరిపాలకుడు.. అవమానాలు భరించి ఆకలి బాధలు మాయం చేసిన మహానాయకుడు, తెలంగాణను అన్నపూర్ణగా నిలిపిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. కేసీఆర్‌ను తిడుతున్న వారిని ఎన్నిసార్లు ఉరితీయాలి. 420 హామీలిచ్చి ఎగవేసిన పార్టీని 420 సార్లు కాంగ్రెస్‌ను ప్రజలు శిక్షించాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సమైక్య వాదుల బూట్లు పాలిష్ చేసిన అల్పుడి చేతిలో తెలంగాణ ఉండటం బాధగా ఉంది. రేవంత్ రెడ్డికి బేసిన్లు, బేసిక్స్ తెలవదు. పదే పదే కేసీఆర్ చావును కోరుకునే రాబందు రేవంత్ అని కెటిఆర్ మండిపడ్డారు. ఎన్టీఆర్ చెప్పినట్టు కాంగ్రెస్ నేతలంతా కుక్క మూతి పిందలేనన్నారు. పేల్చివేతలు, కూల్చివేతలు, ఎగవేతలు తప్ప రాష్ట్రంలో ఏమీ జరుగడం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు అధికార మదంతో విర్రవీగుతూ అహంకారంతో,పరుషమైన మాటలతో వాట్లాడటం ప్రజాస్వామ్యానికి అవమానం అని అన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో ఇప్పటికే వందలాది రైతులు,ఆటోడ్రైవర్లు,గుకుకుల విద్యార్థులు,నేతన్నలు ప్రాణాలు కోల్పోయారని, ఈ ప్రాణాలకు ఎవరు సమాధానం చెప్తారని కెటిఆర్ ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీలో 8 మంది శవాలను బయటకు తీయలేదని పేర్కొన్నారు.

# సెర్చ్ వారంట్లు ఎలా జారీచేస్తున్నారు?

>> చేస్తున్నారని తెలిపారు. జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ లకు మాత్రమే వున్న అధికారాలను కొందరు పోలీసు అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని ఆయన వాదించారు. కార్డన్ సర్చ్ పేరిట ఎలాంటి వా రంట్ లేకుండానే ఇళ్లలోకి ప్రవేశించి గుర్తింపు పత్రాలు అడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమయంలో అక్రమ వలసదారుల కోసం గాలింపు అని పోలీసులు చెబుతున్నారని పిటిషనర్ తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఏ నిబంధనల ప్రకారం పోలీసులు సెర్చ్ వారంట్లు జారీ చేస్తు న్నారో వివరణ ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. అయితే ప్రజా భద్రత నిమిత్తం పోలీసులు చేస్తున్న కృషిని అభినందించాల్సిందనని, అయితే సెర్చ్ వాంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు వుందా..? అనే విషయమై అన్ని ఆధారాలతో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై తదుపరి వి చారణను రెండు వారాలు వాయిదా వేసింది.

# మళ్లీ పెరిగిన ఎరువుల ధరలు

>> ఎరువుల ధరలు మరింత ఆవేదనకు గురిచేస్తున్నాయి. వానాకాలం సీజన్లో ఒకసారి ఎరువుల ధరలు పెరిగితే యాసంగిలో డీఏపీ, యూరియా మినహా అన్ని రకాల ఎరువుల ధర రూ.50 మేరకు పెంచారు. మరోవైపు యూరియా కొనుగోలుకు ప్రభుత్వం యాప్ తీసుకురావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ఈ రబీలో సాగు కోసం అన్ని రకాల ఎరువులు కలిపి దాదాపు 19.60 లక్షల టన్నుల వరకూ అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

ఇందులో ప్రధానంగా 9.8 లక్షల టన్నుల యూరియా, 1.6 లక్షల డిఏపి, 7 వేల టన్నుల ఎంఒపి, కాంప్లెక్స్ 7 వేల టన్నులు, ఎంఎస్‌పి 6 వేల టన్నులు చొప్పున అవసరం అవుతుందని లెక్కకట్టారు. ఈ నేపధ్యంలో పెరిగిన ఎరువుల ధరలు మరింత ఆర్థిక భారం అయిందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. డీఏపీ ధర ప్రస్తుతం పాత ధర 50 కిలోల బస్తాకు రూ.1429 సబ్సిడీ మినహాయిస్తే రూ.267 రైతులకు ఇస్తున్నారు. అలాగే ఉంది. మిగతా ఎరువుల బస్తాలపై రూ.50 పెరిగాయి. 20:20:13 ప్రస్తుతం రూ.1450 నుంచి రూ.1500లకు చేరింది. 14:35:14 ప్రస్తుతం రూ.1900 నుంచి రూ.1950లకు, 28:28:0 ప్రస్తుతం రూ.1850 నుంచి రూ.1900లకు చేరింది. పొటాష్ రూ.1700 నుంచి రూ.1800 పెరిగింది. యాసంగిలో కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఎక్కువగానే ఉంటుంది. ముడి సరుకుల ధరలు పెరగడంతోనే ఎరువుల ధరలు పెంచాల్సి వస్తోందని సంబంధిత కంపెనీలు చెబుతున్నాయి.

# వ్యవసాయ మార్పులకు శ్రీకారం

## కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారి రమణకుమార్

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో మార్పులు వస్తున్నాయని, ఇందుకు అనుగుణంగా కేంద్రం చర్యలు తీసుకుంటోందని కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారి రమణ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సాగులో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతోందన్నారు. ధన ధాన్య కృషి యోజన పథకం కింద మంజూరు చేసిన రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఆదివారం పర్యటించారు. ఇందులో భాగంగా వ్యవసాయ పంటలను ఆయన పరిశీలించారు. వ్యవసాయంలో క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో పర్యటించిన నోడల్ అధికారి జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో వ్యవసాయ పొలాలను, ఎర్రచందనం పెంపును పరిశీలించారు.

పొలాల్లో రైతులు నూతన పద్ధతిలో కూరగాయల పండించే పద్ధతిని పరిశీలించారు. అలాగే పొలంలో ఔషధాలకు ఉపయోగపడే ఎర్రచందనం, వివిధ రకాల చెట్లను పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ సిస్టం ద్వారా వ్యవసాయాలను చేస్తే అధిక లాభాలు ఉంటాయని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధన ధాన్య కృషి యోజన పథకం ద్వారా ఆరేళ్లకు రైతుల విత్తనాలు ఎరువుల కోసం సుమారుగా 1,000 కోట్ల రూపాయలు మంజూరు చేస్తారని తెలిపారు. నూతన విధానంతో వ్యవసాయం చేయడం రైతులకు లాభదాయకమని తెలిపారు. నారాయణపేట్ జిల్లాను ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం కింద మంజూరు చేయడంతో జిల్లాలో పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. ఈ నేపథ్యంలో నోడల్ అధికారి రమణ కుమార్‌కు పలువురు రైతులు తమ సమస్యలను గూర్చి తెలిపారు. ప్రధానంగా పత్తి పంట సాగు క్రయ విక్రయాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఉపాధి హామీ పథకంలోని కూలీలను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసే విధంగా చూడాలని రైతులు కోరారు. దీంతో నోడల్ అధికారి రమణ కుమార్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చైర్మన్‌తో ఫోన్లో మాట్లాడారు. పత్తి కొనుగోళ్లు, సాగుకు సంబంధించి తన దృష్టికిరైతులు ఎదుర్కొంటున్నఇబ్బందులను చైర్మన్‌కు వివరించారు.

# రైతులకు యాంత్రీకరణ రూ.101.83 కోట్లు విడుదల

## 50 శాతం రాయితీపై త్వరలో పంపిణీ

## 5.50 లక్షల మంది దరఖాస్తు

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొలి వారం నుంచి రైతుల కోసం వ్యవసాయ యంత్రీకరణ పథకాన్ని అమలు చేయనుంది. దీని ద్వారా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు లభించనున్నాయి. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాజాగా రూ.101.83 కోట్లను విడుదల చేసింది. వ్యవసాయ శాఖ అధికారుల వివరాల ప్రకారం ఈ యంత్రీకరణ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమలు చేయనున్నాయి. ఇందుకు కేంద్రం వాటాగా 60 శాతం ఇవ్వనుండగా, 40 శాతం సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ఈ పథకం ద్వారా రైతులకు సబ్సిడీకి వ్యవసాయ పనిముట్లు అందించనున్నారు. వ్యవసాయ పనిముట్లపై రాయితీపై ఇవ్వనుంది.

ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులు గరిష్టంగా వ్యవసాయ పనిముట్లపై 50 శాతం రాయితీ పొందే అవకాశముండగా, ఇతర వర్గాలవారు 40 శాతం తగ్గింపు పొందవచ్చు. ఇప్పటికే ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు 5.50 లక్షల మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, 1.30 లక్షల మంది రైతులను తొలుత ఎంపిక చేశారు. వీరికి త్వరలో రాయితీ సౌకర్యం కల్పించనున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం నిధులు కూడా జమ చేయడంతో తక్కువ ధరకే పనిముట్లు లభించడం వల్ల రైతులకు భారం తగ్గనుంది.ఇందుకు గాను ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు చేసింది.

ఐదు ఎకరాల్లోపు సాగు భూమి ఉన్న చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. 15 రకాల పనిముట్లు సబ్సిడీ జాబితాలో పొందుపర్చారు. ప్రస్తుతం 16 కంపెనీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయా కంపెనీల నుంచి కొనుగోలు చేస్తే రైతు వాటా మినహాయించి మిగతాది ప్రభుత్వం కంపెనీల అకౌంట్లోమ జమ చేస్తుంది. కాగా రూ.లక్షకు మించి కొనుగోలు చేసిన పరికరాలకు ప్రభుత్వం జియో ట్యాగింగ్ ఇవ్వనుంది. అలాగే చిన్న పరికరాలకు ఏఐ ఆధారిత టెలిమాటిక్స్ కిట్‌లను అమర్చుతారు. యంత్రాలు దుర్వినియోగం కాకుండా చేసేందుకు టెక్నాలజీని ఉపయోగించుకోనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

# మహిళలకు పిఎం కిసాన్ రూ.12 వేలకు పెంపు!

## మిగిలిన రైతులకు రూ.8 వేలు ఆలోచనలో కేంద్రం


## 2026-27 బడ్జెట్‌లో నిధుల కేటాయింపుకై కసరత్తు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** దేశంలోని మహిళా రైతులకు సంబంధించి కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతోంది. ప్రస్తుతం ఇస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద ఇచ్చే ఆర్థిక సహాయాన్ని పెంపుదల చేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలియవచ్చింది. కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని ఇప్పటికే దేశ వ్యాప్తంగా కేంద్రం అమలు చేస్తోంది. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ఏడాదికి వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం ప్రస్తుతం 6 వేల రూపాయల రూపాయలను మూడు విడతలుగా వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నేపథ్యంలో కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా రైతులకు అందించే ఆర్థిక సాయాన్ని ప్రత్యేకంగా మహిళా రైతులకు రెట్టింపు చేసే ఆలోచన చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికార వర్గాల ద్వారా తెలియవచ్చింది. ఈ లెక్కన అర్హులైన మహిళా రైతులకు ఏడాదికి 12 వేల రూపాయలకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ఆర్థిక సహాయాన్ని పెంచాలని దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో దీనికి సంబంధించి ఫిబ్రవరి 1వ తేదీన కేంద్రం ప్రవేశపెట్టనున్న 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు గాను ప్రభుత్వానికి అదనంగా 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెరగనుందని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నట్లు సమాచారం. ఇదే సమయంలో పిఎం కిసాన్ కింద ప్రస్తుతం అందిస్తున్న 6 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మిగిలిన రైతులకు మరో 2 వేల రూపాయలు పెంచి 8 వేల రూపాయలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలియవచ్చింది. దీన్ని కూడా వచ్చే కొత్త బడ్జెట్‌లో వెల్లడించే వీలుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి ఒకరు వెల్లడించారు.

# అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్. చిత్రంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తదితరులు

**హైదరాబాద్ (మలక్ పేట), జనవరి 4, ప్రభాతవార్త:** దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర దివ్యాంగుల, వయవృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ వ్యక్తుల సాధికారత శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని జాతీయ వికలాంగుల పార్కులో లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వికలాంగుల సంక్షేమ శాఖ చైర్మన్ ముత్తునేని వీరయ్య, ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్, డైరెక్టర్ శైలజ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగలతో కలిసి లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అందుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అని పేర్కొన్నారు. అంధులకు, దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుతోపాటు పాఠ్యపుస్తకాలను బ్రెయిలీ లిపిలో అంధ విద్యార్థులకు అందజేస్తామని వివరించారు. ఉచిత బస్సు సౌకర్యము కల్పించనునట్లు పేర్కొన్నారు. త్వరలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా త్వరలో ఏర్పాటు చేయనునట్లు వివరించారు. దివ్యాంగులకు కోర్టు ఉద్యోగాలలో నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చామని, ఉన్నత విద్యల ఐదు శాతం రిజర్వేషన్ ఇచ్చామని, వికలాంగులు స్వయం సమృద్ధి సాధించేలా రాష్ట్రంలో వికలాంగుల సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ని ఏర్పాటు చేయడం జరిగిందని, సుమారు 6000 గ్రూపులను ఏర్పాటు చేశామని వివరించారు. దివ్యాంగుల ఉద్యోగుల కోసం వారు ఎక్కడైతే ఉద్యోగం చేస్తున్నారో అక్కడే ప్రమోషన్ పొందేలా జీవో నెంబర్ 34 ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపామని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా పోలీస్ శాఖలో అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో కేటాయించిన ఉద్యోగాలలో వికలాంగులకు రిజర్వేషన్లు ఇవ్వడం జరిగిందని వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా వికలాంగులకు అందించే పరికరాలను 40శాతం బెంచ్ మార్క్ వైకల్యానికి అందిస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కృషి చేస్తున్నామని, అదేవిధంగా వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలియజేశారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ. 100 కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు.

బ్రెయిలీ లిపిని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశపెట్టనునట్లు వివరించారు. వికలాంగుల సంక్షేమ శాఖకు అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం, వారి అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ లు వికలాంగుల ఆత్మబంధువులు అని తెలిపారు. తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ లో పనిచేసే ఉద్యోగులకు పిఆర్సిలు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లదేనని తెలిపారు. రాష్ట్రంలో వికలాంగులకు ఇందిరమ్మ ఇళ్ల లో 5శాతం రిజర్వేషన్లు ఇవ్వడం జరిగిందని, వేలదిమంది వికలాంగులు ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్నారని వివరించారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ క్యాలెండర్ ను వారు ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో దివ్యాంగుల శాఖ సెక్రెటరీ అనిత రామచంద్రన్, డైరెక్టర్ శైలజ, ఫెడ్ అధ్యక్షుడు గంగారం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, చందన తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ యూరియా సమస్య

## పలు ప్రాంతాల్లో రోడ్డెక్కుతున్న రైతులు

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేదని, అదనంగా నిల్వలు కూడా ఉన్నాయని వ్యవసాయ శాఖ చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో రైతులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒక్క బస్తా యూరియా కోసం తెల్లవారుజాము నుంచే క్యూలో పడిగాపులు కాస్తున్న పరిస్థితి దాపురించింది. సరిపడా యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్న రైతులు మళ్లీ రోడెక్కుతున్నారు.

రాష్ట్రంలోని కరీంనగర్ రూరల్ మండలంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా ఆయా సంఘాలకు వచ్చిన యూరియా ప్రతిరోజు పంపిణీ చేస్తున్నప్పటికి సరిపోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఆదార్ కార్డు, పట్టా దారు పుస్తకం ఆదారంగా ఓటీపీ చెబితేనే ఎకరానికి ఒక బస్తా అందజేస్తున్నారు. ఈ యూరియా సరిపోవడం లేదని, ఎకరానికి మూడు బస్తాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కరీంనగర్, దుర్శేడ్, చెర్లబూత్కూర్, నగునూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలతో పాటు, తీగలగుట్టపల్లి జిల్లా మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)కు యూరియా వచ్చింది. అయితే కొందరు రైతులు క్యూలో నిలబడి చివరకు యూరియా అందక నిరాశతో వెనుదిరుగుతున్నారు. అలాగే ఖమ్మంజిల్లా చింతకాని మండలంలో కొందరు రైతులకు యూరియా కోసం కూపన్లు పంపిణీ చేశారు. అయితే అరకొరకగా మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు ఉన్నాయి.

ఒక్కో రైతుకు సాగు విస్తీర్ణాన్నిబట్టి 5 నుంచి 10 కట్టల అవసరం ఉండగా, ఒకటీ రెండు బస్తాలు మాత్రమే సరఫరా చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, చంద్రయ్యపల్లి, రామవరం, స్వామినాయక్‌తండా, బుచ్చినాయక్‌తండా, రాంనగర్ గ్రామాల్లో రైతులు తెల్లవారుజామునే తరలివచ్చి క్యూ కట్టారు. చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ, పాపయ్యపేట, లింగగిరి గ్రామాల్లో రైతులు యూరియా కోసం చలిని సైతం లెక్క చేయకుండా దుప్పట్లు కప్పుకొని లైన్‌లో వేచి ఉన్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం రైతులు ఉదయం 4 గంటల నుంచి పడిగాపులు కాశారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌పై

# జాతీయస్థాయిలో పోరాటం

## ఎఐఎస్టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో తీర్మానం

### ప్రకటించిన ఎఐఎస్టీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 4** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని, పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్టీఎఫ్) డిమాండ్ చేసింది. ఆదివారం రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి పలు రాష్ట్రాల నుండి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి జి సదానందం గౌడ్ మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం అమలు తేదీకి ముందు నియామకమైన ఉపాధ్యాయులు రెండేళ్లలో టెట్ పాస్ కావాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ(ఎన్‌సిటీఈ) నిరక్ష ్యం వల్లే ఇలాంటి తీర్పు వచ్చిందని వారు అభిప్రాయపడ్డారు.

సుప్రీంకోర్టు తీర్పు వచ్చి 4 నెలలు గడుస్తోందని, దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. టెట్ అంశంపై కొందరు ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావించినప్పటికి ఫలితం లేకుండా పోయిందన్నారు.

ఈ నేపథ్యంలో అల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఏఐ జాక్టో ) అధ్వర్యంలో ఉమ్మడి ఉద్యమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎస్‌టియు టిఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, నాయకులు పరమేశ్, సాబేర్ అలి, పున్న గణేష్, శ్రీశైలం, శ్రీధర్ పాల్గొన్నారు.

# పాముతో ట్రాఫిక్ పోలీసులను ఆటపట్టించిన ఆటోడ్రైవర్

## వైరల్‌గా మారిన దృశ్యాలు

**హైదరాబాదన(చాంద్రాయణగుట్ట), జనవరి 4, ప్రభాతవార్త :** డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులను మద్యం మత్తులో ఉన్న ఒక ఆటోడ్రైవర్ ఆటపట్టించాడు. తన ఆటోలోంచి ఒక్కసారిగా ఒక పాముని తీసి నానా హంగామా చేశాడు. పోలీసులపైకి దూసుకు వెళ్ళాడు. పోలీసులు అతనిని శాంతింప జేసి శ్వాస పరీక్ష నిర్వహించగా మద్యం తాగినట్లు తేలింది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఆటోడ్రైవర్ ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎం.దాసు కథనం ప్రకారం...చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో చాంద్రాయణగుట్ట ఎంబిఆన్ఎర్ చౌరస్తా వద్ద డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అటుగా గోల్డన్ కాలనీకి చెందన ఆటోడ్రైవర్ ఇర్ఫాన్ (23) మద్యం మత్తులో వచ్చాడు. అతనికి శ్వాస పరీక్ష చేసేందుకు ఆటోను ఆపారు. ఇంతలో ఆ ఆటోడ్రైవర్ తన ఆటోలోంచి ఒక పామును తీసుకువచ్చాడు. దాని మూతిని అదిమి పట్టుకొని తోకను స్ప్రింగ్‌లా చేతికి చుట్టుకుంటూ పోలీసులపైకి వచ్చాడు. తన అటోను ఇవ్వాలంటూ పాముతో బెదిరించాడు. హంగామా చేశాడు. ట్రాఫిక్ పోలీసులు అతికష్టం మీద అతనిని శాంతింప జేశారు. శ్వాస పరీక్ష నిర్వహించగా ఆల్కాహాల్ శాతం 110గా నమోదైయ్యింది. మద్యం సేవించినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. ఆటో సీజ్ చేశారు. కాగా ఆ సమయంలో అటుగా వెళుతున్న వారు ఈ దృశ్యాన్ని తమ మొబైలల్లో బంధించి సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. అది వైరల్‌గా మారింది.




పాము పట్టుకొని ట్రాఫిక్ అధికారితో వాదనకు దిగిన ఆటోడ్రైవర్

# హెల్త్‌పాలసీపై నేడు అసెంబ్లీలో చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** బిఆర్ఎస్ సవాల్‌తో మొన్న అసెంబ్లీలో కృష్ణా జలాలపై చర్చించిన ప్రభుత్వం మరో కీలక అంశంపై డిబేట్‌కు సిద్దమైంది. హెల్త్ పాలసీపై సోమవారం సభలో చర్చించాలని నిర్ణయించింది.ఈ పాలసీ రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపిన విషయం తెలిసిందే.

భూదోపిడి కోసమే ప్రభుత్వం దీన్ని తీసుకొచ్చిందంటూ బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. అసెంబ్లీ వేదికగా వీటిని తిప్పికొట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. అయితే ఇప్పటికే అసెంబ్లీ సమావేశాలను బిఆర్ఎస్ బహిష్కరించింది.

# అమెరికా దురాక్రమణను ఖండిస్తూ సిపిఐ(ఎంఎల్) నిరసన




వెనుజులాపై అమెరికా దాడిని ఖండిస్తూ ఆదివారం హైదరాబాద్‌లో ఆందోళన చేస్తున్న సిపిఐ(ఎంఎల్)

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 4, ప్రభాతవార్త:** వెనెజులపై అమెరికా సాయుధ ఖండిస్తూ దురాక్రమణ ను చేయడాన్ని ఖండిస్తూ సి.పి.ఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలలో భాగంగా ఆదివారం విద్యానగర్ చౌరస్తాలో గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ నిరసన అనంతరం సి.పి.ఐ (ఎంఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేష్ ,రాష్ట్ర సెక్రెటేరియట్ సభ్యులు సదానందం, పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు స్వరూప, రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రవీణ్, మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ప్రదీప్, పి.డి.ఎస్.యు రాష్ట్ర కార్యదర్శి అనిల్ ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ నిన్న రాత్రి అమెరికా సామ్రాజవాదం వెనేజుల పై సాయుధ దాడి చేయడానికి ఖండిస్తున్నామన్నారు.గత సంవత్సరం కాలంగా బెదిరిస్తూ అర్ధరాత్రి వెనెజులపై సైనిక స్థావరాలపై, నివాస స్థావరాలపై దాడి చేసి ప్రజల్ని చంపడాన్ని దుర్మార్గమన్నారు.దేశ అధ్యక్షుడైన నికోలాస్ మధురోను,అతని జీవిత సహచరి సిలియా ఫోరస్ ను కిడ్నాప్ చేసి న్యూయార్క్ తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు.అమెరికా ఇలా అనేక దేశాలపై దాడులు చేస్తూ, విధ్వంసం చేస్తూ దేశాలను స్వాధీన పరచుకుంటున్నది. ఆయా దేశాల ఖనిజాలను స్వాధీనం చేసుకుంటున్నది వెనిజులా డ్రగ్స్ సరఫరా చేస్తుందని అబద్ధాలు ఆడుతూ, కేసులు పెట్టి ,దాడులు చేస్తున్నది. వెనిజులలో ఉన్న ముడి చమురును, సహజ వాయువునూ, ముడి ఖనిజాలను, బంగారు నిల్వలను స్వాధీనం చేసుకునేందుకు ఈ కుట్ర పన్నిందన్నారు.గతంలో ఇరాకు ,అఫ్గాన్ , లిబియా,పాలస్తేనాపై దాడులు చేసిందన్నారు.అమెరికా కిడ్నాప్ చేసిన మధురో తన సహచరిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భద్రత మండలి, ఐక్య రాజ్యసమితి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు వరలక్ష్మి,విజయలక్ష్మి, పుష్ప, శ్యామల, నాగలక్ష్మి,ప్రజా సంఘాల నాయకులు రవికుమార్,కృష్ణబాబు, భాస్కర్ అంజి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు రూ.10.3 కోట్ల విడుదల

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. ఈ అట్రాసిటీ కేసుల విషయంలో బాధితులకు పరిహారం కింద రూ.10.3 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి సాంఘిక, గిరిజన, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 1,080 మంది బాధితులకు సోమవారం నుండి ఈ మొత్తాన్ని అధికారులు అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు పరిహారం అందని విషయంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. తాజాగా బాధితులకు ఆర్థిక సాయానికి ఉత్తర్వులు ఇచ్చింది.

## టెట్ రాసే ఇన్‌సర్వీస్ టీచర్లకు

# ఒడి, స్పెషల్‌లీవ్ ఇవ్వండి

## విద్యాశాఖ కార్యదర్శికి లేఖ రాసిన పాఠశాల విద్య డైరెక్టర్

### డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు రెండుసార్లు అవకాశం ఇవ్వడానికి వీలుంటుందని లేఖలో పేర్కొన్న డైరెక్టర్

**హైదరాబాద్, జనవరి 4,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పరీక్షలు రాసే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఒడి, స్పెషల్ లీవ్‌ను ఇవ్వడంపై పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ విద్య శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. లేఖలో టెట్ జనవరి-2026 పరీక్షకు హాజరయ్యే ఉపాధ్యాయులకు పరీక్ష రోజున ప్రత్యేక సెలవు(స్పెషల్ లీవ్), ఆన్ డ్యూటీ సౌకర్యం కోసం కొన్ని ఉపాధ్యాయ సంఘాల నుండి ప్రాతినిధ్యాలు సమర్పించబడ్డాయని డైరెక్టర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, కెజిబివిలు, మోడల్ స్కూల్స్ ఇతర ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న 71670 మంది సర్వీస్ ఉపాధ్యాయులు ఈ నెల 3 నుంచి 20 మధ్య జరిగే కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) పద్ధతిలో నిర్వహించబడే టిజి టెట్ జనవరి-2026 కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు టెట్‌కి హాజరైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పరీక్ష తేదీన ఆన్ డ్యూటీ సౌకర్యం లేదంటే ప్రత్యేక సెలవు కోసం ప్రాతినిధ్యం చేశాయని పేర్కొన్నారు. ప్రభుత్వం డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు రెండుసార్లు మాత్రమే సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులకు ఓడీ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందని... అదే తరహాలో మొదటిసారి టెట్ రాస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, వారి ప్రస్తుత పోస్టింగ్‌కు ఒకసారి మాత్రమే తప్పనిసరి అయిన టెట్ పరీక్ష రాయడానికి ఆన్‌డ్యూటీ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించాలని అభ్యర్థించబడిందని లేఖలో పేర్కొన్నారు. అయితే ఇదే అంశంపై విద్యా శాఖ కార్యదర్శి నిర్ణయం తీసుకోవల్సి ఉంది. పాఠశాల విద్య డైరెక్టర్ ఈ నెల 2న విద్యా శాఖ కార్యదర్శికి లేఖ రాశారు.

# మహిళల భద్రత చిన్నారుల రక్షణపై లఘుచిత్రాలు, పోస్టల్ చిత్రాల పోటీలు

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళా భద్రతా విభాగం (డబ్లుఎస్‌డబ్ల్యు) ఆధ్వర్యంలో కాలేజి విద్యార్థులతో పాటు పలు వర్గాల వారి కోసం మహిళల భద్రత, చిన్నారుల రక్షణపై ఒక్క నిమిషం లఘు చిత్రాలు, పోస్టల్ చిత్రాలపై పోటీలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన లఘు చిత్రాలతో పాటు పోస్టల్ చిత్రాలను తయారుచేసేందుకు ఆసక్తి కలిగిన వారు వచ్చే ఫిబ్రవరి 12వ తేదీలోగా డబ్లుఎస్‌డబ్ల్యుకు పంపాలని ఆ విభాగం అదనపు డిజి చారు సిన్హా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. చిత్రాల రూపకల్పన చేసే వారు మహిళలపై జరిగే హింసతో పాటు ఇళ్లు, పాఠశాలలు, పని ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలతో పాటు మరేదైనా చోట వుండే అభద్రతా వాతావరణ పరిస్థితుల గురించి వివరించాల్సి వుంటుంది. ఇందులో రూపకర్తలు కొత్త విషయాలను చెప్పాలి. ఇందులో పాల్గొనే వారు 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు క లిగిన వారై వుండాలి. వచ్చే మార్చి తొమ్మిదవ తేదీన దీనికి సంబంధిం చిన అవార్డులను ప్రధానం చేస్తారు. ఇందులో ఇతర వివరాలకు డబ్లుఎస్‌డబ్ల్యు డిఎస్‌పి శ్రీధర్ నంబర్ 8712592552తో మాట్లాడాలని చారు సిన్హా తెలిపారు.

వార్త

జాతీయ ప్రగతి అంటే శక్తుల శ్రమ, శక్తి, నిజాయితీ. జాతీయ పతనం అంటే వ్యక్తుల సోమరితనం, స్వార్థం, దుర్గుణం.

న-ఖలీల్ జిబ్రాన్


# మదురో బందీ.. దురాక్రమణే!

'కుక్కను చంపాలంటే దానికి పిచ్చిదని పేరు పెట్టాలని' సామెత ఉండనే ఉంది. ఇప్పుడు వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో విషయంలో శ్వేత సౌధాధిపతి ట్రంప్ అదే చేశాడు. తొలుత మదురోను 'నార్కోటిక్ టెర్రరిస్ట్'గా అభి వర్ణించారు. వెనిజులా అనగానే ప్రపంచంలోనే అతిపెద్ద చమురు బావులున్న దేశం. ఇప్పటికే 200ఏళ్లకు పైగా సరిపడ చమురు నిల్వలున్న అమెరికా వెనిజులా చమురు సంపద కోసం తహతహ లాడుతోంది. ఆ నేపథ్యంలోనే తొలుత మదురోను డ్రగ్స్ రాకెట్‌కు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. గత నెల రోజులుగా కన్నేసి ఉంచిన అమె రికన్ గూఢచారులు మదురో కిడ్నాప్‌కు మార్గం సుగమం చేశారు. ఉన్నట్టుండి శుక్రవారంరాత్రి ఒక్కసారిగా అమెరికన్ సైన్యం వెనిజులా రాజధాని కరాకస్‌పై బాంబులు దాడి చేసింది. గుళ్ల వర్షం కురిపించింది. మొత్తం కరెంటు ఆపేసి ఆపరేషన్ నిర్వహించిన అమెరికన్ బలగాలు ఏకంగా మదురో నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశించి ఆయనను ఆయన పట్ట మహిషి సిరియా ఫ్లోర్స్‌ను కూడా అమెరికన్ కమాండోలు బందీగా తీసుకెళ్లారు. అర్ధరాత్రి ఒంటిగంట నాలుగు గంటల మధ్య ఈ ఆపరేషన్ జరిగింది. కరాకస్‌పై అమెరికన్ సైన్యం భీకరదాడులు చేసింది. వెనిజులాను ఆక్రమించి, తన ఆధిపత్యంలోకి తీసుకోవడంగానీ, తన అనుయాయుల్ని అక్కడ ప్రతిష్టించడం కానీ ప్రణాళికలు సిద్ధం చేస్తూనే రెండునెలలు దాడి తప్పదని సంకేతాలు పంపారు. ఒకపక్క వెనిజులాను హెచ్చరిస్తూనే ట్రంప్ తన వ్యూహం తాను పన్నారు. వెనెజులా సార్వభౌమత్వంపై అమెరికా దాడి చేసిందని లోకమంతా విమర్శిస్తోంది. ఈ సంఘటనను ఖండిస్తున్నాయి. కొన్నిదేశాలు ఈ చర్యను సైనిక దుశ్చర్యగా వర్ణిస్తున్నాయి. అంతర్జాతీయ చట్టాలను అమెరికా ఉల్లంఘించిందని రష్యా భావన. అవసరమనుకుంటే అమెరికా వెనిజులా మధ్య తాము సయోధ్య చేకూరుస్తామని స్పెయిన్ దేశం ముందుకు వచ్చింది. వెనిజులాతో చైనా వ్యూహాత్మక భాగస్వామి. కాగా చైనా ప్రస్తుత పరిస్థితుల్లో ఖండించి ఊరుకుంది. వెనిజులాలో తమ దేశ అధ్యక్షుడిపై ఎన్ని వ్యతిరేకతలున్నా మదురోను కిడ్నాప్ చేయడాన్ని ఆ దేశ ప్రజలు జీర్ణించుకో లేకపోతు న్నారు. సాధారణంగా అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం సంపాదించాలన్న సామ్రాజ్యకాంక్ష కలిగి తమకు కలిసి రాని దేశాలపై తరచు దాడులు చేయడం దాని నైజం. తాజా పరిస్థితుల్లో నోబెల్ బహుమతి గ్రహీత మరియా మచాడోను వెనిజులా పీఠం మీద కూర్చోబెట్టాలని ట్రంప్ ప్రణాళిక.

నిజానికి ఆమె మదురోకు వ్యతిరేకంగా పోరాడిన ఉక్కు మహిళగా పేరుంది. ప్రజల్లో పలుకుబడి ఉన్న నాయకురాలు కనుక ప్రజల్లో వ్యతిరేకత ఉండకపోవచ్చు అన్నది ట్రంప్ అభిప్రాయం. ఆమె ఇంతవరకు మదురో కిడ్నాప్ సంఘటనపై నోరు మెదపలేదు. మదురో తన కిడ్నాప్‌కు ముందే దేశంలో అత్యయిక పరిస్థితిని విధించారు. ఉరుములులేని పిడుగులా అమెరికా సైన్యం వెనిజులాపై దాడికి దాడులకు దిగింది. సైనిక స్థావరంలో పొగ, అంధకారం అలుముకున్నాయి. కారకాసులోని లోకార్లోటా, ఫ్యూర్టే లియునా మిలటరీ చేసే లాగ్ వైరా నౌకాశ్రయం, అనేక ఇతర సైనిక స్థావరాలు పై అమెరికా దళాలు దాడులు చేశాయి. మదురో దంపతులను యుద్ధ నౌకపై అమెరికాకు తరలించారు.

వెనిజులాలో సురక్షితంగా అధికార బదిలీ జరిగే వరకు అక్కడ తమ పర్యవేక్షణ కొనసాగుతుందని మాత్రం ట్రంప్ స్పష్టం చేసారు. వెనిజులాలో అమెరికా చమురు కంపెనీలే వాణిజ్య వ్యవహారాలను నిర్వహిస్తాయని ఆయన చెప్పకనే చెప్పారు. వెనిజులా ఆపరేషన్‌ను ట్రంప్ స్వయంగా వీక్షిస్తూ సంతృప్తి పొందారు.'సెకండ్ల వ్యవధిలోనే ఉక్కు తలుపులను పగలకొట్టడం తాను ఎప్పుడూ చూడలేదని' అంటూనే అంతే అమితవేగంగా అమెరికన్ సైన్యం తమ అభీష్టాన్ని నెరవేర్చిందని కితాబిచ్చారు. ఈ దాడిని ప్రపంచ దేశాల్లోని కమ్యూనిస్టు పాలకులు, పార్టీలు తీవ్రంగా ఖండించాయి. మాదకద్రవ్యాల సాకుతో అమెరికా వెనిజులాను అనేకసార్లు మందలించింది. మాదకద్రవ్యాల సరఫరాను అడ్డుకోవాలని అమెరికా వెనిజులాను కోరుతూనే ఉంది. ఈలోగానే తూర్పు పసిఫిక్, కరీబియన్ సముద్ర జలాల్లో సైన్యాన్ని మొహరించింది. 35 వెనిజులా నౌకలపై అమెరికా దాడులు చేసి 115 మందిని చంపేసింది. డ్రగ్స్ నిరోధానికి ఏం చేయాలో పరస్పర చర్చల ద్వారా నిర్ణయించుకుందామని గత జులైలో మదురో ఓ ఇంటర్వ్యూలో అమెరికాకు పిలుపునిచ్చారు. అయినా ఆగస్టులోనే కరీబియన్ సముద్రంలో భారీగా సైన్యాన్నీ మోహరించింది. తదనంతర పరిణామాల్లో మదురో తమ మాట ఖాతరు చేయడంలేదని భావించి, వెనిజులాను స్వాధీనం చేసుకో వాలని నిర్ణయానికి ట్రంప్ నిర్ణయించారు. మదురో దంపతుల అరెస్ట్ వెంటనే ట్రంపు మహదానంద భరితుడై వెనిజులా ఉపాధ్యక్షుడు సమన్వయంతో రక్షణ కార్యదర్శి పీతే హేగ్ పెట్, విదేశాంగ కార్యదర్శి మార్కో రోహి యోలను నేతృత్వంలో ఒక బృందం వెనిజులా ప్రభుత్వాన్ని తాత్కాలికంగా నడుపుతుందని ట్రంపు నిర్దేశించారు. 2000 సంవత్సరంలోనే మదురో,ఆయన శ్రీమతిపై న్యూయార్క్ ప్రభుత్వం నార్కో టెర్రరిజం కుట్ర అభియో గాలను మోపింది. ఈ కారణంగా అమెరికా చట్టాల ప్రకారం న్యూయార్క్ కోర్టులోనే విచారించనున్నట్లు అమెరికా అటార్నీ జనరల్ పామ్ బోండే వివరించారు. ఏది ఏమైనా అగ్రరాజ్యం అత్యంత చమురు సంపన్న దేశం పైన కన్నేసి, తన కనుసన్నలలో మెలిగే ప్రయత్నం సఫలీకృతమైంది. సామ్రాజ్యవాదం అంటే ఇదే మరి!

> మీరు తప్ప మీకు శాంతిని ఎవరూ ప్రసాదించలేరు. సిద్ధాంతాలు పాలనలో విజయాన్ని సాధించినప్పుడే మీకు మానసిక శాంతి లభిస్తుంది.
>
> ఎమర్సన్



> నిన్ను నీవు కనుగొనడానికి- మార్గం ఇతరుల సేవలో నిన్ను నీవు మరిచిపోవడమే.
>
> మహాత్మా గాంధీ



# సుస్థిరాభివృద్ధితో లక్ష్య సాధన!

**పర్యావరణ వ్యవస్థల క్షీణతతో సహజ నీటినిల్వ, శుద్ధీకరణ సామర్థ్యం తగ్గిపోతుంది. నీరు, పారిశుద్ధ్య ఫలితాలను సంస్థాగత, పాలన సవాళ్లు ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. నీటి నిర్వహణలో బహుళ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ రంగాలు, స్థాయిలలో సమన్వయం పరిమితంగానే ఉంది. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి శుద్ధి కోసం మౌలిక సదుపాయాల విస్తరణ, నిర్వహణకు నిరంతర పెట్టుబడి అవసరం. నిధులు కొరత మరొక అడ్డంకి. స్థానిక స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం అసమానంగానే ఉంది. ఈ సవాళ్లను పరిష్కరిం చడానికి మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాకుండా బలమైన నియంత్రణ, సమర్థవంతమైన నీటి వినియోగం, పర్యావరణ వ్యవస్థ రక్షణ, సమాజ ప్రమేయం, అందరికీ సుస్థిర సమానమైన నీటి నిర్వహణను నిర్ధారించడానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం.**

డా. సునీల్ కుమార్ పోతన

శుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ అనేవిమానవ ప్రాథమిక అవసరాలు. ఐక్యరాజ్యసమితి 2030సుస్థిర అభివృద్ధి లక్ష్యం ప్రకారం ప్రజలందరికీ పరిశుభ్రమైన నీరు అందించాలి. మెరుగైన స్థిరమైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి. పరిశుభ్రతను మెరుగుపర్చాలి. బహిరంగ మలవిసర్జనను అంతం చేయాలి. నీటి కాలుష్యాన్ని తగ్గించాలి. నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించాలి. నదులు, సరస్సులు, చిత్తడి నేలలు వంటి నీటి సంబంధిత పర్యావరణ వ్యవస్థలను రక్షించాలి. మంచి ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి పరిశుభ్రమైన నీరు, సరైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి. 2025 పూర్తి అయ్యేనాటికి, ప్రపంచవ్యాప్తంగా పరిశుభ్రమైన నీరు, పారిశుద్ధ్య అంశాలలో పురోగతి కొనసాగింది, కానీ, కొన్ని అంతరాలు అలాగే ఉన్నాయి.2015 నుండి తాగునీరు, పారిశుద్ధం, పరిశుభ్రత సేవలకు ప్రాప్యత మెరుగుపడినప్పటికీ, కోట్లమంది ప్రజలు ఇప్పటికీ తగినంతగా సేవలు పొందడంలేదు. ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 220 కోట్ల మందికి సురక్షితంగా నిర్వహించే తాగునీటి లభ్యత లేదు. దాదాపు 340కోట్ల మందికి సురక్షితంగా నిర్వహించే పారిశుద్ధ్య సేవలు లేవు. దాదాపు 170 కోట్ల మందికి ఇంట్లో ప్రాథమిక పరిశుభ్రత సౌకర్యాలు లేవు. ముఖ్యంగా పాఠశాలల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇక్కడ దాదాపు 64.6 కోట్ల మంది పిల్లలకు ఇప్పటికీ ప్రాథమిక పరిశుభ్రత సేవలు లేవు, ఇలాంటి పరిస్థితుల్లో ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి 2030 లక్ష్యాలను చేరుకోవడానికి పురోగతి అనేక రెట్లు పెరగాలి. గృహ వ్యర్థజలాల్లో కేవలం 56 శాతం మాత్రమే సురక్షితంగా శుద్ధి చేస్తున్నారు. అనేక ప్రాంతాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. నదులు, సరస్సులు, చిత్తడి నేలలు వంటి మంచినీటి పర్యావరణ వ్యవస్థలు క్షీణిస్తున్నాయి. దేశాల మధ్య భాగస్వామ్య నీటి వనరులపై సహకారం పరిమితంగానే ఉంది. ప్రస్తుత ధోరణులు కొనసాగితే 2049కి ముందు ప్రపంచ స్థాయిలో స్థిరమైన నీటి నిర్వహణ సాధించడం సాధ్యం కాదు.భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ నివేదిక2025 అధికారిక గణాంకాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యం పర్యవేక్షణ ప్రకారం భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించింది. 15.7కోట్లు, జల్‌జీవన్ మిషన్ కింద ఇంట్లో పైపుల ద్వారా పంపు నీటిని పొందుతున్నాయి. మొత్తం జనాభాలోదాదాపు 76 శాతం మంది సురక్షితంగా నిర్వహించే తాగునీటి సేవలను ఉపయోగిస్తున్నారు. దాదాపు అన్ని కుటుంబాలకు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. దేశవ్యాప్తంగాఅన్ని జిల్లాలు స్వచ్ఛ భారత్ మిషన్ కింద బహిరంగ మలవిసర్జన రహితంగా మారినట్లు జలశక్తి మంత్రిత్వశాఖ ధ్రువీకరించింది. అదనంగా,2025 పూర్తయ్యే నాటికి, దాదాపు 5.6



లక్షల గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహితం ప్లస్ హోదాను సాధించాయి. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలతో పాటు స్థిరమైన పారిశుద్ధ్య నిర్వహణను ఇది సూచిస్తోంది. నీటి నాణ్యతకు సంబంధించి భారతదేశం సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. గృహ వ్యర్థ జలాలలో దాదాపు 29 శాతం మాత్రమే విడుదలకు ముందు శుద్ధి చేస్తున్నారు. ఈ సంకేతం బలమైన మురుగునీటి మౌలిక సదుపాయాల అవసరాన్ని సూచిస్తోంది. తాగునీటి భద్రతను పరిష్కరించడానికి ప్రభుత్వం దేశవ్యాప్తంగా 2,100కి పైగా నీటి నాణ్యత పరీక్షా ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. నీటి వినియోగ సామర్థ్యం, నీటి నిర్వహణ, భూగర్భజలాల లభ్యత, వర్షపు నీటి సేకరణ మెరుగైనట్లు 2025 నివేదికలు సూచిస్తున్నాయి. జాతీయ పరిరక్షణ కార్యక్రమాలు, ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి 2030లక్ష్యాల అనుసంధాన పర్యావరణ ఫ్రేంవర్క్‌తో నదులు, సరస్సులు,చిత్తడి నేలలు, భూగర్భ జలాలను రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మొత్తంమీద, 2025 పూర్తయ్యే నాటికి, నీరు, పారిశుద్ధ్య నిర్వహణలో భారతదేశం బలమైన పురోగతిని సాధించింది. నీటి నాణ్యత నిర్వహణ, నీటి వనరుల స్థిరమైన వినియోగాన్ని కీలకమైన అంశాలుగా చెప్పవచ్చు. పరిశుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణలో పురోగతిని సాధించినప్పటికీ, సమర్థవంత నిర్వహణలో సవాళ్లు మిగిలే ఉన్నాయి. అనేక గ్రామీణ, పట్టణప్రాంతాలలో ప్రజారోగ్యానికి, పర్యావరణానికి మురుగునీటి నిర్వహణ వ్యవస్థలు సమస్యగానే ఉన్నాయి. వేగవంతమైన జనాభా పెరుగుదల, అనధికారిక స్థావరాలు, పాతకాలపు మురుగునీటి మౌలిక సదుపాయాల కారణంగా పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ సవాలుగానే ఉంది. నీటి ఒత్తిడి, భూగర్భ జలాల అతి దోపిడీ మరొక ప్రధాన సవాళ్లు. కేంద్ర భూగర్భజలబోర్డు అంచనాల ప్రకారం, భారతదేశంలోని భూగర్భ జలాల అంచనా యూనిట్లలో దాదాపు 18శాతం అతిగా దోపిడీకి గురవుతున్నాయి. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, దక్షిణ భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో వాతావరణ వైవిధ్యం, మారుతున్న వర్షపాత నమూనాలు, కరువులతో నీటి కొరత తీవ్రంగా ఉంది. మంచినీటి పర్యావరణవ్యవస్థలు కూడా ముప్పులోఉన్నాయి. కాలుష్యం, ఆక్రమణ, ఇసుక తవ్వకం, క్రమబద్ధీకరించని నీటి వెలికితీతతో చిత్తడి నేలలు, నదులు, సరస్సులు క్షీణిస్తున్నాయి. పర్యావరణ వ్యవస్థల క్షీణతతో సహజ నీటి నిల్వ, శుద్ధీకరణ సామర్థ్యం తగ్గిపోతుంది. నీరు, పారిశుద్ధ్య ఫలితాలను సంస్థాగత, పాలన సవాళ్లు ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. నీటి నిర్వహణలో బహుళ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ రంగాలు, స్థాయిలలో సమన్వయం పరిమితంగానే ఉంది. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి శుద్ధి కోసం మౌలిక సదుపాయాల విస్తరణ, నిర్వహణకు నిరంతర పెట్టుబడి అవసరం. నిధులు కొరత మరొక అడ్డంకి. స్థానిక స్థాయిలో సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం అసమానంగానే ఉంది. ఈ సవాళ్లను పరిష్కరించడానికి మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాకుండా బలమైన నియంత్రణ, సమర్థవంతమైన నీటి వినియోగం, పర్యావరణ వ్యవస్థ రక్షణ, సమాజ ప్రమేయం, అందరికీ సుస్థిర సమానమైన నీటి నిర్వహణను నిర్ధారించడానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. •

# ఆహార వృథా అరికడితే పేదరిక విముక్తి

వి. వరదరాజు

ప్రపంచవ్యాప్తంగా 2022లో కోటి టన్నులకుపైగా ఆహారం వృథా జరుగుతోందని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్స్ ఫుడ్ వేస్ట్ రిపోర్ట్ వెల్లడించింది. ఈవృథా 164 కోట్ల(ప్రపంచ జనాభాలో 20శాతం )మంది ఆకలి తీర్చగలదని ఆ నివేదిక లెక్కగట్టింది. అత్యధికంగా ఆహారాన్ని నేలపాలు చేస్తున్న దేశాల్లో ఇండియా ఒకటి. ఇక్కడి సంవత్సర కుటుంబ సగటు వృథా 55కేజీలు. అమెరికాలో 73కిలోలు. ఇండియా అత్యధిక జనాభా గల దేశం, కనుక ఇక్కడ జరుగుతున్న ఆహార వృథా చాలాఎక్కువ. ఏముంది మనం పారేసేవి పిడికెడు మెతుకులే కదా అని అనుకుంటే పొరపాటు. తిలా పాపం తలా పిడికెడుగా పరిణమిస్తుంది. వాతావరణం మార్పుకు దారితీస్తుంది. ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. సామజిక అన్యాయం కూడాను. ఒక సంవత్సరానికి లక్ష కోట్లవిలువైన ఆహారం ప్రపంచవ్యాప్తంగా నేలలో కలిసిపోతున్నది. దేశంలో 20 కోట్ల మంది పేదలు రాత్రి పూట తిండి లేకుండా కడుపులో కళ్ళు పెట్టుకొని పడుకోవలసి వస్తుంది. ఇదొక అమిత విచారకర వాస్తవం. కానీ మనం ఏడాదికి 73మిలియన్ టన్నుల వండిన ఆహారంపెంటపాలు చేస్తున్నాం. ఎంత అమానుషమైన పనో మనందరం ఆలోచించాలి. వృథా అరికట్టాలి. పోనీ ఇక్కడ తగినన్ని పంటలు పండడం లేదా? పండుతున్నాయి. అత్యధికంగా పంటలు పండిస్తున్న దేశాలలో ఇండియా ఒకటి.ఆహార వృథా రెండు రకాలు. ఇంట్లో వండినది కుప్ప తొట్టెలో పారబోయడం. పొలం నుండి వినియోగదారునికి చేరే సరఫరా చేసే దారిలో జారవిడిచేది మరొకటి. వెరసి 73 మిలియన్ టన్నులు బుగ్గిపాలు అవుతున్నాయి. కొందరు ఇంటి అవసరాలకు మించి పప్పులు, బియ్యం, నూనె వగైరాలు కొని పాడు చేస్తున్నారు. అస్తవ్యస్త వంట ప్రణాళిక వలన, ఇంట్లో నిలువ చేసే వసతుల లేక వృథా అవుతుంది. కొన్ని ఆచార వ్యాహారాలతో విలువైన ఆహారం వృథా అవుతున్నది. ప్రపంచంలో అత్యధికంగా 61 శాతం గృహ స్థాయిలోనే ఆహార వృథా జరుగుతున్నదన్నది గమనార్హం. ఆహార వృథా వలన పర్యావరణానికి తీవ్రహాని కలుగుతున్నది. వ్యవసాయానికి నేల, నీరు,విద్యుత్ అధికంగా కావాలి. ఆహార వృథా అంటే వెలకట్టలేని సహజ వనరులను నాశనం కావించడం. ఒక ఎకరా వరి పండించడానికి 20 నుంచి 40వేల లీటర్ల నీరు అవసరం. ఇండియాలో నగరాలు, పట్టణాల్లోని చెత్తలో పన్నెండు శాతం ఆహార పదార్థాలే ఆక్రమిస్తాయి. నగర పాలక సిబ్బంది సేకరించిన చెత్తను నేల మాళిగల్లో పూడ్చుతారు. తడి ఆహారపు చెత్త నెలలో చివికేటప్పుడు మిథేన్ వాయువు ఉత్పత్తి జరుగుతుంది. మిథేన్ శక్తివంతమైన హరిత గృహ వాయువు. ఇది వాతావరణంలోని వేడిని పట్టి నిలుపుతుంది. తద్వారా భూమివేడెక్కడానికి దోహదకారి అవుతుంది. మిథేన్ బొగ్గుపులుసు వాయువు కంటే అధిక వేడి కలుగజేస్తుంది. ఆహార వృథా వలన జరిగే సామాజిక నష్టాన్ని త్రోసిపుచ్చలేం.భారీ స్థాయిలో ఆహారోత్పత్తి దేశంలో జరుగుతున్నది. ఇక్కడ ఇరవై శాతం మంది పేదలు తిండిగింజలు కొనలేక పస్తులు పడుకొంటున్న దుస్థితి ఉందనేది త్రోసిపుచ్చలేని వాస్తవం. భూతాపం పెరుగుదల, అస్థిర వర్షఋతువు, వరదలు, కరవులు, తదితర ప్రకృతి వైపరీత్యాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అన్నాన్ని బుగ్గిపాలు చేయడం వలన పరిమితమైన సహజ వనరులపై ఎనలేని ఒత్తిడి పడుతుంది. ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఇందుకు ద్విముఖ వ్యూహం అవసరం. వ్యక్తిగత స్థాయి పరిష్కారాలు, విధాన సంస్కరణలు కావించి సుస్థిరాభివృద్ధికి బాటలు వేసుకోవాలి. ఇంటి అవసరాలకు తగినన్ని వెచ్చాలే కొనాలి. కచ్చితమైన భోజన ప్రణాళిక వేసుకోవాలి. సరైన మూతలున్న డబ్బాలలో వెచ్చాలు భద్రపరుచుకోవాలి. సరైన ఉష్ణోగ్రతలో వాటిని దాచుకోవాలి. ఎక్కువగా కూరగాయలు దొరికే కాలంలో ఒరుగులు తయారు చేసుకోవాలి. వంట గదిలో వచ్చిన చెత్తను సద్వినియోగపరచుకోవాలి. అంటే కంపోస్ట్‌చేసి, పూల మొక్కలకు, కూరగాయల మొక్కలకు వేయాలి. ఊరు శుభ్రమోతుంది. పెరటి తోటలు, మిద్దె తోటలు వేయాలి. వీటి పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి. ప్రభుత్వం శీతలు గిడ్డంగుల నిర్మాణం చేపట్టి, ఆహార పదార్థాల నిలువ సామర్థ్యం పెంచాలి. •

# ప్రజావాక్కు



## అనాగరిక పద్ధతులను మానాలి

అన్యాయంజరిగితేన్యాయంజరిగేలా చర్యలు తీసుకోవాలి. అవినీతి జరిగితే సంబంధించిన వ్యవస్థలచే నిజం ఏమిటోతెలుసుకుని చట్టప్రకారం శిక్షలువేయాలి. రాష్ట్రాలను, దేశాన్నిఅనేక పార్టీలుఎన్నికలలో గెలిచి పదవులు చేపడతాయి. పార్టీలు, పదవులు శాశ్వతంకావు. ప్రజాక్షేమం దానికితగ్గ సంక్షేమం సమకూర్చడమే పాలకులవిధి. నాయకులు గతప్రభుత్వ విధానాలను ఏలాగైనా విమర్శించవచ్చును.అవినీతి పరులను శిక్షించేదిఒక్కన్యాయ వ్యవస్థ మాత్రమే.ఈక్రమంలో నాయకులు ఒకరినొకరు అసభ్యపదజాలంతో,అనాగరిక పద్ధతులలోవేదికల మీద మాట్లాడడం మంచిదికాదు.ఉరితీస్తాం.రాళ్లతోకొట్టి చంపొచ్చు అంటూ మాట్లాడటంమానుకోవాలి.అప్పుడే సభ్య సమాజంలో పాలకులకుఅత్యంత గౌరవం దక్కుతుంది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## కొత్త ఏడాదిలో డీ.ఎస్సీపై నిరుద్యోగుల ఆశలు

తెలంగాణలో 2024 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 11వేల టీచర్ పోస్టులు త్వరితగతిన భర్తీ చేసిన ప్రభుత్వం మరో 6వేల టీచర్ పోస్టులు భర్తీ చేయుటకు మరో నోటిఫికేషన్ జారీ చేస్తామని గత డీఎస్సీ పూర్తిచేసే సమయంలో ప్రకటించారు. కానీ ఇప్పటివరకు మరొక నోటిఫికేషన్ జారీ కాలేదు. గత డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయి దాదాపు రెండు సంవత్సరాలు అవుతోంది. పదవి విరమణ ద్వారా ఏర్పడినఖాళీలు ప్రమోషన్స్ ద్వారా ఏర్పడినఖాళీలు కలిపి దాదాపు 12 వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. 8 వేల ఎస్జీటీ పోస్టులు 4 వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ప్రస్తుతం ఖాళీలు ఉన్నాయి.

- రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## తెలుగుభాషకు కృషి చేయాలి

భారతీయ రైల్వేశాఖ కొత్తగా రెండుస్లీపర్‌క్లాస్‌తో వందే భారత్‌రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ శాఖ మంత్రివర్యులు ప్రకటించారు. వందే భారత్‌లో ఉన్న రెండు తరగతుల ధరను సామాన్యులే కాకుండా, అత్యవసరం కానిచో జీతగాళ్లుకూడా భరించే అవకాశంలేదు. ఈనేపథ్యంలో స్లీపర్ తరగతితోఉన్న వందేభారత్ రైలు టికెట్‌ఛార్జీ, ప్రయాణం చాలా ఉపయోగపడుతుంది. అత్యంత సాంకేతికతతో, సత్వరంగమ్యం చేరే సదుపాయం కలుగుతుంది.

-బి.మేఘనాథం, విశాఖపట్నం

## మన భాషను మనమే అభివృద్ధి చేయాలి

మన మాతృభాష తెలుగు ప్రాముఖ్యాన్ని పెంచే పుస్తక మహోత్సవాలు, భాషాభివృద్ధి సభలు జరుగుతున్న సందర్భాల్లో మనంహాజరుకాకపోవడం కన్నా దాన్నిమనం,మనపిల్లలు ఆంగ్లంతో పాటు మాతృభాష మరింత పట్టు వచ్చేట్లు ఇంటి వద్ద నేర్పించాలి. ఉపాధి దృష్టిలో పరీక్షలకోసం ఆంగ్లం అవసరమైన ,తెలుగులో కూడా పరిజ్ఞానం విషయాలను మనస్సులో అర్థం చేసుకునేందుకు సులువుగా ఉంటుంది.ఆచరణమనం చేసి వారసులుకూడా దీన్నితప్పక మక్కువ పెంచాలి. దీనివల్ల అనువాద ప్రక్రియ సులువుగా ఉంటుంది.సాహిత్యంలో అనువాదం గొప్పది. గావున భాషల్లో తేడాను , మన భాషను మనమే అభివృద్ధి చేయడం విద్యావంతులు, తల్లి తండ్రులు బాధ్యత వహించాలి. మన మొక్కలకు మనం నీరుపోసి పెంచినట్లు .

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

## విలువలను రక్షించే విధానాలు కావాలి

రాజ్యాంగ విలువలు రక్షించబడిన రాజ్యం విధానాలు కావాలి. తెలంగాణ రైజింగ్ మీద గాని బంగారు తెలంగాణ మీద గాని నమ్మకం లేదు గాని సమగ్ర అభివృద్ధి చెందిన జీవన ప్రమాణాలు మెరుగుపడిన రాజ్యం మాత్రంకావాలి. పాలమూరు ప్రజల గోస తీరాలిఉత్తరాంధ్ర ప్రజల గోసకూడా తీరాలి. రాయలసీమ కూడా సమగ్ర అభివృద్ధి సాధించాలి అప్పుడు మాత్రమే విలువైన ప్రజాస్వామిక రాష్ట్రాలు పాలన చేయడం సుసాధ్యం అవుతుంది. అభివృద్ధి పేరిట ఆరావలి ప్రాంతంలో జరుగుతుంది ఏమిటి? ప్రపంచానికి అమెజాన్ అడవులు ఎలాగో అలాగే ఆరావలి. సుందర్ బన్ అడవులు అయితే వాటిని రక్షించుకోవాలి. అభివృద్ధి పేరిట సహజ సిద్ధమైన ప్రకృతి వనరులను నాశనం చేయని ప్రభుత్వ విధానం కావాలి.

- భారత అవినాష్, జనగామ

## సామాజిక బాధ్యత

ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం కోసం ఎంతోమంది వస్తుంటారు. వారితోపాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు వస్తుంటారు. కొందరు ఆరుబయట నిద్రిస్తూ, తిని తినక ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. వారిలో చాలామంది పేదరికం వల్ల భోజనం కొనలేని పరిస్థితిలో ఉంటున్నారు. వారికి పట్టెడన్నం పెట్టాలి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఇప్పటికే అన్నదానం చేస్తున్నారు కానీ సరిపోవడంలేదు.ఇలాంటి వారికి సహాయం చేయడం మనందరి సామాజిక బాధ్యత.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మన వినతి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# విద్యా విప్లవంలో డిజిటల్ టీ-శాట్ పాత్ర



ఐ.వి.మురళీ కృష్ణ శర్మ

ఇంటింటికీ టెక్నాలజీ చేరువ కావాలనే లక్ష్యంతో ప్రారంభించిన టీ-శాట్ తెలంగాణ రాష్ట్రానికి వరంగా మారింది. అన్ని రంగాలు, వర్గాల వారికి ఆధునిక సాంకేతికత చేరువ కావాలని స్థాపించిన టీ-శాట్ విజయవంతంగా లక్ష్యాలకు చేరుకుంటోంది. ప్రతి ఇల్లు గ్రంథాలయం కావాలి. ప్రతి మెదడుకు జ్ఞానం చేరాలంటే పుస్తకాలతోనే సాధ్యమవుతుంది అని పెద్దలు అంటుంటారు. ఇప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా పుస్తకం కూడా రూపంమార్చుకుంది. డిజిటల్ రూపంలో పుస్తకాన్ని తెలంగాణలో ఇంటింటికి చేర్చేందుకు టీ-శాట్ కృషిచేస్తోంది.టీ-శాట్ తీసుకొచ్చిన ఈ డిజిటల్ విప్లవం తెలంగాణ యువత, విద్యార్థుల భవితకు బాటలు వేయడమే కాకుండా అన్ని వర్గాల వారికి చేరువవుతోంది. తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ ఇనిషియేటివ్‌గా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ నేతృత్వంలో నడుస్తున్న ఈ నెట్‌వర్క్ సాఫ్ట్‌నెట్ (సొసైటీ ఫర్ తెలంగాణ స్టేట్ నెట్‌వర్క్) ఆధ్వర్యంలో టీ-శాట్ పేరుతో పనిచేస్తోంది. శాటిలైట్ ద్వారా ప్రసారాలు అందిస్తూ గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లోని విద్యార్థులకు, యువతకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెస్తోంది. టీ-శాట్ నిపుణ (స్కిల్స్, పోటీ పరీక్షలు), టీ-శాట్ విద్య (స్కూల్ ఎడ్యుకేషన్) అనే రెండు ప్రధాన చానెళ్లతో పనిచేస్తుంది. ఇవి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా సెల్ఫ్ ప్రిపరేషన్‌కి అండగా నిలుస్తున్నాయి. టీ-శాట్ యాప్, యూట్యూబ్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా విలువైన కంటెంట్ అందుబాటులో ఉంది. తెలంగాణలోని ఉన్నత విద్యా మండలితో పలు ఎమ్‌ఓయూలు కుదుర్చుకుని,అన్నిరకాల ప్రసారాలు అందిస్తుండటం విద్యార్థులకు, నిరుద్యోగులకు టీ-శాట్ గొప్పవరంగా మారింది. టీ-శాట్ విజయాలు అసాధారణమైనవి. దేశంలోనే నెంబర్ వన్ ఎడ్యుకేషనల్ నెట్‌వర్క్‌గా నిలవడం తెలంగాణకు గర్వకారణం. విద్యా ప్రసార చానెళ్లలో 48 లక్షల యూజర్స్‌తో డిజిటల్ ప్రసారాల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. యూట్యూబ్‌లో 8.4 లక్షలకు పైగా సబ్ స్క్రైబర్స్, సుమారు 14 కోట్లకు పైగా వ్యూస్ టీ-శాట్‌కు ఉన్నాయి. డిజిటల్ శాటిలైట్ ద్వారా 48 లక్షల మందికి పైగా యూజర్స్‌తో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. టీ-శాట్16 శాటిలెట్ ద్వారా తెలంగాణలోని సుమారు 80 లక్షలకు పైగా కుటుంబాలకు వైవిధ్యమైన ప్రసారాలు అందిస్తూ అన్ని వర్గాలకు తోడ్పడుతోంది. రాష్ట్రంలోని ప్రధాన కేబుల్ నెట్‌వర్క్‌లో టీ-శాట్ సేవలుఅందుబాటులో ఉండడంతో వీరి ప్రజా ప్రయోజనాల కార్యక్రమాలు ఇంటింటికీ చేరవవుతున్నాయి. తెలంగాణ విద్యా రంగంలో ఇప్పుడు టీ-శాట్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, ఐటీ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తూ టీ-శాట్ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజలకు చేరువ చేస్తున్నారు. డిజిటల్ నెట్‌వర్క్ ద్వారా గ్రామీణ విద్యార్థులు పట్టణ విద్యార్థులతో పోటీపడాలనే మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన పిలుపును సాకారం చేసేందుకు టీ-శాట్ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టీ-శాట్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల వార్షిక పోటీలు 2025 కార్యక్రమం



ద్వారా క్విజ్, వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. నవంబర్‌లో నిర్వహించిన ఈపోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 22 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారంటేనే టీ-శాట్‌కు తెలంగాణ విద్యారంగంలో లభిస్తున్న ప్రాధాన్యత తెలుస్తోంది.మహాత్మా గాంధీ యూనివర్సిటీ ద్వారా ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రత్యేక పాఠ్యాంశాలను టీ-శాట్ బోధిస్తోంది. టీ-శాట్,ఫోటానిక్స్ వ్యాలీకార్పొరేషన్ సంయుక్తంగా వీఎల్‌ఎస్‌ఐపై వృత్తి నైపుణ్య శిక్షణ కూడా అందిస్తోంది. ప్రజలకు అవసరమైన విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, వృత్తి నైపుణ్యం, భాషా నైపుణ్యాలపై ప్రత్యేక కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది.ప్రత్యేకంగా ఐదు యూట్యూబ్ చానెళ్లతో, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రీల్స్‌రూపంలోనూ కంటెంట్ అందిస్తోంది. పోటీపరీక్షలలో టీ-శాట్ యువతకు చేదోడుగా నిలిబడింది. టెట్, డీఎస్సీ పోటీ పరీక్షల్లో అభ్యర్థుల విజయానికి టీ-శాట్ కంటెంట్ కీలకంగా మారుతోంది. టీ-శాట్ సేవలతో వారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి రాష్ట్రఅభివృద్ధిలో భాగస్వాములుగా మారడం టీ-శాట్‌కు గర్వకారణం. పోటీ పరీక్షలకు సంసిద్ధమయ్యే వారి కోసం ప్రధాన సబ్జెక్ట్ జనరల్ స్టడీస్ పై జీఎస్ ఫర్ ఆల్ పేరిట ప్రత్యేక పాఠాలు ప్రసారం చేస్తోంది. టీజీపీఎస్సీగ్రూప్ 1, 2, 3 ఉద్యోగాలతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ పరీక్షలకు నాణ్యమైన కంటెంట్ అందిస్తోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉద్యోగాల సాధనలో తోడ్పాటు అందించడానికి టీ-శాట్ నెట్‌వర్క్ డొమైన్‌లో 40 వేలకు పైగా వీడియోలు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టుకోవడానికి, ఉద్యోగాలు సాధించడానికి టీ-శాట్ సేవలను ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు. అంతేకాక తెలంగాణ స్కిల్ హబ్, టాస్క్ వంటి స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్‌లతో కూడా టీ-శాట్‌సమన్వయం చేసుకుంటూ ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. విద్యార్థులకు, యువతకు మార్గదర్శకంగా స్వాతంత్ర్య సమర యోధులు,వివిధ రంగాల్లో అవార్డులు పొందిన వారి గొప్ప వ్యక్తుల అనుభవాలను, స్ఫూర్తిఅనే కార్యక్రమం పేరుతో ప్రసారం చేస్తూ మానవ విలువల పెంపుకు టీ-శాట్ కృషి చేస్తుంది. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, తెలంగాణ పశుసంవర్ధక శాఖల సమన్వయంతో నిపుణ పేరిట రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తోంది. వైద్య నిపుణులతో వైద్య సలహాలు కూడా అందిస్తున్న టీ-శాట్ మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి ప్రతి రోజు కార్యక్రమం ప్రసారం చేస్తుండడంతో అంగన్ వాడీ టీచర్లకు, కార్యకర్తలకు ఉపయోగకరంగా ఉంది. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టేలా బోనాలు,బతుకమ్మ పండుగలపై ప్రత్యేక వీడియోలు రూపొందించి మన సంప్రదాయాలకు పెద్ద పేట వేస్తోంది. టీ-శాట్ ప్రభావం ఇప్పటికే అనేక కోణాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామీణ విద్యార్థులు పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీపడేలాసంస్థ ప్రోత్సాహిస్తోంది. ఆరోగ్యం, వ్యవసాయం, మహిళలు పిల్లల సంక్షేమం, సాంస్కృతిక కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తోంది.తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీలో టీ-శాట్‌ను చేర్చాలని ఇటీవలే అధికారులు సూచించడం ఈ సంస్థ విద్యారంగానికి చేస్తున్న సేవలకు నిదర్శనంగా నిలవడమే కాకుండా రాష్ట్రవిద్యార్థులు, నిరుద్యోగుల జీవితాల్లో పోషిస్తున్నప్రధాన ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో టీ-శాట్ తెలంగాణ ప్రజలను జ్ఞానవంతులను చేసే మిషన్‌లో విజయవంతంగా దూసుకుపోతోంది. టీ-శాట్ కేవలం ఒక డిజిటల్ విద్యా సాధనం మాత్రమే కాదు, తెలంగాణ విద్యా విభాగంతో పాటు అన్నిరంగాల్లో మార్పుకు మార్గదర్శకంగా నిలుస్తూ అందరి మన్ననలు పొందుతోంది. •

# వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్స్

## న్యూయార్కు డ్రగ్స్ ఏజెన్సీ కార్యాలయంలో బేడీలతో నికోలస్ మదురో

## వెనిజులాను పాలించేది మేమే: ట్రంప్

## దేశ ప్రజలకు స్వేచ్ఛ లభించింది: విపక్ష నేత కొరియా మచాడో





**కారకాస్, జనవరి 4:** వెనిజులాపై అమెరికా దాడుల నేపథ్యంలో ఆ దేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను నియమిస్తూ ఆ దేశ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది . ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో సహా ఆయన సతీమణి సిలియా ఫ్లోరస్ లను అమెరికా సైన్యం బంధించి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ సంక్షోభ పరిస్థితుల్లో ప్రభుత్వ పాలన కొనసాగింపు, దేశ సార్వభౌమాధికారాన్ని రక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు న్యాయస్థానం పేర్కొంది.వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన 56 ఏళ్ల డెల్సీ రోడ్రిగ్జ్ నికోలస్ మదురోకు అత్యంత సన్నిహితురాలు. విప్లవ నేత, లిగా సోషలిస్ట్ పార్టీ వ్యవస్థాపకులు జార్జ్ ఆంటోనియో కుమార్తె అయిన ఈమె 1969లో రాజధాని కాకరాస్ లో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన డెల్సీ మదురో ప్రభుత్వంలో కమ్యూనికేషన్, విదేశాంగ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2018 నుంచి ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రోడ్రిగ్జ్ తన సోదరుడు నేషనల్ అసెంబ్లీ చీఫ్ జార్జ్ రోడ్రిగ్జ్‌తో కలిసి మదురో ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఆ దేశ రాజకీయాల్లోనే కాకుండా ఆర్థిక వ్యవస్థపై కూడా పట్టు సాధించారు. దీంతో ఆమె ఆర్థిక, చమురు శాఖల మంత్రిగానూ సేవలందిస్తున్నారు. అమెరికా ఆంక్షల నడుమ వెనిజులా దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ఎంతగానో కృషి చేశారు రోడ్రిగ్జ్. ఆ దేశంలోని చమురు కోసం ట్రంప్ సుంకాలు విధించిన వేళ ద్రవ్యోల్బణం నుంచి బయటపడేయడంలో కీలకపాత్ర పోషించారామె. రోడ్రిగ్జ్ నియామకం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ప్రకటించినట్టు సమాచారం.

**న్యూయార్క్ డ్రగ్స్ఏజెన్సీ కార్యాలయంలో వెనిజులా మదురో:** యూఎస్ డ్రగ్ ఏజెన్సీ ఆఫీసులో వెనిజువెలా అధ్యక్షుడు వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భారయ సిలియా ఫ్లోర్స్ అమెరికా భద్రతా దళాల అదుపులో ఉన్నారు. మదురోకి సంబంధించి వీడియోను యూఎస్ సెక్యూరిటీ ఫోర్సె స్ ఓ వీడియోను విడుదల చేశాయి. మదురోని వెనిజులా నుంచి తీసుకువచ్చి అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అడ్మినిస్ట్రేషన్(ఎడిఇ) న్యూయార్క్ డివిజన్ కార్యాయలంలో నిర్బంధించినట్లు స్పష్టమవుతోంది. వెనిజులా రాజధాని కారకాస్‌పై ప్రత్యేక అమెరికా దళాలు ఆకస్మిక దాడి జరిపాయి. ఈ దాడి సమయంలోనే ఆ దేశ అధ్యక్షుడు మదురో ఆయన భార్య సిలియా ఫ్లోర్స్ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుండగా యూఎస్ సెక్యూరిటీ ఫోర్సె స్ వారిని అదుపులోకి తీసుకున్నారు. యూఎస్ దాడి సమయంలో మదురో, ఆయన భార్య కారకాస్‌లోని హై సెక్యూరిటీ ఫోర్ట్ టియునా మిలిటరీ కాంపౌండ్‌లోని తమ నివాసంలో ఉన్నట్లు తెలుస్తోంది. దాడి విషయం తెలియగానే హైసెక్యూరిటీతో పారిపోయే ప్రయత్నం చేశారు. కానీ, వారి ప్రయత్నం ఫలించలేదు. రాపిడ్ రెస్పాన్స్ 47 టీమ్ అధికారిక ఎక్స్ అకౌంట్‌లో మదురోకి సంబంధించిన వీడియో షేర్ చేసింది. ఈ వీడియోలో లోయర్ మన్‌హట్టన్‌లోని డ్రగ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అడ్మినిస్ట్రేషన్ న్యూయార్క్ డివిజన్ కార్యాలయం లోకి మదురోని అధికారులు తీసుకెళ్తున్నారు. చేతులకు సంకెళ్లతో సెక్యూరిటీ సిబ్బంది మధ్య బందీగా ఉన్నారు. కాగా, మదురోని ఓ గదిలోకి తీసుకెళ్తుండగా సెక్యూరిటీ సిబ్బందికి ఆయన గుడ్ నైట్, హ్యాపీ న్యూ ఇయర్ అని విష్ చేయడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. వెనిజువెలాపై దాడి తరువాత మదురో, ఆయన భార్యను ముందుగా అమెరికాలోని సైనిక స్థావరానికి తీసుకెళ్లారు. ఆ తరువాత అక్కడి నుంచి న్యూయార్క్‌కు తరలించారు. మదురోను డీఈఏ కార్యాలయం నుంచి బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌కు తీసుకెళ్తారని తెలుస్తోంది. మదురో, ఆయన భార్యపై నార్కో టెర్రరిజం, యునైటెడ్ స్టేట్స్ లోకి టన్నుల కొద్దీ కొకైన్ దిగుమతి చేయడం, అక్రమ ఆయుధాలను కలిగి ఉండటం వంటి అభియోగాలు మోపారు.

**వెనిజులాను పాలించేది మేమే...యుఎస్ అధ్యక్షుడు ట్రంప్:** ఇదిలా ఉండగా ఇకపై వెనిజులా పాలనపై ట్రంప్ కీలక ప్రకటనచేస్తూ సురక్షితంగా అధికారాల బదిలీ జరిగేదాకా వెనిజులాను మేమే పాలిస్తామంటూ ప్రకటించారు అమెరికా అధ్యక్షుడు. గత కొంతకాలం వెనిజులా తమ ఆధీనంలోనే నడుస్తుందన్నారు. ప్రజల జీవనానికి సురక్షితమని భావించే వరకూ దేశంలో సరైన, న్యాయమైన అధికారాల బదిలీ అయ్యే వరకూ వెనిజులా పాలన తమ ఆదీనంలోనే ఉంటుందని మీడియా సమావేశంలో ఆయన ప్రకటించారు. గతంలో పాలన ఉండకూడదని, సురక్షితంగా సుస్థిరంగా వెనిజులా అభివృద్ధికి మేమే సహకరిస్తామని, అప్పటివరకూ అమెరికా పాలనలోనే ఉంటుందని ట్రంప్ వెల్లడించారు. అయితే ఈపాలన ఎంతకాలం ఉంటుందోప్రకటించలేదు. వెనిజులాలో ప్రభుత్వ మార్పు, ఆదేశ చమురు వనరులపై నియంత్రణ కీలకమని ట్రంప్ బాహాటంగానే చెప్పారు. ఇపుడు అతిపెద్ద చమురు కంపెనీలు వెనిజులాలో పెట్టుబడులకు ముందుకువస్తున్నట్లు ట్రంప్‌ప్రకటించారు. డ్రగ్స్‌ను అక్రమంగా అమెరికాలోకి తరలిస్తున్నారని, డ్రగ్స్ మాఫియాను వెనిజులా అధ్యక్షుడు పెంచి పోషిస్తున్నారంటూ నార్కో ఉగ్రవాదం కొనసాగిస్తున్నారంటూ మదురోపై అభియోగాలు నమోదు చేసిన ట్రంప్ వెనిజులాపై సైనిక చర్య తప్పదని కూడా హెచ్చరించారు. చెప్పినట్లుగానే సైనిక చర్యతో మదురో దంపతులను నిర్బంధంలోకి తీసుకుని అమెరికాకు తరలించడం, ఆపై ఉపాధ్యక్షురాలు అధ్యక్షురాలిగా నామినేట్‌కావడం జరిగిపోయాయి.

**వెనిజులా ప్రజలకు స్వేచ్ఛ లభించింది...ప్రతిపక్ష నేత మచాడో:** అమెరికా దాడులుచేసి మదురో దంపతులను నిర్బంధించి తీసుకెళ్లడంపై శాంతిపురస్కార గ్రహీతదేశ విపక్షనేత మారియా కొరినా మచాడో స్పందించారు. వెనిజులాకు స్వేచ్ఛ లభించిందని అమెరికా తన వాగ్దానాన్ని తిరిగి నిలబెట్టుకుందని అన్నారు. ప్రజలారా స్వేచ్ఛా సమయం వచ్చింది. వెనిజులా ప్రజలు, ఇతరదేశాలపౌరులపై జరిగిన దారుణ నేరాలకు మదురో ఇపుడు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. చర్చలతో పరిష్కారానికి నిరాకరించాడని, అందుకే అమెరికా తన వాగ్దానం నిలుపుకున్నదని వ్యాఖ్యానించారు. ప్రజాసార్వభౌమాధికారంతో వెనిజులాను పాలించే సమయం వచ్చిందన్నారు. రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని, శాంతియుత భవిష్యత్తు నిర్మిస్తామన్నారు. ప్రజాస్వామ్యంకోసం అనేక ఏళ్లుగా తానుచేసిన పోరాటం ఫలించిందన్నారు. వెనిజులా తదుపరి అధ్యక్ష పదవికోసం ఎడ్మండో గొంజాలెజ్ ఉరిటియాకు తన మద్దతుప్రకటించారు. అయితే వెనిజులా అధ్యక్షురాలిగా మచాడోకు అప్పగించడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా విముఖంగా ఉన్నారు. మచాడో చాలా మంచి మహిళ అని కాని ఆమె నాయకురాలిగా ఉండటం చాలా కష్టమని భావిస్తున్నట్లు తెలిపారు. కాగా అమెరికా చేసిన దాడుల్లో సుమారు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలోసాధారణప్రజలతోపాటు సైనికులు కూడా ఉన్నారు. వెనిజులాకు చెందిన సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు అక్కడి మీడియాలో వార్తలు వెలువడ్డాయి.



# తీరు మారకపోతే మీపైనా చర్యలు

## క్యూబా, మెక్సికో, కొలంబియాలకు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, జనవరి 4:** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించిన అనంతరం ప్రెసిడెంట్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వెనిజులా తాత్కాలికంగా తమ ఆధీనంలోనే ఉంటుందని చెపుతూ లాటిన్ అమెరికాలోని ప్రత్యర్థి దేశాలైన క్యూబా, మెక్సికో, కొలంబియాలకు సైతం వార్నింగ్ ఇచ్చారు. డ్రగ్స్ తయారీ, మాదక ద్రవ్యాల ముఠాలకు క్యూబా, మెక్సికో, కొలంబియా దేశాలు ఆశ్రయమిస్తున్నాయని, అక్కడి నుంచి అమెరికాలోకి అక్రమంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కారణంతో వెనిజులా పై సైనిక చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఆ దేశాలు తమ పద్ధతి మార్చుకోకపోతే వెనిజులా పరిస్థితినే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆయా దేశాల్లోని డ్రగ్స్ ఉత్పత్తి ల్యాబ్‌లపై దాడులు చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా కొలంబియాపై ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. కొలంబియాలో మూడు ప్రధాన కొకైన్ తయారీ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వాళ్లే కొకైన్‌ను తయారు చేసి, అమెరికాకు పంపిస్తున్నారని అందుకే అతను జాగ్రత్తగా ఉండాలంటూ కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోను ఉద్దేశించి హెచ్చరించారు. కాగా, వెనిజులా అధ్యక్షుడిని అమెరికా సైన్యం బంధించడాన్ని క్యూబా, కొలంబియా, మెక్సికో దేశాలు ఖండించాయి. ఇది దురాక్రమణ కిందకే వస్తుందని స్పష్టం చేశాయి. ఈ పరిణామాలు దక్షిణ అమెరికా మొత్తం భద్రతకు ముప్పుగా మారిందని పేర్కొన్నాయి. ట్రంప్ చర్యలతో తాము కూడా అప్రమత్తమయ్యామని వెనిజులా సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరిస్తున్నామని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తెలిపారు.




# క్షిపణి పరీక్షలతో తూర్పుఆసియాలో కిమ్ ప్రకంపనలు

**ప్యాంగ్యాంగ్, జనవరి 4:** ఉత్తర కొరియా కొన్ని రోజులవిరామం తర్వాత తన క్షిపణి ప్రయోగాలతో తూర్పు ఆసియాలో మళ్లీ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆదివారం ఉదయం ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు గుర్తించిన జపాన్ ప్రభుత్వం తన దేశ ప్రజలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. సుమారు రెండు నెలల తర్వాత ఉత్తర కొరియా జరిపిన మొదటి బాలిస్టిక్ క్షిపణి పరీక్ష ఇదే కావడం గమనార్హం. ఉత్తర కొరియాక్షిపణి ప్రయోగం చేసినట్లు జపాన్ ప్రధాని కార్యాలయం ధ్రువీకరించింది. జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం ఈ క్షిపణి అప్పటికే సముద్రంలో పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం 7:50 గంటల ప్రాంతంలో రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపంలోని తీరం నుంచి ఉత్తర కొరియా వరుసగా పలు క్షిపణులను సముద్రంలోకి ప్రయోగించిందని దక్షిణ కొరియా సైన్యం ప్రకటించింది. అమెరికా, జపాన్ దేశాలతో కలిసి పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని సియోల్ వెల్లడించింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యుంగ్ చైనా పర్యటనకు బయలుదేరుతున్న తరుణంలో ఈ ప్రయోగాలు జరగడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.కొరియా ద్వీపకల్పంలో శాంతి నెలకొనేలా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సానుకూలంగా స్పందిస్తారని దక్షిణ కొరియా ఆశిస్తున్న వేళ కిమ్ జోంగ్ ఉన్ క్షిపణులతో కవ్వింపులకు దిగారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ శనివారమే ఒక భారీ ఆయుధ కర్మాగారాన్ని సందర్శించారు.క్షిపణుల ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న నైన్త్ పార్టీ కాం గ్రెస్ సమావేశాలలోపు తన సైనిక బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలనే ఉద్దేశంతోనే కిమ్ ఇలాంటి ప్రయోగాలకు పాల్పడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# చమురు నిల్వలకోసమే ట్రంప్ దాడులు

## మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ధ్వజం



**న్యూయార్కు, జనవరి 4:** వెనిజులాపై ట్రంప్ ఆదేశాలమేరకు జరిగిన దాడులు ప్రజాస్వామ్యం పునరుద్ధరణ, డ్రగ్స్ నియంత్రణ కోసం కానే కాదని, కేవలం ఆదేశంలో ఉనన అపారమైన చమురు నిల్వలు కోసమేనని మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ విమర్శించారు. చమురుకోసమే ట్రంప్ రాజకీయ ఆశయాలకోసమే ఈ దాడి జరిగిందన్నారు. ఈ చర్యలతో అమెరికా సురక్షితం కాబోదని ఆమె తన సోషల్ మీడియాలో విమర్శనాత్మక వ్యాఖ్యలుచేసారు. బలవంతంగా ప్రభుత్వాన్ని మార్చడం, ప్రాంతీయ అస్థిరతకు కారణమై చివరకు అమెరికన్ల ప్రాణాలకే ముప్పుతెస్తుందని ఆమె హెచ్చరించారు. మదురో ఇక క్రూరమైన నియంత అయినాసరే ఈ చర్య చట్టవిరుద్ధమని కమలా పేర్కొన్నారు. ప్రభుత్వ మార్పు లేదా చమురుపేరుతో ప్రారంభించిన యుద్ధాలు గందరగోళంగా మారి చివరకు అమెరికన్ కుటుంబాలే బలవుతున్నాయని ఆమె గుర్తుచేసారు. అమెరికా ప్రజలు ఇలాంటి చర్యలు కోరుకోవడంలేదని, ట్రంప్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్‌కు చట్టబద్ధత, స్పష్టమైన ఎగ్జిట్‌ప్లాన్ లేదని, దీనివల్ల అమెరికన్ సైనికుల ప్రాణాలుప్రమాదంలో పడతాయని అన్నారు. బిలియన్ డాలర్లు ఖర్చుచేసి ఒక ప్రాంతాన్ని అస్థిరపరుస్తున్నారన్నారు. ఈచర్యలకు అమెరికాకు వచ్చే లాభం ఏమిటో ట్రంప్ చెప్పలేకపోతున్నారని అన్నారు. న్యూయార్కు కొత్తమేయర్ జోహ్రాన్ మమ్దానీ కూడా ట్రంప్‌పై విమర్శలుచేసారు. ఒక స్వతంత్ర దేశంపై దాడి చేయడమే కాకుండా అంతర్జాతీయ చట్టాలను ట్రంప్ ఉల్లంఘించారని ఆరోపించారు.

# వెనిజులాకు మస్క్ స్టార్‌లింక్ నెలరోజులు ఉచిత ఇంటర్నెట్



**న్యూయార్కు, జనవరి 4:** టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వెనిజులా ప్రజలకోసం అక్కడ నెలకొన్న సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో, ప్రజలకు నిరంతరాయంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించేందుకు నెల రోజుల పాటు స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్టు ప్రకటించారు. వెనిజులా ప్రజలకు మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో వెల్లడించారు. అమెరికా సైనిక చర్యలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో పట్టుబడిన కొద్ది సేపటికే మస్క్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. మదురో అరెస్ట్‌ను స్వాగతించిన మస్క్, ఆయన పాలన ముగియడంతో ఇకనైనా వెనిజులా అభివృద్ధి పథంలో పయనించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. వెనిజులా ఇప్పుడు శ్రేయస్సును పొందగలదని స్పానిష్ భాషలో వ్యాఖ్యానించారు. లోఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ల ద్వారా పనిచేసే స్టార్‌లింక్ నెట్‌వర్క్, దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఈ సమయంలో కనెక్టివిటీ సమస్యలు లేకుండా చూస్తుంది. ఫిబ్రవరి 3 వరకు ఈ ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయి. మదురో ప్రభుత్వంపై మస్క్ మొదటి నుంచి తీవ్ర విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన స్పందన ఎవరినీ ఆశ్చర్యపరచలేదు. మదురో ప్రభుత్వ విధానాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని ఆయన చాలాకాలంగా ఆరోపిస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో ప్రతిపక్షానికి బహిరంగంగా మద్దతు పలికిన మస్క్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ప్రతిపక్ష నేత మారియా కొరినా మచాడోకు అండగా నిలిచారు. సహజ వనరులు పుష్కలంగా ఉన్న వెనిజులా, సరైన నాయకత్వం లేకపోవడం వల్లే అభివృద్ధికి దూరమైందని మస్క్ గతంలో పలుమార్లు పేర్కొన్నారు.




## వెనిజులా పరిణామాలపై భారత్ ఆందోళన

**న్యూఢిల్లీ, జనవరి 4:** వెనిజులా పరిణామాలపై భారత్ విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనిజులాలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. కరాకస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని విదేశాంగ ప్రతినిధి రణదీప్ జైస్వాల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వెనిజులా రాజధాని కారకాస్‌పై దాడిచేసిన దేశ అధ్యక్షుడు మదురో దంపతులను అదుపులోకి తీసుకున్న అమెరికా మదురోపై తీవ్రమైన నార్కో టెర్రరిజం ఆరోపణలు మోపింది.

గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, భారీ పరిమాణంలో కొకైన్‌ను అమెరికాకు తరలించారని ఫెడరల్ కోర్టులో అభియోగాలు దాఖలు చేశారు. 1999 నుంచి 2025 వరకు సాగిన ఈ అక్రమ రవాణాకు మదురో నాయకత్వం వహించారని యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బాండీ వెల్లడించారు. ఈకేసులో మదురో భార్య, కుమారుడితోపాటు పలువురు ఉన్నతాధికారుల పేర్లను కూడా చేర్చారు. ప్రస్తుతం మదురో న్యూయార్క్‌లోని ఫెడరల్ జైలులో ఉన్నారు.

# ఉత్తర నైజీరియా గ్రామంపై సాయుధ మిలిటెంట్ల దాడి

## 30 మంది మృతి, భారీ సంఖ్యలో కిడ్నాప్



**అబూజా, జనవరి 4:** ఆఫ్రికాదేశం ఉత్తర నైజీరియాలోని మారుమూల గ్రామంపై సాయుధులైన దుండగులు భీకర దాడి చేశారు. విచక్షణారహితంగా కాల్పుల్లో సుమారు 30 మంది గ్రామస్థులు మరణించారు. మరికొందరిని కిడ్నాప్ చేసి అడవిలోకి ఎత్తుకెళ్లారు. నైజర్ రాష్ట్రంలోని కసువాన్‌దాజీ గ్రామంలో ఈ ఘోర ఘటన జరిగింది. ఊహించని ఈ దాడితో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. బోర్గు స్థానిక ప్రభుత్వ పరిధిలోని కసువాన్‌దాజీ గ్రామంపై దుండగుల ముఠా విరుచుకుపడింది. గ్రామంలోకి ప్రవేశించగానే జనంపై కాల్పులు మొదలుపెట్టారు. కనిపించిన వారిని కనిపించినట్లు కాల్చి చంపారు. అంతటితో ఆగకుండా గ్రామంలోని ఆస్తులను ధ్వంసం చేశారు. స్థానిక మార్కెట్‌కు నిప్పు పెట్టారు. అనేక ఇళ్లను దహనం చేశారు. దీంతో గ్రామం మంటల్లో చిక్కుకుంది. మరణాల సంఖ్యపై పోలీసులు, స్థానికుల మధ్య భిన్న వాదనలు ఉన్నాయి. ఈ దాడిలో కనీసం 30 మంది గ్రామస్థులు మరణించారని పోలీసులుప్రకటిస్తే స్థానికులు మాత్రం మృతుల సంఖ్య 37కు పైగా ఉందని చెబుతున్నారు. చాలా మంది ఇంకా కనిపించడం లేదని, వారిని దుండగులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని, దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన తర్వాత భద్రతా బలగాల స్పందనపై విమర్శలు వస్తున్నాయి. కిడ్నాప్ అయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, అధికారులను మోహరించామని నైజర్ రాష్ట్ర పోలీస్ అధికార ప్రతినిధి వాసియు అబియోడున్ తెలిపారు. దుండగులు ఎక్కడి నుంచి వచ్చారనే దానిపై పోలీసులకు క్లారిటీ వచ్చింది. కబే జిల్లా వెంబడి ఉన్న నేషనల్ పార్క్ ఫారెస్ట్ నుంచి దుండగులు గ్రామంలోకి చొరబడ్డారు. దాడి చేసిన తర్వాత మళ్లీ అడవిలోకే పారిపోయారు. నైజీరియాలో విశాలమైన అటవీ ప్రాంతాలు ఉండటంతో, వాటిని ఈ సాయుధ ముఠాలు తమ స్థావరాలుగా మార్చుకుంటున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ, భద్రత తక్కువగా ఉండే మారుమూల గ్రామాలనే వీరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి దాడులు జరగడం ఇదే తొలిసారి కాదు. తాజా దాడి జరిగిన కసువాన్‌దాజీ గ్రామం, పపిరి కమ్యూనిటీకి సమీపంలోనే ఉంది. గత ఏడాది నవంబర్‌లో పపిరిలోని ఒక క్యాథలిక్ పాఠశాల నుంచి 300 మందికి పైగా విద్యార్థులను, టీచర్లను దుండగులు కిడ్నాప్ చేశారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రాంతంలో నరమేధం జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఆఫ్రికాలో అత్యధిక జనాభా కలిగిన నైజీరియాలో ఆధిపత్యం కోసం అనేక ముఠాలు అమాయక ప్రజలను బలి తీసుకుంటున్నాయి.

# ఎప్పటికీ మాదే అధికారం అనుకోవద్దు..


## బిఎంసి మేనిఫెస్టో విడుదలలో థాక్రే బ్రదర్స్ హితవు



**ముంబయి,జనవరి 4:** అసెంబ్లీ చైర్మన్‌గా ఉన్న రాహుల్ నార్వేకర్ బహిరంగంగానే అభ్యర్థులను, ఓటర్లను బెదిరించడం దిగ్భ్రాంతికి కలిగించినట్టు ఉద్ధవ్ థాకరే తెలిపారు. స్పీకర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పటికీ మాదే అధికారం అనుకోవద్దని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఎప్పటికీ తామే అధికారంలో ఉంటామని బీజేపీ అనుకుంటే పొరపాటని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే అన్నారు. మహారాష్ట్రను యూపీ, బిహార్‌లా మార్చాలనుకుంటున్నారని విమర్శించారు. మహారాష్ట్ర ఈ దేశానికి దిశానిర్దేశం చేస్తుం దని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళ్లిన బీజేపీ ఇప్పుడు మహారాష్ట్రలో పోటీ లేకుండా అభ్యర్థులను గెలిపించుకోవడంపై ఏం చెబుతుందని ప్రశ్నించారు. బ్రిహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఎన్నికల మేనిఫెస్టోను తన సోదరుడు, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో కలిసి ఆదివారం నాడిక్కడ ఆయన విడుదల చేశారు. బీజేపీ, మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌పై ఈ సందర్భంగా ఠాక్రే సోదరులు విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ చైర్మన్‌గా ఉన్న రాహుల్ నార్వేకర్ బహిరంగంగానే అభ్యర్థులను, ఓటర్లను బెదిరించడం దిగ్భ్రాంతికి కలిగించినట్టు ఉద్ధమ్ థాకరే తెలిపారు. స్పీకర్‌పై వెంటనే చర్చలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయా లని డిమాండ్ చేశారు. నేతల సెక్యూరిటీ తీసేయాలని అధికారులకు ఆయన తెలిపారని, ఆయనకు అసెంబ్లీలో అధికారం ఉందే కానీ, బయట లేదని చెప్పారు. అభ్యర్థులను పోటీలేకుండా ఎన్నుకోవడం ద్వారా ఓటర్ల హక్కులను నార్వేకర్ కొల్లగొట్టారని, ఆయనపై కేసు నమోదు చేయాలని అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రాంతాల్లో ఉపఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఉద్ధవ్ ఠాక్రే విమర్శలు గుప్పించారు. ఇది ముఠా పాలనే కానీ, ప్రజాస్వామ్యం కాదు. ఓట్ చోరీకి పాల్పడుతుంటే రెడ్‌హ్యాండ్‌గా పటుకున్నాం. ఇప్పుడు అభ్యర్థులను తస్కరిస్తున్నారు. మేము మాత్రం మోడీతో రాజీపడే ప్రసక్తే లేదు. రిటర్నింగ్ అధికారుల కాల్ రికార్డులన్నీ మాకు చూపించాలని ఎన్నికల కమిషన్‌ను మేము సవాలు చేస్తున్నాం అని ఠాక్రే అన్నారు.

# సంక్షిప్తంగా..

## పుతిన్‌ను కూడా ఇలాగే తీసుకురాగలరా: రోఖన్నా ఆగ్రహం



**వాషింగ్టన్, జనవరి 4:** వెనిజులాపై యుద్ధం ప్రారంభించి మాగాను ట్రంప్ మోసం చేసారని భారత సంతతికి చెందిన అమెరికా చట్టసభల సభ్యుడు రోఖన్నా తప్పుపట్టారు. తాజా దాడులు ఆయన యుద్ధ చర్యగా పేర్కొన్నారు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లిబియాలో ఘర్షణలకు వ్యతిరేకంగా తాము ఓటు వేస్తున్నామన్నారు. కానీ అధ్యక్షులు మాత్రం సైనికీకరణకు అనుకూలంగా ఉండే విదేశాంగశాఖలోని కొందరి మాటలకు తలొగ్గుతు న్నారని అన్నారు. తైవాన్ అధ్యక్షుడు లచింగ్ తెనుచైనా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని రష్యా నిర్బంధిస్తే ఏంచేస్తారని ప్రశ్నించారు. ఉక్రెయిన్‌పై దాడులపరంపరను కొన సాగిస్తున్న పుతిన్ కూడా ట్రంప్ ఇలాగే హ్యాండిల్‌చేయాలని సూచించారు.

## అశ్లీలకంటెంట్ తొలగించడం, ఖాతాలను కూడా మూసేస్తాం



**న్యూఢిల్లీ, జనవరి 4:** ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' కంటెంట్ గురించి స్పష్టత ఇచ్చింది ఎక్స్‌లో పోస్ట్ చేసే చట్ట విరుద్ధమైన కంటెంట్‌ను పూర్తిగా తొలగిస్తామని,అలాంటి కంటెంట్‌ను పోస్ట్ చేసిన అకౌంట్లను శాశ్వతంగా సస్పెండ్ చేస్తామని వెల్లడించింది. అందుకోసం అవసరమైతే స్థానిక ప్రభుత్వాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఎక్స్ గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ ఖాతా ద్వారా ఈ ప్రకటన వెలువడింది. స్థానిక చట్టాలకు, నియమాలకు విరుద్ధంగా అశ్లీల, అసభ్య కంటెంట్ పెరుగుతున్నట్టు భారత ప్రభుత్వం గుర్తించి ఎక్స్‌కు జనవరి రెండో తేదీన నోటీసులు జారీ చేసింది.

## నిధులకోసం పసికందును బలిచ్చేందుకు సిద్ధమైన తల్లితండ్రులు కటకటాల్లోకి..



**బెంగళూరు, జనవరి 4:** బెంగళూరు రూరల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. డబ్బు మీద పిచ్చితో చంటిబిడ్డను చంపడానికి సిద్ధమయ్యారు తల్లిదండ్రులు. నిధికోసం 8 నెలల పసి కందును బలి ఇవ్వ డానికి చూసినా పోలీసుల ఎంట్రీతో కథ అడ్డం తిరిగింది. చిన్నారి క్షేమంగా బయటపడింది. కీచక తల్లి దండ్రులు జైలు పాలయ్యారు. సంఘటనకు సంబంధించి పోలీసుల వివరాలప్రకారం హుసకోటే తాలూకా, సులిబెలెలోని జనతా కాలనీకి చెందిన సయ్యద్ ఇమ్రాన్ పురాతన నిధుల కోసం గత కొంత కాలం నుంచి గాలిస్తూ ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే ఇంట్లోని ఓ గదిలో నిధి ఉన్నట్లు అతడికి తెలిసింది. నిధి తమకు దక్కాలంటే ఓ చిన్నారిని బలివ్వటం తప్పదని భావించారు. ఇందుకోసం 8 నెలల తమ బిడ్డను బలివ్వడానికి సిద్ధమయ్యారు. ఈ సమాచారం పోలీసులకు అంది సయ్యద్ ఇంటి దగ్గరకు వెళ్లి పాపను కాపాడారు. భార్యాభర్తలను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## ఒడిశా క్వారీలో భారీ పేలుడు: ఇద్దరు మృతి

**ధంకెనాల్, జనవరి 4:** ఒడిశాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ధెంకనాల్ జిల్లాలోని ఓ క్వారీలో భారీ పేలుడు సంభవించడంతో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పలువురు కార్మికులు గాయపడి శిథిలాల కింద చిక్కుకున్నారు. వీరిని రక్షించేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. మోతంగా పీఎస్ పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామ సమీపంలో ఓ రాతి క్వారీలో కార్మికులు డ్రిల్లింగ్, మైనింగ్ పనులు చేస్తున్న సమయంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో అక్కడి కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సహా ఒడిశా డిజాస్టర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలు, డాగ్ స్క్వాడ్స్ అక్కడకు చేరుకున్నాయి. భారీ శిథిలాల మధ్య చిక్కుకున్న పలువురిని రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

## వెనిజులాపై అమెరికా దాడులపట్ల వామపక్షాల నిరసన



**న్యూఢిల్లీ, జనవరి 4:** వెనిజులాపై అమెరికా సైనిక చర్యకు దిగడం, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను బంధించడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టాయి. వెనిజులాపై అమెరికా చర్యను సామ్రాజ్యవాద సైనిక దురాక్రమణగా అభివర్ణించిన సీపీఎం, దీన్ని ప్రపంచ దేశాలు ఖండించాలని పిలుపునిచ్చింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన, దృఢమైన వైఖరి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ దాడిని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఆర్ఎస్‌పీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా చర్య ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘించడమేనని ఆ పార్టీల ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ. బేబీ, డి. రాజా, దీపాంకర్ భట్టాచార్య, జి. దేవరాజన్, మనోజ్ భట్టాచార్య సంయుక్త ప్రకటనలో తెలిపారు.

# 8న గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం

### 4 రోజుల్లో డిసిసి కార్యవర్గం, మండల అధ్యక్షుల నియామకాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** తెలంగాణ కాంగ్రెస్‌లో పార్టీ పదవుల విషయంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ తీపికబురు చెప్పారు. 4 రోజుల్లో డీసీసి కార్యవర్గ కూర్పుపై నివేదిక ఇవ్వాలని టీపీసీచీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. ఈ నెల 15వ తేదీలోపు మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియా మకాలు అవ్వాలన్నారు. ఆదివారం డీసిసి అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులతో జూమ్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యవర్గం కూర్పువిషయంలో మహేశ్ కుమార్ గౌడ్ కీలక ఆదేశాలు ఇచ్చారు. అలాగే ఈ నెల 8వ తేదీన గాంధీ భవన్ లో టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకంలో గాంధీ. పేరు తొలగించడంపై దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యవర్గం కోసం అధికార పార్టీలో కసరత్తు మొదలైంది. ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్షులను అధిష్టానం ప్రకటించినా కార్యవర్గం ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో డీసీసీ కార్యవర్గం కూర్పులో తమకు అవకాశాలు దక్కుతాయని ఆశిస్తున్న వారు పార్టీ నిర్ణయంపై ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. అయితే కాంగ్రెస్ జిల్లా కార్యవర్గం ఏర్పాటు విషయంలో గతంలోనే టీపీసీసీ మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. వీటికి అనుగుణంగా మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పార్టీ నేతలు జిల్లాల్లో పర్యటించి ఆశావహుల నుంచి దరఖాస్తులు సైతం స్వీకరించారు. దీంతో ఈనెలలో ఎప్పుడైనా జాబితా వెలువడవచ్చని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో మరో నాలుగు రోజుల్లో డీసీసీ కార్యవర్గం కూర్చుపై నివేదిక ఇవ్వాలని మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశించడంతో పార్టీ పదవులు ఎవరికి దక్కబోతున్నాయనేది ఆసక్తిగా మారింది.



బిసి సదస్సులో మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో బిసి విద్యార్థి జెఎసి చైర్మన్ వేముల రామకృష్ణ తదితరులు

# బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

### మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో బిసి విద్యార్థి జెఎసి చైర్మన్ వేముల రామకృష్ణ అధ్యక్షతన వివక్షతకు గురవుతున్న బిసి వర్గాల సమస్యలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 70 కోట్ల జనాభా కలిగిన బిసిలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం అన్యాయమన్నారు.బిసిలకు తగిన బడ్జెట్ కేటాయించారు. క్రిమినేయర్‌పై అనేకమైన ఆంక్షలు పెట్టారని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్‌పై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కులగణన లెక్కలు బయటపెట్టాలని, 42శాతం రిజర్వేషన్లతో ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, బిసి విద్యార్థి జెఎసి చైర్మన్ వేముల రామకృష్ణ,జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి నాయకులు నందగోపాల్, ఉదయ్, కృష్ణ, వేణు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### నిజాంపేటలో విషాదం..

# స్విమ్మింగ్‌పూల్‌లో పడి మూడేళ్ల బాలుడి మృతి

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), జనవరి 4, ప్రభాతవార్త:** ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రనగర్‌లోని సంతోష్ నిలయంలో నివాసం ఉంటున్న ఎం శరత్ కుమార్ కుమారుడు మచ్చ భక్తుని అర్జున్ కుమార్ (3) కుటుంబ సభ్యులతో కలిసి నిజాంపేట్ లోని వర్టెక్స్ ప్రైమ్ అపార్ట్మెంట్స్‌లో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. కాగా ఆదివారం ఉదయం బాలుడు మచ్చ భక్తుని అర్జున్ కుమార్ మెట్ల ద్వారా నడుచుకుంటూ వచ్చి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆడుకుంటున్నాడు. దీంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు బాలుడు కోసం వెతకగా అప్పటికే ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయిన బాలుడు నీళ్లలో విగత జీవిగా మిగిలాడు. స్విమ్మింగ్ పూల్ నుండి బయటికి తీసిన బాలుడికి సిఆర్పి చేసి ఆసుపత్రికి తరలించిన ఫలితం లేకుండా పోయింది. ఈ మెరకు కేపిహెచ్‌బి కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అర్జున్‌కుమార్ (ఫైల్)

# మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రెచ్చగొడుతున్న బిఆర్‌ఎస్ నేతలు

### పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రోళ్ల దోపిడీ గుర్తుకు రాలేదా?

### మాజీమంత్రి హరీశ్‌రావుపై జగ్గారెడ్డి ఫైర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** ఆంధ్రప్రదేశ్ నీళ్ల దోపిడి చేస్తుందంటూ మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలపై పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి మండిపడ్డారు. ఆదివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తూర్పు జగ్గారెడ్డి మాట్లాడుతూ నీళ్ల వ్యవహారంలో బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించిన తర్వాతే తెలంగాణకు నీళ్లు వచ్చినట్లు మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారంటూ వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం వల్లే తెలంగాణ ప్రజలు నీళ్లు తాగుతున్నారని ప్రచారం చేశారని బీఆర్ఎస్ అగ్రనేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



మీ పాలనలో అసలు ఎన్ని ప్రాజెక్టులు నిర్మించారంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. కృష్ణా జలాలపై సీఎం రేవంత్, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాస్తవాలు మాట్లాడారని పేర్కొన్నారు. మాజీ ప్రధాని నెహ్రూ హయాంలో నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు నిర్మాణం జరిగిందని జగ్గారెడ్డి గుర్తు చేశారు. ఇక సింగూరు, మంజీరా డ్యామ్‌లు సైతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించారని వివరించారు.

హైదరాబాద్ మహానగర ప్రజలకు సింగూరు, మంజీరా డ్యామ్‌ల ద్వారా తాగునీరు అందుతుందని జగ్గారెడ్డి తెలిపారు. సింగూరు, మంజీరా డ్యామ్ నీళ్లు తాగలేదని చెప్పగలరా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన నిలదీశారు. 2014లో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులు పూర్తి చేయాలని.. నాటి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కోరితే వారిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. కృష్ణానదిపై పెండింగ్ ప్రాజెక్టులు నిర్మించాలని ఈ పదేళ్లలో మీకు గుర్తు రాలేదా? అంటూ హరీశ్ రావును జగ్గారెడ్డి ప్రశ్నించారు. జగన్.. కేసీఆర్ ఎందుకు కూర్చున్నారు? జగన్‌తో కెసిఆర్, కేటీఆర్ ప్రగతి భవన్ లో మీటింగ్ పెట్టలేదా..? మీరు మాట్లాడితే తప్పు లేదు. రేవంత్ మాట్లాడితే తప్పా అని ప్రశ్నించారు. కేసీఆర్.. టీడీపీలో డిప్యూటీ స్పీకర్ కూడా అయ్యాడు. ఆంధ్రోళ్ల దోపిడీ గురించి అప్పుడూ ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా హరీష్ చెప్పినవి అన్ని దొంగ లెక్కలు..దొంగ మాటలు నీకు..నీ మామ కి చంద్రబాబు పదవి ఇవ్వక పోయే సరికి తెలంగాణ గుర్తుకు వచ్చింది అని పేర్కొన్నారు. చిన్న రాష్ట్రాలతో ఉపయోగం లేదని అసెంబ్లీ లో కేసీఆర్ చెప్పలేదా..?కేసీఆర్ సభలో మాట్లాడిన వీడియో ను బయట పెట్టాలి అని పేర్కొన్నారు. మీ మామ తోలు తీస్తా అనకపోతే రేవంత్ రెడ్డి తిట్టే వాడా..? మీరెందుకు తిడుతున్నారు చెప్పండి నువ్వు తోలు తీస్తా అంటే.. నేను నాలుక కోస్తా అన్నాడు అనుకపోతే ఎట్లా..? అని ప్రశ్నించారు. తిడితే తిట్టరా..? రేవంత్ కాబట్టి నాలుక కోస్తా అన్నాడునేను ఉంటే... ఇంకా ఏదో అనే వాణ్ణి అని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి,ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల ఇరిగేషన్ ప్రజెంటేషన్ కరెక్ట్,హరీశ్‌రావు ప్రజెంటేషన్ బోగస్, మీరు అధికారంలో ఉంటే ఆంధ్రోళ్ల నీళ్ల దోపిడి గుర్తుకు రాదు, మీరు ప్రతిపక్షంలో ఉంటే ఆంధ్రోళ్ల దోపిడి గుర్తుకు వస్తదని వ్యాఖ్యానించారు.

# 'సర్' పేరిట ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్యం అపహాస్యం

### ఎపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ టి.రజని

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జనవరి 4, ప్రభాతవార్త:** 'రక్తపాతం లేని రాజకీయ నరమేధం'.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 'సర్' అని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'సర్ సిటిజన్ ఓటింగ్ రైట్స్' అనే అంశంపై హైకోర్టు రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయ కులు కామేశ్‌బాబు అధ్యక్షతన సెమినార్ జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ టి.రజని మాట్లా డుతూ సర్ పేరుతో ఓట్లను తొలిగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని పీపుల్స్ రిప్రజంటేషన్ యాక్ట్ 354, 357 ప్రకారం ఓటును తొలగించే క్రమంలో అతనికి నోటీస్ ఇచ్చి వివరణ తీసు కోవాలని అన్నారు. కాని నేడు ప్రజల ప్రాథమిక హక్కు లను కాలరాస్తూ ఓట్లను విచ్చల విడిగా తొలగిస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశ పౌరుడిగా గుర్తింపునిచ్చే ఓటు ప్రమా దంలో పడిందని హెచ్చరించారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో యూరప్ లాంటి కొన్ని దేశాల్లో కొన్ని వర్గాలను దేశం నుంచి తరిమేయడమో లేదా చంపేయడమో చేశా రని అన్నారు. కాని నేడు భారతదేశంలో అలాంటి చర్య లు కుదరని నేపథ్యంలో పొలిటికల్ సొసైటీ సభ్యులుగా ఉండకూడదని వారి పౌరసత్వాన్ని చంపేందుకు సర్ పేరుతో ఓట్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం గతంలో షిఫ్టెడ్, ఆబ్సెంట్, డెడ్, డూప్లికేట్ (ఎస్ఏడీడీ) పేరుతో ఓట్లను తొలగించే ప్రక్రియ స్థానంలో తెచ్చిన సర్ ద్వారా ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నారని వ్యాఖ్యానించారు. బీహార్లో జరిగిన సర్‌తో వారి కుట్ర తేటతెల్లమైందని పేర్కొ న్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 2.93 కోట్లు, తమిళ నాడులో 93 లక్షలు, గుజరాత్‌లో 72 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 58 లక్షలు, రాజస్తాన్లో 43లక్షలు, మధ్య ప్రదేశ్‌లో 30లక్షలు చత్తీస్గఢ్ 28 లక్షలు, కేరళలో 21 లక్షల ఓట్లను తొలగించేందుకు యత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్ల తొలగింపు ఎన్నికల ప్రక్రియ, రాజకీయ పార్టీలను గెలిపించే అంశం మాత్రమే కాదనీ, భారతీయ రాజకీయ స్వరూపమే మారిపోనుందని హెచ్చరించారు. మనదాకా వస్తే గాని దాని ప్రభావం అర్థం కాదని అభిప్రాయపడ్డారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు డీజీ. నర్సింహారావు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న ఎపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ టి.రజని

# సూర్యాపేట జిల్లా అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ చేసింది శూన్యం

### పేదలకు ఇళ్లు ఇచ్చేదెప్పుడు?

### తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హుజూర్‌నగర్‌టౌన్, జనవరి 4, ప్రభాతవార్త :** తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనం బాట కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కార



ఆదివారం హుజూర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

పోరుబాటని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహంతో పాటు, అమరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగులను, బాలింతలను పరా మర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గొప్పలు చెప్పుకునే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూర్యాపేట జిల్లాతోపాటు కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నియోజకవర్గంలో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం వల్ల అనేక గ్రామాలు, భూములు సున్నపు రాయి నిల్వలు మునిగి పోయాయని నీళ్లు ఆంధ్ర ప్రాంతానికి తరలి వెళ్తే తెలంగాణ ప్రాంతం మునకకు గురైందని విమర్శించారు. నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా, నేడు నీటిపారుదల పౌరసరఫరాల మంత్రిగా ఈ ప్రాంతంలో ఉత్తంకుమార్‌రెడ్డి నిలువ నీడలేని పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వలేకపోయారని విమ ర్శించారు. నియోజకవర్గ కేంద్రంలో ఏరియా ఆసుపత్రిలో సరైన డాక్టర్లు సిబ్బంది లేరని, ఇందులో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం లేదని ఆమె అన్నారు. జిల్లాలో 54 లిఫ్టులలో 24 పనిచేయడం లేదని, పాత లిఫ్టులు మరమ్మతు చేయకుండా కొత్త లిఫ్టుల నిర్మాణం వెనుక కమిషన్ల కక్కుర్తి లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు, నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాల హామీ ఎటు పోయిందని అన్నారు. మట్టపల్లి వద్ద కృష్ణా నది జలాలు కాలుష్యం బారిన పడి పట్టణానికి మంచినీరు రాకుండా వున్నా మంత్రి ఉత్తమ్ ఎందుకు పట్టించు కోవడం లేద న్నారు. హుజూర్నగర్ ప్రాంతం తెలంగాణ సాయుధ పోరాటా నికి కేంద్రమని ఈ ప్రాంతం నుంచే తెలంగాణ జాగృతి పోరాటం ప్రారంభించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు సాధించేలా అన్ని ప్రాంతాల్లో కొత్త కమిటీలను వేసి ఉద్యమిస్తామన్నారు. ఈ సమా వేశంలో జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, కేఎల్ఎన్ రావు, ఎస్కే మస్తాన్, గోవర్ధన్, దుండి గల నారాయణ, సత్య నారా యణరెడ్డి, రహిమ కిషోర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రెండోరోజు టెట్‌కు 81.5 శాతం హాజరు

### ముగిసిన మ్యాథ్స్, సైన్స్ పరీక్షలు

### నేటి నుంచి సోషల్ పరీక్షలు ప్రారంభం

### మేడ్చల్ జిల్లాలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన పాఠశాల విద్యడైరెక్టర్ నవీన్ నికోలస్

### నేటి ఉదయం 55 కేంద్రాల్లో, మధ్యాహ్నం 39 కేంద్రాల్లో పరీక్షలు

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో శనివారం నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) జనవరి-2026 పరీక్షలు ప్రశాంతంగా కొనసా గుతున్నాయి. రెండోరోజు పరీక్షలకు 81.5 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్టు పాఠశాల విద్య డైరక్టర్, టెట్ చైర్మన్ నవీన్ నికోలస్ తెలిపారు. పరీక్షల తీరును ఆయన ఆదివారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఓల్డ్ ఆల్వాల్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష కేంద్రంలో పరిశీలించారు. ఆదివారం జరిగిన పరీక్ష ప్రశ్నల సరళి మధ్యస్థంగానే ఉన్నట్టు అభ్యర్థులు చెప్పారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో తెలుగు సైకాలజీ మెథడాలజీ విభాగాల్లో ప్రశ్నల సరళి కాస్త తేలికగానే ఉన్నాయని అభ్యర్థులు తెలిపారు. ఇంగ్లీష్ మ్యాథ్స్ సైన్స్ ప్రశ్నల్లో కొన్ని సులభంగా ఉన్నప్పటికీ.. కొన్ని కఠినంగా వచ్చినట్టు తెలిపారు. మేడారం జాతరపై, పలువురు కవులపై, ఛందస్సు పై, ఇన్స్పైర్ మనక్ పై, వివిధ పంట రకాల వ్యాధులపై, జాతీయ పాఠ్య ప్రణాళిక పై ప్రశ్నల సరళి ఇచ్చారు. ఆదివారంతో మ్యాథ్స్, సైన్స్ పరీక్షలు ముగిశాయి. నేటి(సోమవారం) నుంచి సోషల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జరిగిమొదటి రోజు టెట్ పరీక్షల ప్రశ్నల సరళి మధ్యస్థంగా ఉన్నట్టు అభ్యర్థులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం పేపర్-2 పరీక్ష 85 పరీక్షా కేంద్రాల్లో జరగగా.. 22,546 మందికి గానూ 18,235 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నా సెషన్‌లో పేపర్-2 పరీక్ష 91 కేంద్రాల్లో జరగగా.. 22,912 మందికి గానూ 18,819 మంది హాజరయ్యారు. ఉదయం సెషన్‌కి 80.88 శాతం మంది, మధ్యాహ్నం సెషన్‌కి 82.03 శాతం మంది హాజరైనట్టు పాఠశాల విద్య డైరక్టర్, టైట్ చైర్మన్ నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు(సోమవారం) ఉదయం 55 కేంద్రాల్లో, మధ్యాహ్నం 39 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. రెండవ రోజు 45458 మందికిగాను 37054 మంది హాజరయ్యారు. 8404 మంది ఆబ్సెంట్ అయ్యారు. రెండో రోజు 81.5 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. శనివారం, ఆదివారం కలిపి 80919కిగాను 65270 మంది హాజరయ్యారు. టెట్ పేపర్-2 మ్యాథ్, సైన్స్ విభాగం మైనర్ మీడియం తప్ప మిగతా అభ్యర్థులకు పరీక్షలు ముగిశాయి. సోమ, మంగళవారాల్లో(5, 6) తేదీల్లో సోషల్ విభాగం వారికి పరీక్షలు జరగనున్నాయి.

# వెనిజులాపై అమెరికా సామ్రాజ్యవాద దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

### డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** వెనెజులాపై అమెరికా యుద్ధోన్మాద దాడులను, అప్రజాస్వామిక చర్యలను, దేశాధ్యక్షుడి అక్రమ అరెస్టులను భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఒక స్వతంత్ర దేశంపై అమెరికా సాగిస్తున్న ఆధిపత్య ధోరణి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ విమర్శించారు. వెనిజులా ప్రజల తీర్పును గౌరవించకుండా, అక్కడి ప్రభుత్వాన్ని కూలదోయాలని అమెరికా ప్రయత్నించడం ప్రజాస్వామ్య విలువలకే విఘాతమన్నారు. వెనిజులాలోని సహజ వనరులు.. ముఖ్యంగా చమురు నిల్వలను హస్తగతం చేసుకోవడమే లక్ష్యంగా అమెరికా ఈ తరహా అక్రమ ఆంక్షలకు, కుట్రలకు పాల్పడుతోందన్నారు. వెనిజులా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ మదురో ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూడటం అమానుషమన్నారు. వెనిజులా అంతర్గత విషయాల్లో అమెరికా జోక్యాన్ని వెంటనే నిలిపివేయాలని, తమ దేశ నాయకుడిని ఎన్నుకునే హక్కు కేవలం వెనిజులా ప్రజలకు మాత్రమే ఉందన్నారు. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వెనిజులా యువతకు, ప్రజలకు డివైఎఫ్ఐ సంపూర్ణ సంఘీభావాన్ని తెలియజెస్తుందని కోట రమేష్, అనగంటి వెంకటేష్ స్పష్టం చేశారు.

# వెనిజులాపై డొనాల్డ్ ట్రంప్ జోక్యం అమానుషం

### అమెరికా చర్యలను భారత్ ఖండించాలి

### సిపిఐ అగ్ర నాయకుడు నారాయణ

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** వెనుజులాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమానుషంగా జోక్యం చేసుకుంటున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ నాయకులు డాక్టర్ కె నారాయణ మండిపడానడరు. వెనిజులాపై అమెరికా చర్యలను భారత్ ఖండించాలని డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాలనలో వెనిజువెలాలో ప్రజల చేత ఎన్నికైన నాయకుడిని అక్రమంగా అపహరించి నిర్బంధించడం ప్రజా స్వామ్యంపై, జాతీయ సార్వభౌమత్వంపై, అంతర్జాతీయ చట్టాలపై జరిగిన తీవ్ర దాడి అని దీనిని సిపిఐ ఖండిస్తోందన్నారు. ఈ చర్యకు మాదకద్రవ్యాలు గానీ, నేరాలు గానీ కారణం కాదని.. ఇది పూర్తిగా సామ్రాజ్యవాద దోపిడీ చర్య అని నారాయణ విమర్శించారు. వెనిజువెలాలో ఉన్న అపార చమురు వనరులు, ఖనిజ సంపదను కబళించాలనే దురాశే దీనికి మూల కారణమన్నారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న దేశాలపై కుట్రలు, రాజ కీయ, సైనిక బెదరింపులు జరగడం చరిత్రలో పునరావృతమవుతూనే ఉందన్నారు. వెనిజులా ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అక్కడి ప్రజలు తమ నాయకత్వాన్ని నిర్ణయించుకునే పూర్తి హక్కు కలిగి ఉన్నారని, బయటి శక్తులు అపహరించడం, అస్థిరత సృష్టించడం, వారిపై అధికారం రుద్దడం అమానుషం, అక్రమం, అసహ్యకరమన్నారు. స్వతంత్ర విదేశాంగ విధానంతో, అనేక దేశాలతో సహకారం ద్వారా భారత్ ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు పొందుతోందని, కాబట్టి కార్పొరేట్-సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ఇతర దేశాల్లో ప్రజాస్వామ్యాన్ని నలిపివేస్తే భారత్ మౌనంగా ఉండకూడదని నారాయణ అన్నారు. .భారత ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే అమెరికా చేసిన అక్రమ చర్యలను బహిరంగంగా ఖండించాలన్నారు. జాతీయ సార్వభౌమత్వం, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబాటును ప్రకటించాలని, చమురు-ఖనిజ దోపిడీకి దారి తీసే సామ్రాజ్యవాద జోక్యాలను తిరస్కరించాలని నారాయణ డిమాండ్ చేశారు. ఈ సమయంలో ప్రధాని మోడీ మౌనం వహించడం అంటే.. నైతిక భాగస్వామ్యం వహించినట్టేనని మండిపడానడరు. అసంఘటిత కూటములు లేని విధానం, శాంతి, సార్వభౌమత్వ గౌరవం అనే భారత సంప్రదాయం స్పష్టమైన, ధృఢమైన స్పందనను కోరుతుందన్నారు. సామ్రాజ్యవాదాన్ని ఖండించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నారాయణ డిమాండ్ చేశారు.

## లారీ, బైక్ ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం

**వలిగొండ, జనవరి 4, ప్రభాతవార్త:** లారీ బైక్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని నరసాపురం ఆవాస గ్రామం బోరబండ గూడ వద్ద వలిగొండ తోరూర్ రోడ్డుపై చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన కుక్కల సాయికిరణ్ (19), దాచారం గ్రామానికి చెందిన బోళ్ల దీక్షిత్ (21) ఇద్దరు స్నేహితులు తమ పల్సర్ బైక్ గిలీ07బీతీ9040పై భువనగిరికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇనుపరాడ్ల లోడ్‌తో వస్తున్న లారీ ఢీ కొనడంతో లారీ వెనుక టైర్ల కింద ఇద్దరు యువకులు పడి మృతి చెందారు. సమాచారం తెలిసిన ఎస్సై యుగంధర్ గౌడ్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని కృతదేహాలను రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి మృతుని తండ్రి కుక్కల యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# అమానవీయంగా మేకలు, గొర్రెల నుంచి రక్తం తీస్తూ అమ్మకాలు

### కీసరలో దారుణం.. నకిలీ వెటర్నరీ డాక్టర్‌తోపాటు మటన్‌షాపు యజమాని అరెస్టు

**హైదరాబాద్, (కీసర) జనవరి 4, ప్రభాతవార్త:** డబ్బుల సంపాదన కోసం కొందరు ఎంతటి దుర్మార్గలకైనా ఒడిగడుతున్న రోజులివి. మంచి మానవ త్వం మరచిపోయిన కొందరు ఏకంగా మటన్ షాపుకు వధించే నిమిత్తం తీసుకువచ్చిన మేకలు, గొర్రెలకు ఎలాంటి మత్తు ఇవ్వకుండానే, అవి బతికి వుండగానే మనుషుల నుంచి రక్తం తీసినట్లు నేరుగా సిరంజిలు గుచ్చి రక్తాన్ని తీస్తూ వాటిని నగరంలోని కాచిగూడలో గల ఓ ప్రైవేటు సంస్థకు విక్ర యిస్తున్నారు. ఈ కిరాతక చర్యలకు ఆ మూగ జీవాలు బతికి వుండగానే జీవచ్ఛవాలుగా మారుతూ రక్తహీనత కారణంగా గంటా రెండు గంటల్లోపే చనిపోతున్నాయి. ఇలాంటి అమానవీయమైన దారుణ ఘటన నగర శివార్లలోని మేడ్చల్ జిల్లా కీసరలో వెలుగు చూసింది. దీనిపై వెంటనే స్పందిం చిన పోలీసులు ఈ దారుణానికి కారణమైన ఇద్దరిని అరెస్టు చేయడంతో పాటు మూగజీవాల నుంచి సేకరించిన రక్తం ప్యాకెట్లను పెద్ద సంఖ్యలో జ ప్తు చేశారు. వివరాలు ఇలావున్నాయి. కీసర పరిధిలోని సత్యనారాయణ కాలనీలో ఓ మటన్ షాపు వుంది. ఈ మటన్ షాపు యజమాని సుందర్ సోను కొంతకాలం క్రితం కాచిగూడలోని సిఎస్‌కె ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్టు అనే ఓ ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని తన వద్దకు వధించేం దుకు వచ్చే మేకలు, గొర్రెల నుంచి ముందుగానే ఎలాంటి మత్తు ఇవ్వకుండా సిరంజీలతో రక్తాన్ని బయటకు తీస్తూ వాటిని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతున్నాడు.

ఇందుకు నకిలీ వెటర్నరీ వైద్యుడు సంజయ్ తనవంతుగా సహాయం చేస్తున్నాడు. మూగజీవాల నుంచి రక్తాన్ని తీసివేశాక అవి అపస్మార కస్థితిలో వెళ్లి చనిపోయాక వాటిని వధించి మాంసాన్ని మటన్ షాపు యజమాని సుందర్ సోను అమ్ముతున్నాడు. శనివారం రాత్రి కూడా పదికి పై గా మేకలు, గొర్రెలను ఇలాగే చిత్రహింసలకు గురిచేసి వాటి నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సమయంలో ఆ మూగజీవాల రోదన అరణ్య రోదన గానే మారింది. కాగా దీనిపై పక్కా సమాచారం అందుకున్న కీసర పోలీసులు ఆదివారం తెల్లవారు జామున మటన్ షాపుపై దాడిచేసి మూగజీవాల నుంచి సేకరించిన 130 రక్తం ప్యాకెట్లను జప్తు చేశారు. కాగా మూగజీవాల రక్తం నుంచి సేకరించిన రక్తంతో సిఎస్‌కె ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్టు స ంస్థ వేరే జంతువుల కోసం బ్లడ్ అగర్ ప్లేట్‌లెట్లను తయారు చేస్తోందని పోలీసులు తేల్చారు. ఈ ఘటనలో మటన్ షాపు యజమాని సుందర్‌సోనుతోపాటు నకిలీ వెటర్నరీ వైద్యుడు సంజయ్‌ను అరెస్టు చేశారు. వీరివద్ద నుంచి 130 ప్లాస్టిక్ బ్యాగుల్లో వున్న మూగజీవాల రక్తాన్ని జిహెచ్ఎంసి వెటర్నరీ విభాగానికి అప్పగించారు. కాగా ఈ ఘటనలో వీరితోపాటు ఇంకా ఎవరిద్దైనా పాత్ర వుందా...? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.



ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసిన మేకలు, గొర్రెల నుంచి తీసిన రక్తం ప్యాకెట్లు

# డ్వాక్రా సంఘాల బకాయిలపై సర్కార్ ఉక్కుపాదం

## అప్ప కట్టకపోతే ఆస్తులు జప్తు, రెవెన్యూ రికవరీ చట్టం అమలు

## సభ్యురాలు కట్టకపోతే గ్రూప్‌లోని అందరిపైనా భారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** డ్వాక్రా సంఘాల బకాయిల విషయంలో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా స్త్రీనిధి ద్వారా రుణాలు పొంది, నెలవారీ వాయిదాలు చెల్లించడంలో నిరక్ష్యం వహిస్తున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమైంది. పేరుకుపోయిన మొండి బకాయిల వసూలు కోసం ప్రభుత్వం తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగిస్తారు. దీని ప్రకారం రుణం చెల్లించని వారి ఆస్తులను జప్తు చేసే అధికారం అధికారులకు లభిస్తుంది. ఇళ్లు, భూములు వంటి స్థిరాస్తులతో పాటు ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని, వాటిని బహిరంగంగా వేలం వేస్తారు. ఆ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వం తన బకాయి కింద జమ చేసుకుంటుంది. ఈ చట్టం అమలుతో బకాయిదారులపై ఒత్తిడి పెంచి, వసూళ్లను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ఈ సమస్య తీవ్రంగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 60 వేల మందికి పైగా డ్వాక్రా సభ్యులు ఉండగా, వారికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.475 కోట్ల రుణాలు అందించింది.

చాలామంది మహిళలు తమ వ్యాపారాల కోసం రూ.30 వేల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. అయితే, జిల్లాలో వసూలు కావాల్సిన రూ. 101 కోట్లకు గాను కేవలం రూ.78 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. దాదాపు రూ.23 కోట్లు మొండి బకాయిలుగా పేరుకుపోవడంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ చట్టంలో అత్యంత కీలకమైన అంశం ఒకటుంది. రుణం తీసుకున్న సభ్యురాలి పేరు మీద ఎలాంటి ఆస్తులు లేకపోతే, ఆ అప్పును తీర్చే బాధ్యత గ్రూప్‌లోని మిగిలిన సభ్యులపై పడుతుంది. అంటే, ఒకరు చేసిన పొరపాటుకు సంఘంలోని అందరూ బాధ్యత వహించాల్సి వస్తుంది. అవసరమైతే ఇతర సభ్యుల ఆస్తులను కూడా జప్తు చేసేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో, సంఘంలోని మహిళలు పరస్పర సహకారంతో సకాలంలో రుణాలు చెల్లించేలా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇప్పటికే సెర్ప్, మెప్మా అధికారులు గ్రామాల్లో పర్యటించి బకాయిల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ స్పందన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠినంగా వ్యవహరించనున్నట్లు డీఆర్డీఏ అధికారులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ల నుంచి కూడా అనుమతులు రావడంతో, త్వరలోనే జప్తు ప్రక్రియ ప్రారంభం కానుందని తెలుస్తోంది.



# బ్రూక్లిన్ జైలులో వెనిజులా అధ్యక్షుడు మదురో!

**వాషింగ్టన్, జనవరి 4:** అపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్‌చేపట్టిన అమెరికా వెనిజులా అధ్యక్షుడు మదురో ఆయన సతీమణిని బంధించి న్యూయార్క్‌కు తరలించిన తర్వాత వారిని బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో ఉంచారు. ఆర్ కెల్లీ,సీన్ డిడ్డీ కాంబ్‌నస వంటి మ్యూజిక్‌స్టార్‌లు ఉన్న ఈ జైలు ఎంతో సమస్యాత్మకమైనదిగా భావిస్తారు. నిందితులను అక్కడికి పంపించేందుకు కొందరు న్యాయమూర్తులే నిరాకరిస్తారని వాడుకలో ఉంది. బ్రూక్లిన్‌లోని ఎండిసిని 1990లో ప్రారంబించారు. అక్కడ ప్రస్తుతం 1300 మంది ఖైదీలున్నారు. మన్‌హట్టన్; బ్రూక్లిన్‌ఫెడరల్ న్యాయస్థానాల్లో విచారణకోసం చూస్తున్నవారిని ఇక్కడికి తరలిస్తారు. వైట్‌కాలర్ నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితోపాటు గ్యాంగ్‌స్టర్‌లు మాదకద్రవ్యాల కేసులో నిందితులను ఉంచుతారు. వెనిజులా అద్యక్షుడు నికొలస్ మదురో ఇపుడు ఈ జైలులోనే ఉన్నారు. హోండురాస్ మాజీ అద్యక్షుడు జువాన్ ఆర్లాండో ఫెర్నాండెజ్ గతంలో ఇక్కడే బందీటా ఉన్నారు. ఆయనకు ఈ కేసులో 45 ఏళ్ల శిక్ష పడింది. వనిజులా నిఘా విభాగం మాజీ చీఫ్ హ్యూగో కార్వాజల్‌తోపాటు ఆదేశ పలువురుప్రముఖులు బందీలుగా ఉన్నారు. కాగాబ్రూక్లిన్‌జైలును భూమిపై ఉన్న నరకం అని నిరంతర విషాదంగా వర్ణిసానతరు. ఇక్కడి హింసాత్మక ఘటనలపై ఖైదీలు వారి న్యాయవాదులనుంచి ఎన్నో ఫిర్యాదులు వస్తాయి. 2024లో తోటిఖైదీల చేతిలోనే ఇద్దరు ఖైదీలు హత్యకావింపబడ్డారు. 2019లో విద్యుత్ అంతరాయం కారణంగా వారంరోజులు ఖైదీలు చలి చీకట్లోనే ఉన్నారు.

# విద్యుత్ కోతలనే మాట రానీయొద్దు

## అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి

## ఎన్పీడిసిఎల్ అధికారులకు డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క కీలక ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** డిస్కం పరిధిలో ఏ స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరిగాక కరెంట్ కోతలు అనే మాట రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం ఎన్పీడీసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి, డైరెక్టర్లు నూతన సంవత్సరం సందర్భంగా ప్రజా భవన్‌లో డిప్యూటీ సిఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిస్కం పరిధిలో విద్యుత్ సరఫరాపై డిప్యూటీ సిఎం ఆరా తీశారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతిపాదించిన నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ వినియోగదారులకు ప్రస్తుతం అందుతున్న తరహాలో ఏ మాత్రం తేడా లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించాలన్నారు. డిప్యూటీ సిఎంను కలిసిన వారిలో సంస్థ డైరెక్టర్లు మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, మధుసూదన్, ప్రభాకర్ ఉన్నారు.

# మహాత్మాగాంధీ నరేగా బచావో సంగ్రామ్‌కు కాంగ్రెస్ ప్లాన్

## 9 మందితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసిన అధిష్టానం

## తెలంగాణ నుంచి మంత్రి సీతక్కకు చోటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపరిరక్షణ కోసం చేపట్టిన 'ఎంజిఎన్‌ఆర్‌ఈజిఏ బచావో సంగ్రామ్' కార్యక్రమం అమలును పర్యవేక్షి ంచడం, మార్గనిర్దేశం చేయడం కోసం కాంగ్రెస్ అధిష్టానం 9 మందితో కూడిన సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తక్షణమే అమల్లోకి వస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీకి అజయ్ మాకెన్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా జైరాం రమేశ్, సందీప్ దీక్షి త్, డా.ఉదిత్ రాజ్, ప్రియాంక్ ఖర్గే, దీపికా పొందే సింగ్, డా.సునీల్ పాన్వార్, మణీష్ శర్మ ఉన్నారు. అదేవిధంగా కమిటీలో అధిష్టానం తెలంగాణ మంత్రి డి.అనసూయ సీతక్కకు చోటు. కల్పించారు. అలాగే, కాంగ్రెస్‌కు చెందిన అన్ని ఫ్రంట్ ఆర్గనైజేషన్ల అధ్యక్షులు, ఏఐసీసీ ఓబిసి,ఎస్‌సి. మైనారిటీ, ఆదివాసీ కాంగ్రెస్ విభాగాలు, కిసాన్ కాంగ్రెస్ చైర్‌పర్సన్లు కూడా ఈ సమన్వయ కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు.. అమలులో ఎదురవుతున్న సమస్యలు, హక్కుల పరిరక్షణకు దిశానిర్దేశం చేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కమిటీ. ముఖ్య లక్ష్యమని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

# రేపు తిరుమలకు మారిషస్ అధ్యక్షుడు రాక



**తిరుమల, జనవరి 4గి ప్రభాతవార్త ప్రతినిధి:** మారిషస్ దేశ అధ్యక్షుడు ధరంబీర్‌గోకుల్ రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనకు మంగళవారం సాయంత్రం తిరుపతికి విచ్చేస్తున్నారు. ఆయన 6, 7తేదీల్లో శ్రీకాళహస్తి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రముఖుని పర్యటనతో తిరుపతి జిల్లా యంత్రాంగం ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది. జిల్లా ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ ఎన్.మౌర్య, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఇతర ఉన్నతాధికారులు కలసి ఆదివారం భద్రత, ప్రోటోకాల్ ఏర్పాట్లపై సమీక్షించారు. అందరూ కలసికట్టుగా పర్యటనను విజయవంతం చేయాలని, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని మౌర్య సూచించారు.

# క్రిస్మస్‌కు ముందునుంచే దాడికి ప్రణాళిక

## రెక్కీలు, డ్రోన్లతో విన్యాసాలు స్పష్టత వచ్చాకే ఆపరేషన్

**వాషింగ్టన్, జనవరి 4:** దక్షిణ అమెరికా దేశమైన వెనిజులాపై అమెరికా మెరుపు దాడి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. హఠాత్తుగా సైన్యంతో చొరబడిన



అమెరికా ఆ దేశ అధ్యక్షుడు మదురోనుఆయన భార్యతో సహా బంధీగా తీసుకొచ్చింది. డ్రగ్స్ ముఠాకు అడ్డుకట్ట వేయాలని డొనాల్డ్ ట్రంప్ పదేపదే హెచ్చరించినా బేఖాతరు చేయడంతోనే ఆపరేషన్ అబ్సల్యూట్ రిసాల్వ్‌ను అమెరికా సిద్ధపడింది. వెనుజువెలాపై నిరుడు క్రిస్మస్‌కు ముందే పక్కా ప్రణాళికతో దాడి చేయాలని యూఎస్‌ఏ భావించిందట. కానీ, అనుకోకుండా వాయిదా వేసుకోవాల్సి వచ్చిందని జాయింట్ చీఫ్స్ చైర్మన్ జెనరల్ డాన్ కైన్ తెలిపారు. యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తూ వెనిజులాపై అకస్మిక దాడి చేసింది అమెరికా. ఇదంతా రెండు మూడు రోజుల్లో ప్రణాళిక వేసుకొని చేసింది మాత్రం కాదనేది వాస్తవం. ఆ దేశంపై దాడికి కొన్ని నెలల ముందే అమెరికా సైన్యం రిహార్సల్స్ చేసింది. 150కి పైగా యుద్ధ విమానాలు, డ్రోన్స్ ఉపయోగించి ఆపరేషన్ అబ్జల్యూట్ రిసాల్వ్‌ను విజయ వంతంగా యూఎస్ సైన్యం పూర్తి చేసింది . గత ఏడాది క్రిస్మస్‌కు ముందే వెనిజులాపై విధ్వంసానికి అమెరికా యత్నించిందని జాయింట్ చీఫ్స్ చైర్మన్ జెనరల్ డాన్ కైన్ తెలిపారు. క్రిస్మస్ ముందే దాడి చేయాలనుకున్నాం. సైన్యం కూడా సన్నద్ధంగా ఉంది. కానీ, వాతావరణం అనుకూలించక పోవడం, మేఘాలు తక్కువ ఎత్తులో ఉండడమే కాకుండా పర్వతాలు, సముద్రాలు కూడా అవరోధంగా మాడంతో కారణంగా దాడిని వాయిదా వేసుకున్నాం. ప్రపంచంలోని సుశిక్షితు లైన వైమానిక దళం మాత్రమే ఈ సాహసం చేయలగలదు అని డాన్ కైన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి 10:46 గంటలకు ట్రంప్ గుడ్ లక్ వేగంగా ముగించేయండి అని తన సైన్యానికి చెప్పారు. అధినేత ఆదేశాలు రావడమే ఆలస్యం పశ్చిమ ప్రాంతంలోని 20 స్థావరాల నుంచి వెనిజులారాజధాని కరాకస్‌పై దండెత్తింది సైన్యం. శనివారం ఉదయం 2:01 గంటలకు అధ్యక్షుడు ముదురో నివాసానికి అమెరికా ఆర్మీ చేరుకుంది. 30 నిమిషాల వ్యవధిలోనే ఆ దేశ ప్రధాన సైనిక కేంద్రాలు, వాయు, నౌకా కేంద్రాలను పేల్చేసిన యూఎస్ సైన్యం అనంతరం మదురో,ఆయన భార్య ఫ్లోరెన్‌ను బందీగా పట్టుకొని అమెరికాకు తరలించింది.

వెనిజులాలో భారీగా ఉన్న చమురు నిల్వలపై ట్రంప్ కన్ను పడిందని అందుకే ఆ దేశాన్ని హస్తగతం చేసుకునేందుకు ఆయన ఈ దాడికి తెగించారని అమెరికా విపక్షనేతలు పెద్ద ఎత్తున విమర్శలుచేస్తున్నారు.

# భస్మాసురునికి సోదరుడు కెటిఆర్

## పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భస్మాసురునికి సోదరుని (కజిన్ బ్రదర్) వంటి వారని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ వ్యంగ్యాస్త్రం సంధించారు. కెటిఆర్ అహంకారం పరాకాష్టకు చేరిందని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బంగారు తెలంగాణను భ్రష్టు పట్టించిన సైన్యం బిఆర్‌ఎస్ నేతలది అని తెలిపారు. నిరుద్యోగుల ఉసురు తగలడం వల్లే బిఆర్‌ఎస్‌కు ఈ పరిస్థితి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. బిసిల పట్ల చిత్తశుద్ధితో తాము నలభై రెండు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేశామని ఆయన తెలిపారు.ఉరి తీయడం అంటే తప్పు చేసిన వారికి సరైన శిక్ష వేయడం అనే అర్థంగా భావించాలని ఆయన వివరించారు.

ఎన్నికల్లో ఎవరికి ఉరి వేయాలో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని ఆయన తెలిపారు. ఎన్నో ఆశలతో కోట్లాది మంది తెలంగాణను తెచ్చుకుంటే వారి ఆశలను బిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కిందని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం చేసిన రైతు రుణ మాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కెటిఆర్‌కు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. కెటిఆర్‌కు ధైర్యం ఉంటే ముందుగా కవిత చేసిన ఆరోపణలకు సమాధానాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రికార్డ్ స్థాయిలో ఉద్యోగాలు ఇచ్చిన విషయం వారికి కనిపించడం లేదా? బడుగు బలహీన వర్గాల వారి కోసం కులగణన,బీసీ రిజర్వేషన్ల పెంపు చేసినందుకు మమ్మల్ని శిక్షించాలా? లేకపోతే బీసీలను మోసం చేసిన మిమ్మల్ని శిక్షించాలా? అని ప్రశ్నించారు. ఇప్పటికే కాళేశ్వరం అవినీతితో ప్రజలతో చీ కొట్టించుకున్న బిఆర్‌ఎస్ ఇప్పుడు పాలమూరు ప్రాజెక్టులో వారి బాగోతం బయట పడుతుందని అని భయంతో అసెంబ్లీ నుంచి పోరిపోయారు. ఈ విషయాన్ని పక్కదోవ పట్టించడానికి చౌకబారు ప్రకటనలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని మీ పాలనలో అధోగతి పాలు చేసిన మిమ్మల్ని ప్రజలు అసెంబ్లీ లోక్‌సభ పంచాయతీ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో శిక్షించారు. అయినా మీరు మారడం లేదని వ్యాఖ్యానించారు.

**వారాంతం.. వైకుంఠద్వారం**

# కొండంతా భక్తజనం

**తిరుమల, జనవరి 4, ప్రభాతవార్త ప్రతినిధి:** కొనసాగుతున్న వైకుంఠద్వార దర్శనాలు... ఆపై వారాంతం కావడంతో ఆదివారం కూడా తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. ఉదయానికి భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వద్దకు చేరాయి. సాధారణ సర్వదర్శనంలోనే భక్తులను అనుమతిస్తుండటంతో వైకుంఠ దర్శనానికి భారీగా భక్తులు తరలివస్తుండటంతో వెలుపల క్యూలైన్లలో నుండి భక్తులు వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాల్సి వస్తోంది. ఆదివారం ఉదయానికి కూడా భక్తులతో ఎటుచూసినా జనసంద్రంగా మారింది. ఉదయం 5గంటలకు వైకుంఠం-1, 2లో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు నిండాయి. సర్వదర్శనానికి భక్తులు 20గంటలు నిరీక్షిస్తున్నారు. సాయంత్రానికి మరింతగా భక్తుల

**బారులు తీరిన భక్తులు... వెంకన్న దర్శనానికి 15గంటలు**



గివైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలో బారులు తీరిన శ్రీవారి భక్తులు

రద్దీ పెరిగినా దర్శనానికి 15గంటలు పట్టేసమయం మారింది. తిరుమల క్యూలైన్లలో ఉన్న భక్తులకు వైకుంఠం కంపార్టుమెంట్లలోని భక్తులకు శ్రీవారి సేవకులు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, టి, మజ్జిగ, పాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. ఆలయంలో త్వరగా క్యూలైన్లు కదిలేలా టిటిడి అడిషనల్ ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రం వరకు 43వేల మంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు.

# లైసెన్స్‌లేని ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలపై చర్యలు

## నిఘా విభాగం అదనపు డిజి హెచ్చరిక

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు కచ్చితంగా పోలీసు శాఖ నుంచి లైసెన్స్‌లు పొందాలని, లైసెన్స్ లు లేకుండా కొనసాగే సంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నిఘా విభాగం అదనపు డిజి విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గజ్వేల్‌లో ఇటీవల జరిగిన ఓ హత్య కేసులో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు నిందితులుగా వున్నారని, వీ రిద్దరు కుత్బుల్లాపూర్‌లోని సంపద సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన వారుగా తేలిందని, ఈ సంస్థకు ఎలాంటి లైసెన్స్ లేదని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో సదరు సంస్థ యజమానితో పాటు సంస్థపైనా కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో అన్నిచోట్ల సెక్యూరిటీ ఏజెన్సీలు నిర్వహించే సంస్థలు కచ్చితంగా లైసెన్స్‌లు తీసుకోవాలని, ఇదే సమయంలో గార్డులను నియమించుకునే సమయంలోనూ వా రి గురించి ఆరా తీయాలని ఆయన సూచించారు. గార్డులపై ఎలాంటి నేర చరిత్ర వుండకూడదని, వారి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు తీసుకోవాల ని, వారి ప్రవర్తనపై నిఘా వుంచాలని విజయ్ కుమార్ తెలిపారు. ఈ విషయంలో నిబంధనలు పాటించని వారికి యేడాది జైలుశిక్ష లేదా 25 వేల రూపాయల జరిమానా విధించే వీలుందని ఆయన తెలిపారు.

# నాడు ఒసామా బిన్‌లాడెన్ హత్య..

## నేడు మదురో దంపతుల కిడ్నాప్ ఘటనలను లైవ్‌లో వీక్షించిన అమెరికా అధ్యక్షుడు!

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురోతో పాటు ఆయన భార్యను అ మెరికా సైనిక కమెండోలు బందీగా చే సుకుని అమెరికాకు తరలించిన ఘటన ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపడం తెలిసిందే. శనివారం తెల్లవారుజామున వెనిజులా రాజధాని కారకాస్ లో జరిగిన ఈ ఘటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో టీవీలో లైవ్‌లో చూడడం మరో విశేషం. ఒక దేశాధినేతను ఆయన సతీ మణిని మరో దేశాధ్యక్షుడు సైనిక బలగాలచేత దాడి చేయించి బందీగా పట్టుకోవడం ఇటీవల కాలంలో ఇదే తొలిసారి. ఈ ఘటనను దాడులకు కార ణమైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా వెల్లడించారు.

గిగతంలో అల్‌ఖైదా ఉగ్రవాద స ంస్థ అధినేత ఒ సామా బిన్ లాడెన్‌ను అమెరికా సైనిక కమెండోలు పాక్‌లోని అటోబాబాద్‌లో రహస్య స్థావరంలో వుండగా 2011 మే 2 తేదీన మె రుపు దాడులు చేసి హత మార్చడం తెలిసిందే. అమెరికాపై 2001లో ట్విన్ టవర్స్‌పై దాడులతో పాటు అనేక మంది అమాయకులను ఊచకోత కో సినందుకు లాడెన్‌పై పగబట్టిన అగ్రరాజ్యం ఈ క్రమంలో ఆఫ్ఘనిస్తాన్‌లోని అల్‌ఖైదా స్థావరాలను ధ్వంసం చేయడంతో పాటు తాలిబన్ సర్కారును కూల్చి వేయడం విదితమే. దీని తరువాత ఆఫ్ఘనిస్తాన్‌లో నాటో దళాలు చాలాకాలంపాటు రాజ్యమేలినా లాడెన్ పట్టుబడలేదు. లాడెన్ కోసం గా లించగా అతను పాక్‌లోని అటోబాబాద్‌లో సైనిన కంటోన్మెంట్‌కు సమీపంలో రహస్య స్థావరంలో భార్యలు, పిల్లలతో కలిసి వుంటున్నట్లు పసిగట్టిన అమె రికా 2011 మే రెండవ తేదీన అర్ధరాత్రి వేళ హెలికాప్టర్లలలో వచ్చిన కమెం డోలు మెరుపు దాడులుచేసి లాడెన్ సహా ఆయన భార్యలు, ఇద్దరు పిల్లలు, మరికొందరు సహాయకులను హతమార్చారు. కాగా ఈ ఘటనను నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు.



# వేడుకగా కలహ శృంగార భరిత ఉత్సవం

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం తరువాత ఐదవరోజు ఆదివారం తిరుమలలో కలహ శృంగార భరితమైన ప్రణయ కలహోత్సవం జరిగింది. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా ఆలయం మాఢవీధుల్లో ఉత్తరమాఢ వీధికి చేరుకున్నారు. అక్కడ వరాహస్వామి ఆలయం సమీపంలో అమ్మవార్లు, స్వామివారు ఎదురేగారు. ఆలయ అర్చకులు, పరిచారకులు స్వామి అమ్మవార్ల తరపున పూలబంతులను విసిరేసుకుంటూ స్వామివారిని నిందాస్తుతి చేసి పాశురాలను పారాయణం చేశారు. అమ్మవార్ల నుండి తప్పించుకుని ఆలయంలోనికి ఒకే పల్లకిలో వేంచేపు చేశారు. ఈ కార్యక్రమంలో జీయంగార్లు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొని ఆసక్తికర సన్నివేశాలను తిలకించారు.

# 82 యేళ్ల వృద్ధురాలిపై పక్కింటి యువకుడు అత్యాచారం

**రేవా(ఎంపి), జనవరి 4:** మధ్యప్రదేశ్‌లోని రేవాజిల్లాలో అత్యంత దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. 82 ఏళ్ల గిరిజన వృద్ధురాలిపై పక్కింట్లో నివసించే యువకుడు అత్యా చారం చేసినట్లు బాధితురాలు ఆరోపిం చింది. ఘటన జరిగిన రోజు ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా పక్కింటో ఉండే సుగ్గాసాకేత్ అనే యువకుడు ఇంట్లోకి చొరబడి ఆమె గొంతు నులిమాడు. తర్వాత ఆమె స్పృహ కోల్పోయిన సమ యంలో అత్యాచారానికి పాల్పడి అక్కడి నుంచి పరారయినట్లు వృద్ధురాలు తెలిపింది. జరిగిన ఘోరాన్ని



వృద్ధురాలు కుటుంబసభ్యులకు తెలియజేయడంతో ఆమెను వెంట బెట్టుకుని సిర్‌మౌర్ పోలీస్‌స్టేషన్‌కువెళ్లి ఫిర్యాదుచేసారు. అయితే పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదుచేయలేదని, వైద్యపరీక్షలు కూడా చేయలేదని బాధితురాలు ఆరోపించింది. పోలీసుల నిర్లక్ష్యంతో న్యాయంజరగలేదని భావించిన కుటుంబం మహిళా పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి మళ్లీ ఫిర్యాదు చేసారు. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో బాధితురాలి ఫిర్యాదుతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి మాట్లాడుతూ ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఫలితాలను బట్టి చర్యలు చేపడతామని తెలిపారు.

# 13 యేళ్ల బాలికపై మైనర్ల గ్యాంగ్ రేప్

## ముగ్గురు నిందితుల అరెస్టు, కర్ణాటకలోని హుబ్బళిలో ఘటన

**హుబ్బళి, జనవరి 4:** కర్ణాటకలోని హుబ్బళ్లిలో దారుణమైన ఘటన వెలుగు చూసింది. 13 యేళ్ల బాలికపై ముగ్గురు బాలురు సామూహిక అత్యా చారానికి పాల్పడ్డారు. నిందితుల వయసు 14 నుంచి 15 యేళ్ల మధ్య ఉం టుందని పోలీసులు తెలిపారు. బాధితురాలి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలురు ఆమెను బల వంతంగా ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై వరుసగా అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే తాము తీసిన విడియోను సోషల్‌మీడియాలో పెడతామంటూ బాధితురాలిని భయపెట్టారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు హైస్కూల్ విద్యార్థులు కాగా,మరొకరు చదువు మధ్యలో ఆపేసిన బాలుడు. ప్రస్తుతం బాలికకు రక్షణకల్పించామని హుబ్బళ్లి ధార్వాడ్ పోలీస్ కమిషనర్ ఎన్.శశికుమార్ తెలిపారు. నిందితులవద్ద ఉన్న మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, లోతైన దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

**తిరుపతి జిల్లా తిరుచానూరులో దారుణం**

**నిందితుడి అరెస్టు, పోక్సో కేసు నమోదు**

# చాక్లెట్ ఆశ చూపి చిన్నారిపై అత్యాచారం

**తిరుచానూరు , జనవరి 4, ప్రభాతవార్త:** తల్లిదండ్రులు కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్న గ్రామంలో అభంశుభం తెలియని ఏడేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశచూపి ఇంటిలోపలకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడిన ఘటన తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏడేళ్ల బాలికపై ఏకంగా 30 యేళ్ల నాగరాజు అత్యాచారయత్నం చేశాడు. నిందితుడు వడమాలపేట మండలానికి చెందిన వాడుగా గుర్తించారు. అతనిని తిరుచానూరు పోలీసులు పోక్సో కేసు కింద అరెస్ట్ చేశారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంట్లో తల్లిదండ్రులు కూలీపనుల కెళ్లిన సమయంలో చాక్లెట్ ఆశచూపి ఏడేళ్ల గిరిజన బాలికపై నాగరాజు ఈ దారుణానికి ఒడిగట్టాడు. బాలిక అరుపులతో స్థానికులు అక్కడకు చేరుకుని నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. తిరుచానూరు పోలీసులకు సమాచారం అందించడంతో అతనిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను సురక్షిత ప్రాంతానికి తరలించి శారీరక, మానసిక వైద్యపరీక్షలు చేయించారు. ఈ సంఘటనతో స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందని, పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్‌చేశారు.



గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద థాయిలాండ్ భక్తులు

## శివయ్య సేవలో విదేశీ భక్తులు

శ్రీకాళహస్తి, జనవరి 4 (ప్రభాతవార్త): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఆదివారం భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో థాయిలాండ్‌కు చెందిన 15 మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయం తరుపున ఇఓ డి.బాపిరెడ్డి సూచనలతో ఎఇఓ మోహన్, ఏపిఆర్‌ఓలు రవి, శ్రీనాథ్‌లు పర్యవేక్షించారు. వారికి ఆలయంలో ప్రతి విగ్రహానికి సంబంధించి వివరించారు. ఇక్కడ క్షేత్ర మహిమను చరిత్రను వివరించారు. ధాయిలాండ్ భక్తులకు స్వామి గర్భగుడిలోని స్వయంభువు వృత్తాంతాన్ని అర్చకులు వివరించారు. ఇక్కడ వెలసిన అమ్మవారిని జ్ఞాన ప్రసూనాంబ అని ఎందుకు పిలుస్తారు? అలాగే గురుదక్షిణామూర్తి దక్షిణాభిముఖంగా ఎందుకు వెలిసినారు అనే అంశాలను విదేశీ భక్తులకు వివరించారు. ప్రతి నెల హుండీల్లో అమెరికా, ఇతర దేశాల కరెన్సీ రావటం ఇక్కడకు విదేశీ భక్తుల రాకను సూచిస్తుంది.



కేంద్ర మంత్రికి స్వాగతం చెబుతున్న ఇఓ డి.బాపిరెడ్డి

## కేంద్ర మంత్రి రాహుకేతుదోష పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 4 (ప్రభాతవార్త): దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి కుటుంబసభ్యులతో కలిసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. కేంద్ర మంత్రి రాక సందర్భంగా దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ మేరకు ఇఓ డి.బాపిరెడ్డి వేద పండితులతో ఆలయ మర్యాదలతో మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించు కోవాలని కోరగా ఇఓ బాపిరెడ్డి వెంటనే వారికి ప్రత్యేక రాహుకేతు దోష నివారణ టిక్కెట్టు రూ.5 వేల కిసుగోలు చేసి సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఎఇఓలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డిలు వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లను ఆలయ ఏపిఆర్‌ఓలు రవి, శ్రీనివాసులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు వెంకటస్వామి, హరికృష్ణ, సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.



## ఎస్వీ విద్యాదాన ట్రస్ట్‌కు అంకాలమ్మ ఆలయ ట్రస్ట్ విరాళం

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి విద్యాదానట్రస్ట్‌కు తిరుపతి జిల్లా వడమాలపేట మండలం అంకాళమ్మ ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ టి.పీతాంబరం ఆదారి విరాళం అందించారు. ఆదివారం సాయంత్రం తిరుమలలో దాత టిటిడి అదనపు ఇఓ చిరామామిళ్ళ వెంకయ్య చౌదరిని కలసి 10,01,111రూపాయలు చెక్కును విరాళంగా అందజేశారు. శ్రీవారిపై భక్తి విశ్వాసాలతో విరాళం అందించినట్లు చెప్పారు.

## విద్యుత్ భారం నుండి ఊరట

- ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్

గన్నవరం(కృష్ణా), జనవరి 4, (ప్రభాతవార్త): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రప్రజలకు రూ.4,498కోట్ల విద్యుత్ భారం నుండి ఊరట కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవటం అభినందనీయమని రాష్ట్రప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కొనియాడారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2019-24 మధ్యకాలంలో వినియోగించిన విద్యుత్తు రూ.4,498 కోట్ల ప్రజల నుండి వసూలు చేసేందుకు అనుమతి కోరుతూ ఏపి ఈఆర్సీ ప్రభుత్వానికి లేఖ రాయగా ఈమొత్తం ప్రభు త్వమే భరిస్తుందని చంద్రబాబు ప్రకటించినట్లు తెలిపారు. చంద్రబాబు చేపడుతున్న విద్యుత్ సంస్కరణల ఫలితంగా ఏపిఈఆర్సీ ఏర్పాటు అయిన తరువాత తొలిసారిగా ట్రూడౌన్ చార్జీలు సమోదు కావటం గొప్పవిషయంగా పేర్కొన్నారు. ట్రూడౌన్ అమలు ద్వారా తమ ప్రభుత్వం యూనిట్‌కు 13పైసలు వొప్పున తగ్గించినట్లు తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని సియంగా ప్రమాణస్వీకారం రోజున ప్రగల్భాలు పలికిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా 9సార్లు విద్యుత్‌చార్జీలు పెంచి రూ.32వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపి వారి నడ్డివిరిచారని మండి పడ్డారు. 2019లో మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని జగన్ తన అస్తవ్యస్త పాలనా విధానాలతో విద్యుత్‌కోతలు విధించి ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసారని ఆరోపించారు. కమీషన్ల కోసం ఎక్కువ ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసారని విమర్శించారు.

# మత్తు రహిత రాష్ట్రం లక్ష్యం

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- ఇచ్ఛాపురంలో విజయవంతంగా అభ్యుదయం సైకిల్‌యాత్ర

శ్రీకాకుళం, జనవరి 4 (ప్రభాతవార్త): ఆంధ్రప్రదేశ్‌ను మత్తురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢసంకల్పంతో ఉన్నారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ రేంజ్ పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ 25 మంది పోలీసులు నాలుగు జిల్లాలు, 75 మండలాలు, 508 గ్రామాల్లో 51 రోజులపాటు 1,300 కి.మీ దూరం సాగిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పూర్త య్యింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను హోంమంత్రి వంగల పూడి అనితతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కలిగిన శక్తిగా మార్చేందుకు కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. శ్రీకాకుళం యువత కేవలం క్రమశిక్షణకే కాకుండా ఆధునిక సాంకేతికత, నైపుణ్యాల కలయికతో ప్రపంచస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఇచ్ఛాపురం ఆడబిడ్డగా ఇక్కడ ముగింపు వేడుకలు జరగడం సంతోషంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మంత్రి లోకేష్ తన పాదయాత్రలో గంజాయి బాధితుల కష్టాలు చూసి అనాడే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఐజీ గోపీనాథ్ జెట్టి మానసపుత్రికగా వచ్చిన ఈ యాత్ర ద్వారా గంజాయిని రాష్ట్రంలో జీరో స్థాయికి తీసుకు వచ్చాం. కేవలం శిక్షల ద్వారానే కాకుండా, అవగాహన ద్వారా యువతలో మార్పు తెస్తున్నామని ఆమె వివరించారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక పాలనలో యువత మత్తులో మునిగిపోయిందని, నేడు ప్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలు భయం వీడి 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిరోధం ఒక్క పోలీస్‌శాఖతోనే సాధ్యం కాదని ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరించిన డీజీపీ, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈగల్ ఐజీ ఎ.రవికృష్ణ మాట్లాడుతూ స్వయంగా తల్లిదండ్రులే తమ పిల్లలపై ఫిర్యాదు చేస్తున్నారని, దీని బట్టి మత్తు పదార్థాలు ఎంతగా వారిని బానిస చేస్తున్నాయో అర్థమవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్కూళ్ళు, కాలేజీల్లో విద్యార్థులు తమ సహచరుల ప్రవర్తనలో తీవ్ర మార్పు వస్తే మత్తు పదార్థాలకు బానిసయ్యారని అనుమానం ఉంటే ఈగల్‌కు తెలపాలని, టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించాలని, మీక పోలీసులు నుంచి ఎటువంటి సమస్యలు రావని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేపట్టి ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఈగల్ టీం ఐజీ రవికృష్ణ, శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలు, వేల మంది విద్యార్థులు, పోలీసులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొని 'డ్రగ్స్ వద్దు బ్రో' అని నినదించారు. మొదట ఇచ్ఛాపురంలో పోలీస్‌స్టేషన్ వద్ద కేంద్ర, రాష్ట్ర మంత్రులు 'డ్రగ్స్ వద్దు బ్రో' పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి సాంస్కృతిక ప్రదర్శనలతో రాజావారి మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మంత్రితో పాటు ప్రముఖులు సైకిల్ తొక్కగా, హోంమంత్రి ద్విచక్ర వాహనం నడుపుతూ వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల, నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష ఉన్నారు.





## బలిజపల్లి గ్రామస్థుల ఆప్యాయత మరువలేనిది

మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుష్మిత

రామచంద్రాపురం, జనవరి 4 (ప్రభాతవార్త): బలిజపల్లి గ్రామస్థుల ఆప్యాయత, అనురాగాలు మరువలేనివని మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, ప్రొడ్యూసర్ సుష్మిత అన్నారు. తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, బలిజపల్లి గ్రామంలో ఆదివారం "మన శంకర్ వరప్రసాద్ గారు" మెగా చిత్రం ఈ నెల 12న విడుదల నేపథ్యంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి, ప్రొడ్యూసర్ గారపాటి సాహుతో కలసి బలిజపల్లిలోని చిరంజీవి వీరాభిమానులు పొర్పుదండాల ఈశ్వర్ రాయల్, చంద్రశేఖర్ రాయల్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరో మెగాస్టార్ కుమార్తె సుష్మిత, స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తమ గ్రామానికి వస్తున్నారనే ఆనందోత్సాహాలతో గ్రామస్థులు బాణసంచాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భాజాసంత్రీ పేటళ్ళు నడుమ పూర్ణకుంభం తో ఘన స్వాగతం పలికారు. గ్రామమంతా హరిదాసు భజనలు, గంగిరెద్దుల ఆటలు, చెక్కల భజనలు, రంగు రంగుల రంగవళ్ళులతో ముందుగానే గ్రామంలోకి సంక్రాంతి శోభను తీసుకువచ్చారు. గ్రామ దేవతలు నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రామాలయానికి చేరుకున్న వీరికి అర్చకులు వేదమం త్రోచ్ఛారణలతో ఆశీస్సులందించారు. జల్లికట్టు సంబరాల కొరకు సిద్ధం చేసిన బసవన్నలను తిలకించి వార్తం వ్యక్తం చేస్తూ గ్రామస్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తపసి మురళి రెడ్డి, దండు లక్ష్మీపతి పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- పెరుమాళ్లపాడులో అన్నదాతలకు కొత్త పాసు పుస్తకాల పంపిణి

చేజర్ల (నెల్లూరు), జనవరి 4, (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరికొత్త రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీకి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చేజర్ల మండలం పెరుమాళ్లపాడు గ్రామంలో మీ భూమి-మీ హక్కు నినాదంతో నిర్వహించిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలు పట్టబద్ధత లేనివని, అవి ఇంట్లో ఉంటే అరిష్టమని వ్యాఖ్యానించిన మంత్రి, వాటిని తిరిగి ఇచ్చేయాలని రైతులను కోరారు. ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్, భద్రతా ప్రమాణాలతో ప్రస్తుతం అందిస్తున్న పాస్ పుస్తకాలు పూర్తిగా చట్టబద్ధమైనవని తెలిపారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే భూ యజమానికి సంబంధించిన పూర్తి వివరాలు తక్షణమే కనిపిస్తాయని, దీటిలో ఎలాంటి మార్పులైనా, డేటా సెంటర్ ద్వారా మాత్రమే చేయగలమని స్పష్టం చేశారు. ఏ చిన్న తప్పు జరిగినా వెంటనే సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఎన్నికలకు మూడు నెలల ముందు 35 లక్షల మంది రైతులకు పాస్ పుస్తకాలను మార్పించిందని, కోటి మంది రైతుల భూ హక్కులను గందరగోళానికి గురిచేసిందని విమర్శించారు. రీసర్వే పేరుతో హద్దురాళ్లపై కూడా గత సీఎం బొమ్మలు ముద్రించి రూ.650 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. నెల్లూరు జిల్లాలో 235 గ్రామాల్లో 1.05 లక్షల మందికి పైగా రైతులకు గత సీఎం బొమ్మతో కూడిన పాస్ పుస్తకాలు పంపిణీ చేయగా, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 13 గ్రామాల్లో 5,486 పాస్ పుస్తకాలు పంపిణీ చేశారని తెలిపారు. వీటి స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పాస్ పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు.



### విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు

విద్యుత్ ట్రూఅప్ చార్జీలను పూర్తిగా రద్దు చేశామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32,166 కోట్ల ట్రూఅప్ చార్జీలను వసూలు చేసిందని, ఇక నుంచి ప్రజలపై భారం వేయకుండా ప్రభుత్వం ఏడాదికి రూ.4,497 కోట్లను భరిస్తుందని తెలిపారు. దీని ఫలితంగా రీజియన్ పరిధిలో రూ.1,551.69 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలం అన్నారెడ్డి పాలెం, చేజర్ల మండలం పెరుమాళ్లపాడుకు నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేశామని తెలిపారు. పెరుమాళ్లపాడులోని పురాతన శివాలయం పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేసి, శుభ ముహూర్తంలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. 2026 డిసెంబర్ నాటికి రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి రైతులకు చట్టబద్ధ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు సుపరిపాలన అందిస్తూ రామరాజ్య స్థాపన దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో బి. పావని గ్రామ సర్పంచ్ తెలపన్నేని నర్సమ్మ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాళ్ళూరి గిరి నాయుడు, తెలపన్నేని జయంతులు నాయుడు, మాజీ ఎంపీపీలు అన్నలూరు శ్రీనివాసులు, రావి పెంచల రెడ్డి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, అల్లాల నారాయణ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బూదల వీర రాఘవరెడ్డి, రావి లక్ష్మీ నర్సారెడ్డి, బీర్ల వెంకటేశ్వర్లు, గోసునూరు రాంబాబు, ఉడతా పెద్ద హజరత్, అల్లాల సుబ్బారెడ్డి, గుత్త హజరత్ నాయుడు, శ్రీధర్ నాయుడు, ఆత్మకూరు డివిఆర్‌ఓ రమణయ్య ఎంఆర్‌ఓ అమర్, తహసీల్దార్ మస్తానయ్య, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



తిరుపతి, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని" నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకు రావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు.

# మంత్రి నారాయణ చొరవతో పేద విద్యార్థుల కోసం ఇంటర్నేషనల్ స్కూల్

- వక్ఫ్‌బోర్డు స్థలంలో 5ఎకరాల్లో భూమిపూజ చేసిన మంత్రి నారాయణ
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఉచిత విద్య అందించేలా ఏర్పాట్లు

నెల్లూరు, జనవరి 4 ప్రభాతవార్త- వైద్యం: నెల్లూరులో పేద విద్యార్థులకు కార్పొరేట్,అంతర్జాతీయ విద్య అందించడంపై మంత్రి నారాయణ ప్రత్యేకదృష్టి పెట్టారు.సొంత నియోజకవర్గమైన నెల్లూరు సిటీతోపాటు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నారు.లక్షల్లో కాదు..కోట్లు ఖర్చు పెట్టి స్కూళ్ళ అభివృద్ధి చేయడంతోపాటు ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు.తాజాగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రూరల్ నియోజకవర్గంలో ఉన్న పరమేశ్వర నగర్‌లో 20కోట్లతో అంతర్జాతీయ స్కూల్ ఏర్పాటుకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి,వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజీజ్‌తో కలిసి భూమి పూజ చేశారు మంత్రి నారాయణ.... వక్ఫ్‌బోర్డ్ స్థలంలో 5ఎకరాల్లో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించేందుకు ఈ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు.దీనికోసం అనకాపల్లి ఎంపి సీఎం రమేష్ రూ.20 కోట్లు సీఎస్ఆర్ నిధులు అందించారు. భూమి పూజా కార్యక్రమం మైనార్టీ పెద్దలు, పార్టీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో అట్టహాసంగా జరిగింది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి 1000మంది విద్యార్థులకు 1నుంచి 12వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభించేలా నిర్మాణం పూర్తిచేయాలని నిర్ణయించారు. ఇప్పటికే నెల్లూరు సిటీలో తాను చదువుకున్న వీఆర్ పాఠశాలను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్ది మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా గత విద్యాసంవత్సరం ప్రారంభించారు. భూమి పూజ తర్వాత జరిగిన బహిరంగసభలో మంత్రి నారాయణ మాట్లాడారు. ఈ స్కూల్‌కు అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్‌గా నామకరణం చేశారు. నెల్లూరు సిటీలో సుమారుగా 94వేల ఇళ్లు ఉండగా గత ఎన్నికల సమయంలో 84వేల ఇళ్లకు డోర్ టు డోర్ కాంపెయిన్‌కు వెళ్లానన్నారు. అప్పుడే పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. తాను కటిక పేదరికం నుండి వచ్చానని పేదరికం విలువ తెలుసని అన్నారు. తన గురువు నారాయణమూర్తి ద్వారా ఫౌండేషన్ ఏర్పడిందన్నారు. నగరంలోని 15 పాఠశాలలు అభివృద్ధి చేసే విధంగా పలువురు దాతలు సహకారం తీసుకోవడం జరిగిందన్నారు. అందులో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావు, డిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్, సీఎం రమేష్, రెడ్డి ల్యాబ్స్, టివిఎస్ కంపెనీ నుండి సహకారం తీసుకోవడం జరిగిందన్నారు. నెల్లూరు నగరంలో సుమారు 200కోట్ల రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. తాను చదివిన వీఆర్ పాఠశాల అభివృద్ధికి తన కూతురు షరణీ, ఎన్‌సిసి గ్రూపులు సహాయ సహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, నగర మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ హసీనా, మాజీ శాసనమండలి చైర్మన్ షరీఫ్, పలువురు నేతలు, తదితరులు పాల్గొన్నారు.



# విజయవాడలో సైబర్ క్రైమ్ ముఠా అరెస్ట్

విజయవాడ, జనవరి 4 (ప్రభాతవార్త ప్రతినిధి): నిరుద్యోగులు, అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి ఆ వివరాలను చట్ట విరుద్ధ లావాదేవీల కోసం వాటిని ఫిలిప్పీన్స్‌కు పంపిస్తున్న విజయవాడకు చెందిన ముఠాను సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. కరెంటు ఖాతా తెరిస్తే డబ్బులు ఇస్తామని ఆశ చూపిస్తున్నారు. ఆ తర్వాత బ్యాంకు ఎకౌంట్లు సేకరిస్తున్నారు. ఈ ముఠాలోని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన అనుమానితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. విజయవాడకు చెందిన పేరుపోగు దేవదాసు ఉద్యోగం చేసి, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. గతేడాది ఆతని ఇంటి పక్కన ఉండే కృష్ణారెడ్డి (ఏ3) దేవదాసును కలిసి బ్యాంకులో కరెంటు ఖాతాను తెరిచి, ఆన్‌లైన్‌లో షేర్ చేస్తే డబ్బులిస్తారని ఆశ చూపించాడు. రూ.10,000 వస్తాయన్న ఆశతో కృష్ణారెడ్డితో కలిసి భవానీపురంలోని సిటీ యూనియన్ బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ కరెంటు ఖాతా తెరిచి, కిట్‌ను కృష్ణారెడ్డికి ఇచ్చాడు. తర్వాత బాధితుడి ఫోన్‌పే ఖాతాలకు రూ.7,000 జమ చేశారు. జీవిలా దేవదాసు తన ఖాతాను పరిశీలించగా రూ.2 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించాడు. భయపడి వెంటనే విజయవాడలోని సైబర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో సూర్య, కృష్ణారెడ్డి, అతని భార్య సౌభాగ్యలక్ష్మి కలను పోలీసులు అరెస్టు చేశారు. కీలక నిందితులు పార్వతి ఇంకా అరెస్టు కావాల్సి ఉంది. ఈ ముఠా మొత్తం 199 ఖాతాలు తెరిపించగా వాటిలో 36 ఖాతాల నుంచి 56 మోసాలకు సంబంధించి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

**ఫిలిప్పీన్స్‌కు ఖాతాలు:** కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా కీలక విషయాలు వెలుగు చూశాయి. ఆతని భార్య సౌభాగ్యలక్ష్మి (ఏ4) కూడా అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపించేదని తేలింది. వీరిపై విజయవాడ నగరానికి చెందిన సూర్య శ్రీనివాస మణికంఠ అలియాస్ సూర్య (ఏ1) పర్యవేక్షించాడు. ఈ దంపతులు సేకరించిన ఖాతాలను మణికంఠకు అందించేవారు. అతను వాటిని చట్టవిరుద్ధ లావాదేవీల కోసం పార్వతి (ఏ2)కి ఇచ్చేవాడు. ఆమె తిరిగి వీటిని ఫిలిప్పీన్స్‌లో ఉన్న మరో మహిళకు అందించేది. అక్కడి నుంచి ఈ ఖాతాలను బెట్టింగ్‌లు, సైబర్ నేరాల్లో నగదు బదిలీలకు ఉపయోగించేవారు. ప్రతి ఖాతాకు వీరికి రూ.30,000 కమీషన్ అందేది. ఈ డబ్బును అన్ని దశల్లో పంచుకునే వారని దర్యాప్తులో తేలింది. ఈ ముఠా మొత్తం 199 ఖాతాలు తెరిపించగా, వాటిలో 36 ఖాతాల ద్వారా 56 లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇవి ఏపీతో పాటు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో జరిగిన మోసాలకు ఈ ఖాతాలను ఉపయోగించారు.

**కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్:** ప్రధాన నిందితుడు సూర్యను 2023లోనూ అదే ఖాతాల కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా పోలీసులు అరెస్టు చేశారు. 9 నెలలు జైలులో గడిపాడు. బయటకు వచ్చాక టెలిగ్రామ్ ద్వారా అదే ఖాతాలు సేకరిస్తూ దందా కొనసాగిస్తున్నట్లు తేలింది. పోలీసులు సూర్యతో పాటు కృష్ణారెడ్డి, అతని భార్య సౌభాగ్యలక్ష్మిని అరెస్టు చేశారు. వీరి నుంచి 2 కార్లు, 3 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సూర్య తన కారుపై రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేరుతో ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకున్నారు. దీని పైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. కీలక నిందితురాలు పార్వతి సహా పలువురి అరెస్టుకు ప్రయత్నిస్తున్నారు.



## గోవా, త్రిపుర గవర్నర్‌లకు స్వాగతం

గన్నవరం, జనవరి 4 (ప్రభాతవార్త): గన్నవరం విమానాశ్రయంలో గోవా, త్రిపుర గవర్నర్‌లకు పలువురు అధికారులు స్వాగతం పలికారు. గుంటూరులో జరుగు తున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి చేరుకున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజులకు ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో గుడివాడ ఆర్డీఓ జి.బాలసు బ్రమణ్యం పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు గవర్నర్లు రోడ్డుమార్గాన గుంటూరు బయలుదేరి వెళ్లారు.

# సామాజిక పరిస్థితులతో అలుపెరగని పోరాటం




మహిళల రక్షణ ఆమె ఆకాంక్ష. అందుకు అసాంఘిక శక్తులతో, సామాజిక పరిస్థితులతో అలుపెరగని పోరాటం చేస్తున్నారు సునీతా కృష్ణన్. వ్యభిచార వృత్తిలో కూరుకుపోయిన ఆడపిల్లల్ని కాపాడేందుకు హైదరాబాద్‌లో ప్రజ్వల ఫౌండేషన్‌ను స్థాపించి చాలామందిని ఈ మురికికూపం నుంచి బయట పడేశారు. ఇటీవల షార్జా ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్ 2025 ఉత్తమ అంతర్జాతీయ పుస్తకం (నాన్ ఫిక్షన్) పురస్కారాన్ని అందుకున్నారు.

బెంగళూరులో పుట్టినప్పటికీ తండ్రి ఉద్యోగరీత్యా సునీత బాల్యమంతా దేశంలో పలు ప్రాంతా. గడిచింది. చిన్నప్పటి నుంచి సమాజసేవే శ్వాసగా పెరిగారు. ఎనిమిదేళ్ల వయసులోనే మానస్ దివ్యాంగులైన విద్యార్థులకు నాట్యం నేర్పిస్తూ సమాజసేవ వైపు ఆకర్షితురాలయ్యారు. ఆపై మురికివాడల్లో పాఠశాలలు లేవు. పదిహేనేళ్లప్పుడు దళితుల పక్షాన ఉద్యమంలో పాల్గొన్నారని ఆమెపై కొందరు దుండగులు సామూహిక అత్యాచారం చేశారు. ఆ సంఘటనే సునీతను మహిళల రక్షణ కోసం ధైర్యంగా నిలబడేలా చేసింది. మాస్టర్స్ తరవాత సేవా రంగ డాక్టరేట్ తీసుకున్నారు. ఫీల్డు భాగంగా వేశ్యల జీవితాలను అధ్యయనం చేసేవారివె 1996లో పూర్తి సామాజిక కార్యకర్తగా మారారు. స్త్రీ శరీరాన్ని మార్కెట్ వస్తువుగా పెంచే ధోరణిని నిరసిస్తూ బెంగళూరులో జరిగిన మిస్ వరల్డ్ పోటీలను వ్యతిరేకించారు. ఆ సమయంలో రెండునెలలు జైలుశిక్ష కూడా అనుభవించారు. ఇప్పటికి పదిహేడుసార్లు



కత్తులూ చెయిన్లూ, రాళ్లతో దాడులు జరిగాయి. ఒక ఘటనలో దెబ్బ తగిలి వినికిడి శక్తి తగ్గింది. మహిళ రక్షణ కోసమే ప్రజ్వల ఫౌండేషన్‌ను ప్రారంభించాం. స్త్రీలఅక్రమ రవాణా పూర్తిగా అంత రాంచా లంటే సమాజంలో మార్పు రావాలి. 'నా బంగారు తల్లి' సినిమాతో కొందరి గా ఆలోచింప చెయిగలి గాను. ఆడవాళ్ల మీద జరిగే దాడులు, మోసాల ను అరికట్టా లంటే ముందు మగవాళ్లలో మార్పు తీసుకురావాలి అంటారు సునీత. తను రచించిన ఐయామ్ వాట్ ఐయామ్ పుస్తకానికి షార్జా ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్ 2025 నవంబరులో "ఉత్తమ అంతర్జాతీయ పుస్తకం(నాన్ ఫిక్షన్) పుర స్కారం అందుకు న్నారు ఆడపిల్లలు అక్రమ రవాణా, బాధితులకి పునరావాసం, సోషల్ మీడియా తెస్తోన్న చిక్కులూ... ఇలా ఎన్నో అంశాల గురించి ఈ పుస్తకంలో చర్చించారు. □

## అమ్మ మాట ఆనందాల బాట !

చిట్టితల్లి ఏం చేస్తోంది... ఆమ్ తింటావా? లాల పోసుకుంటావా? బంగారుకొండ ఎంత ముద్దుగా ఉన్నావో... నెలల బిడ్డతో అమ్మనే ఇలా మాట్లాడుతుంది. బిడ్డకు ఇవన్నీ అర్థం అవుతాయో లేదో తెలియదు కానీ అమ్మ మాత్రం తన ప్రేమనంతా మాటల్లోకి తెచ్చేస్తుంది. వాళ్ళుచేసే చిన్న చిన్న పనులకూ సంబరపడిపోతుంటుంది. మరి ఇంత స్వచ్ఛమైన ప్రేమ... వట్టిగా పోతుందా? ఇదే బిడ్డలో ఆనంద హార్మోన్ల శాతాన్ని పెంచుతుందట. తొలిఏడాదిలో తల్లి బిడ్డతో మాట్లాడే ఈ మాటలు, "వాళ్లను అనుకరిస్తూ చేసే సరదా పనులు.... పసిపిల్లల్లో ఆక్సిటోసిన్ హార్మోన్ల ఉత్పత్తిని పెంచడం యూనివర్సిటీ కాలేజ్ లండన్ పరిశోధనలో వెల్లడైంది. ఇదే భవిష్యత్తులో వారు దృఢమైన సామాజిక బంధాలను ఏర్పరచు కోవడంలోనూ, ఎమోషనల్ డెవలప్ మెంట్‌లో కూడా కీలకపాత్ర పోషించడం. మధ్యలో, తల్లికీ, , నమ్మకం పెంపొంద డానికి



ఈ చర్యలు సాయపడ తాయట. ఈ రిసెర్చ్ కోసం 39నెలల వయసుగల బిడ్డలున్న 62మంది అమ్మలను ఎంపిక చేశారు. బిడ్డలతో " వాళ్ల సహజంగా ఎలా మాట్లాడతారో, అలానే మాట్లాడతారో. సంబంధిత వీడియో రికార్డు. చేశారు. బిడ్డల ఆలోచనలు, భావోద్వేగాలు, ఇష్టాలను తల్లులు తమతో ఎంత బాగా వ్యక్తపరుస్తున్నారో చెప్పారు. పిల్లల్లో ఆక్సిటోసిన్ హార్మోను ఎక్కువగా పేర్కొన్నారు గడపడానికి, మాట్లాడడానికి ప్రయత్నిం చాలి అయితే, ప్రసవం తర్వాత కుంగుబాటుతో బాధపడే తల్లులు తమ పిల్లలతో సంతోషంగా గడపలేకపోతున్నారట. □

## తిరుప్పావై

### 21వ పాశురము



.ఏత్తకలంగళ్ ఎదిర్ పొంగి
మీదళిప్ప
మాత్తాదేపాల్ శోరియం వళ్ళల్
పెరుం బశుక్కళ్
అత్తప్పడైత్తాన్ మగనే
అఱివురాయ్
ఊత్తముడై యాయ్
పెరియాయ్. ఉలగినిల్
తోత్తమాయ్ నిష్ణ శుడరే
తుయిలెకాయ్
మాత్తారునక్కు వలితులైన్దున్
వాశఱ్కణ్
ఆత్తాతు వన్దున్న డిపణియు
మాప్పోలే
పోత్తియాం వన్దోం పుగళ్న్దేలో
రెమ్బావాయ్

నందగోపాలుని వద్ద మంచిస్వభావము గల పెద్ద అవి ఎన్నో కలవు. అవి పుష్కలంగా పాలిస్తాయి. అటు వంటి నందగోపాలుని కుమారుడా మేలుకో !"అప్రమేయా, తేజస్వరూపా, నీ శత్రువులు బల ముడిగి నీ వాకిట నీ పాదములను స్తుతిస్తున్నారు. మేము కూడా నీకు మంగళం పాడుటకు వచ్చియున్నాము. మేలుకో!" అని వెలుపలి గోపికలు కృష్ణుణ్ణి కోరుతున్నారు. ఫలం: "వేదార్థజ్ఞానం"

మేకప్ సరిగా వేసుకోకపోతే ముఖంపై గీతలు కనిపిస్తాయి. మేకప్ త్వరగానూ పోతుంది. అలాకాకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించమంటున్నారు నిపుణులు.

## తడి స్పాంజితో తాజాగా !

★ ముందు నిర్జీవంగా మారిన చర్మానికి తగిన తేమ అందించి మేకప్‌కి అనువుగా మార్చుకోవాలి. ఇందుకోసం పావుకప్పు పెసరపిండిలో కాసిని పాలు పోసి ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకోవాలి. పావుగంట య్యాక చల్లటి నీళ్లతో ముఖం కడిగి మాయిశ్చ రైజర్ రాస్తే సరి. మృత కణాలు తొలగి చర్మం తాజాగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. మేకప్ వేస్తే నిండుగా ఉంటుంది.



★ ముఖంపై ప్యాచులూ, గీతలూ, మచ్చలూ కనిపించకూడదంటే పౌడర్ ఆధారిత కీన్సలర్లు, మ్యాటిఫైయింగ్ సౌందర్య ఉత్పత్తులకు దూరంగా ఉండండి. బదులుగా ద్రవరూపంలో ఉన్న వాటిని మాత్రమే వాడండి. కన్సీలర్, ప్రైమర్‌లని వాడేందుకు తడి స్పాంజిని వినియోగించడం వల్ల సరిగ్గా పరచుకుంటాయి. ★ నీటి ఆధారిత మస్కారా, కాజల్ వంటివి వాడటం వల్ల అవి ఎక్కువ సేపు పాడవకుండా ఉంటాయి. ఐషాడో కోసం వీడియం కలర్స్‌నే వాడండి. అవి మీకు కొత్త లుక్‌ని తెచ్చిపెడతాయి. ★. ఈ కాలంలో పెదాలు పొడిబారి పగులుతుంటాయి. ఆ ఇబ్బంది లేకుండా తరచూ లిప్‌బామ్ రాసుకోవాలి. పంచదార, తేనె కలిపి రుద్దితే మృతచర్మం పోతుంది. ఆపై వేసేలిప్‌స్టిక్. మీ అందాన్ని రెట్టింపు చేస్తుంది. □

## చిలగడ గులాబ్‌జామ్



కావలసినవి. చిలగడదుంపలు రెండు, మైదాపిండి రెండు టేబుల్ స్పూన్లు, పంచదార కప్పు, బేకింగ్ సోడా, యాలకుల పొడి చిటికెడు చొప్పున, నెయ్యి అరటీస్పూన్, నూనె వేయించడానికి సరిపడా .

**తయారీ:** పిల్లలతోపాటు పెద్దలూ ఎంతో ఇష్టంగా గులాబీలను తింటారు. ఎప్పుడూ చేసే పద్ధతిలో కాకుండా ఇలాచేస్తే రుచితోపాటు ఆరోగ్యానికీ మంచిది. ఒకటి తిన్న తర్వాత మరోటి కావాలంటారు. ఇంతకీ వీటినెలా చేయాలంటే.. చిలగడదుంపలను మరీ మెత్తగా కాకండా ఆవిరి మీద ఉడికించుకోవాలి. (చాలామంది వీటిని నీళ్లతోనే ఉడికి. అలాచేస్తే దీంట్లో ఉంటే పోషకాలన్నీ నీళ్లతోపాటు బయటకు వెళ్లిపోతాయి), ఉడిన తర్వాత తొక్క తీసి.. మెత్తగా మెదుపుకుని మైదాపిండి వేసి ముద్దలా కలపాలి. పిండి పల్చగా ఉంటే మరికాస్త వేయొచ్చు. తర్వాత నెయ్యి వేసి కలపాలి. పిండిలో నుంచి చిన్న ముద్దను తీసుకుని గుండ్రంగా లేదా గుడ్డు ఆకారంలో గులాబీలు చేయాలి. కడాయిలో నూనె పోసి వేడిచేసి సిద్ధంగా ఉన్న ఉండలు వేసి తక్కువ మంట మీద వేయిం చాలి. ఒకేసారి ఐదారు ఉండలకు మించి వేయకుండా.. గోధుమరంగులోకి వచ్చేంత వరకూ వేయించాలి. ఇతే ఇలా అన్నీ అయిన తర్వాత తీసి పక్కన పెట్టుకోవాలి. గిన్నెలో పంచదార, కప్పు నీళ్లు పోసుకుని మరిగించాలి. దీంట్లో యాలకుల పొడి వేసి., లేత పాకం వచ్చేంత వరకూ మరగనివ్వాలి. ఇప్పుడు స్టాఫ్ చేసి.. సిద్ధంగా ఉన్న గులాబ్‌జామ్ లను ఈ పాకంలో వేసి గంట నుంచి రెండు గంటలపాటు బాగా నాననివ్వాలి. అంతే నోట్లో వేస్తేనే కరిగిపోయేలా ఉంటే గులాబీలు. □

## చిట్టి చిట్కా

ఫంక్షన్లు, పండగలప్పుడు కాస్త ఎక్కువగా తిన్నాం... లేదంటే అరగట్లేదు అనిపిస్తుంటుంది కదా!

చాలామంది అరగడానికి టానిక్లు, ట్యాబ్లెట్ల మీద ఆధారపడతారు. ఈసారి ఈ చిట్కా ప్రయత్నించండి. పావు స్పూను చొప్పున ధనియాలు, జీలకర్ర, వాము తీసుకోండి. వీట నాయిక రోట్లో వేసి, చిటికెడు ఉప్పునీ చేర్చి... కచ్చాపచ్చాగా దంచుకోండి. ఇప్పుడు ఒకగిన్నెలో గ్లాసు నీళ్లు పోసి వేడిచేయండి. ఆపై ఈ మిశ్రమాన్ని వేసి, నీళ్లు సగం అయ్యేదాకా మరిగించండి. స్టవ్ కట్టేసి, గోరువెచ్చగా అయ్యాక చిటికెడు వంటసోడ, స్పూను నిమ్మరసం చేర్చి తాగితే సరి. జీర్ణప్రక్రియ మెరుగవ్వడమే కాదు. □

## రంగవల్లి



15 చుక్కలు,
9వరుసలు,
సంధు చుక్కలు

గరిమెళ్ల పద్మావతి
విశాఖపట్నం






### ముగ్గులకు ఆహ్వానం

మా చిరునామా: ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

## 'హైందవ' బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

'కిష్కింధపురి'తో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న యాక్షన్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రస్తుతం అకల్ట్ థ్రిల్లర్ 'హైందవ'లో నటిస్తున్నారు. నూతన దర్శకుడు లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో, మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ చందు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. గత నెలలో మారేడుమిల్లిలో జరిగిన ఒక కీలకమైన షూటింగ్ షెడ్యూల్ తర్వాత, చిత్ర బృందం ఇప్పుడు తమ నాల్గవ మెయిన్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, చిత్ర నిర్మాతలు ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా నిర్మాణంలో 70 పూర్తయిందని నిర్మాతలు తెలియజేశారు. ఇప్పటివరకు జరిగిన షూటింగ్‌లో ఎక్కువ భాగం కథలోని మిస్టరీని, డ్రామాటిక్ టెన్షన్‌ను బలంగా నిలబెట్టే కీలక సన్నివేశాలకు కేటాయించారు. ఈ సినిమా కథ శతాబ్దాల నాటి దశావతార ఆలయం చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరసన సంయుక్త కథానాయికగా నటిస్తోంది. మహేష్ మంజ్రేకర్, సౌరభ్ సచ్‌దేవా, జెడి చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను వంటి నటీనటులు. ఈ సినిమాలో ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



## యాలో ఈ గుబులే ఎలో పాట రిలీజ్

అర్జున్ రెడ్డి, యానిమల్ పాన్ ఇండియా హిట్స్‌తో పాటు నేషనల్ అవార్డ్ అందుకున్న హర్షవర్ధన్ రామేశ్వర్ ఇప్పుడు మైథలాజికల్ జానర్‌లో రూపొందుతున్న "త్రికాల" సినిమా మ్యూజిక్ అందిస్తున్నారు. శ్రద్ధా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్ ప్రధాన పాత్రల్లో మణి తెల్లగూటి దర్శకత్వంలో రాధిక శ్రీనివాస్ నిర్మిస్తున్న చిత్రం నుంచి తాజాగా యాలో ఈ గుబులే ఎలో పాటని రిలీజ్ చేశారు. ఈ పాటలో హర్షవర్ధన్ రామేశ్వర్ స్టైల్‌తో పాటు మెలడీకి ఉన్న డెప్త్ అద్భుతంగా బ్యాలెన్స్ చేశాడు. ఆయన మ్యూజిక్ ట్రీట్ ఈ పాటకి ప్రధాన బలం. ప్రతి బీట్‌లోనూ ఆయన ట్రేడ్‌మార్క్ ఇంటెన్సిటీ స్పష్టంగా వినిపిస్తూ, పాటకి ఒక ప్రత్యేక ఐడెంటిటీ ఇచ్చింది. రిత్విక్ వేట్లా సమర్పణలో రాధిక, శ్రీనివాస్ నిర్మాతలుగా శ్రీసాయిదీప్ చాట్లా, వెంకట్ రమేష్ దాడి సహ నిర్మాతలుగా 'త్రికాల' సినిమాను మణి తెల్లగూటి తెరకెక్కిస్తున్నారు. శ్రద్ధా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, సాహితి అవంచ, ఆమని, ప్రభాకర్, అంబటి అర్జున్, రౌడీ రోహిణి వంటి వారు ముఖ్యపాత్రల్ని పోషించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్‌తోనే సినిమాపై మరింత హైప్ క్రియేట్ అయింది. ఒక్క ట్రైలర్‌తోనే ఏకంగా నార్త్ ఇండియాలోనూ 'త్రికాల' బిజినెస్ జరిగిపోయింది. ప్రస్తుతం అన్ని చోట్లా "త్రికాల" మీద మంచి డిమాండ్ ఏర్పడింది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకులు



## 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' ఎంటర్‌టైనింగ్ సినిమా



ఈవెంట్ లో హీరో త్రిగుణ్

తిగుణ్, పాయల్ రాధాకృష్ణ, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో చేస్తున్న హైలీ ఎంటర్టైనర్ 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించారు. సి.హెచ్.వి.ఎస్.ఎన్ బాబ్జీ సమర్పణలో లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై అరవింద్ మండెం నిర్మించారు. అరుణ్ చిలువేరు, ప్రకాష్ చెరుకూరి సంగీతం సమకూర్చారు. ఈ సినిమా టీజర్ గ్రాండ్ గా లాంచ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో త్రిగుణ్ మాట్లాడుతూ, ఈ వేడుకకి విచ్చేసిన అతిధులు అందరికీ నమస్కారం. గత కొన్ని రోజులుగా చిన్న సినిమాలన్నీ అద్భుతంగా ఆడుతున్నాయి. అందరికి ఒక హోప్ వచ్చింది. సినిమాలు చూడడం థియేటర్‌కి రావడం చాలా ఆనందంగా ఉంది. బాబ్జికి థాంక్యూ తక్కువ టికెట్ ధరల్లో పెడితే ఆడియన్స్ అందరూ వచ్చి చూస్తారని భావిస్తున్నాను. మోడరన్ లైఫ్, పాత పద్ధతిలో ఉన్న వ్యవసాయాన్ని ఎలా కలపొచ్చు అనేది ఈ సినిమాల్లో చాలా ఇంట్రెస్టింగ్ గా చూపించారు. మనమందరం కూడా వ్యవసాయం నుంచే వచ్చాము. వ్యవసాయం గురించి ఇంపార్టెంట్ విషయాలు మాట్లాడుతూనే సినిమా చాలా ఎంటర్టైనింగ్ గా ఉంటుంది. ఈ సినిమాకి పని చేసిన అందరికీ ధన్యవాదాల తప్పకుండా ఈ సినిమాని మీరందరూ సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. డైరెక్టర్ మధుదీప్ మాట్లాడుతూ, నేను ఈ ఇండస్ట్రీలో ఉండ దానికి కారణం చంటి. ఆయన లేకపోతే ఈ జర్నీ ఇంత స్మూత్‌గా జరిగేది కాదు. పాయల్ మాట్లాడుతూ, ఇది నేను ఫస్ట్‌సైన్ చేసిన ఫిలిం. ఈ ప్రాజెక్ట్ నాకు చాలా స్పెషల్. కథ చెప్పినప్పుడు నేను చాలా పర్సనల్గా కనెక్ట్ అయ్యాను. ప్రొడ్యూసర్ అరవింద్ మాట్లాడుతూ, ఈ వేడుకకు విచ్చేసిన పెద్దలకు మీడియా మిత్రులకు అందరికీ ధన్యవాదాలు. ఇది ఒక ఇంపార్టెంట్ కంటెంట్ ఉంటూనే హైలీ ఎంటర్టైంగా ఉండే సినిమా అని అన్నారు.

## 'టైసన్ నాయుడు' నుంచి బర్త్ డే ప్యాక్డ్ పోస్టర్ రిలీజ్



యాక్షన్ హాల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తుపాకీని పట్టుకొని, శత్రువుల వైపు గురిపెట్టి నిల్చున్న ఈ పోస్టర్ అదిరిపోయింది. అతని ఇంటెన్సిటీ, మజిల్డ్ ఫిజిక్, నెక్స్ట్ లెవల్ యాక్షన్‌ని ప్రజెంట్ చేస్తున్నాయి. ఈ పోస్టర్‌కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌ను మునుపెన్నడూ చూడని యాక్షన్ ప్యాక్ క్యారెక్టర్‌లో ప్రెజెంట్ చేస్తున్నారు.

## తెర

## 'జెట్లీ' గ్లింప్స్ ఈవెంట్‌లో డైరెక్టర్ రితేష్ రానా



మైత్రీ మూవీ మేకర్స్ ప్రజెంట్స్, సత్య, రితేష్ రానా, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ 'జెట్లీ' హ్యూమర్ ఫిల్డ్ యాక్షన్ గ్లింప్స్ రిలీజ్ టాలీవుడ్ ఫేవరెట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మించిన ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. సత్య వాయిస్‌లో వేమన శతకంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అకస్మాత్తుగా అల్లకల్లోలం ప్రయాణికులను భయాందోళనకు గురి కావడం, తుపాకీ కాల్పులు, హైజాక్ గురించి సూచిస్తూ, సత్య పరిచయం కావడం ఆకట్టుకుంది. సత్య- వెన్నెల కిషోర్ మధ్య వచ్చే డైలాగ్స్ గ్లింప్స్‌కు మరింత చార్మ్‌ని యాడ్ చేశాయి. నివ్వు ఏ టైర్ హీరో అని అడిగినప్పుడు, "జనరల్ కంపార్ట్‌మెంట్" అంటూ సత్య ఆన్సర్ ఇవ్వడం ప్రేక్షకులకు వెంటనే కనెక్ట్ అయ్యింది. మత్తు వదలరా వెనుక ఉన్న మెయిన్ టీం ఈ సినిమా క్రియేటివ్ ఇంజిన్‌గా పని చేస్తున్నారు. మ్యూజిక్ కాల భైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్‌తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు. గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో సత్య మాట్లాడుతూ, రితేష్, చెర్రీతో మళ్ళీ కలిసి వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాత చెర్రీ మాట్లాడుతూ, నవంబర్ 17న ఈ సినిమా మొదలుపెట్టాం. ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తయింది. బ్యాలెన్స్ జనవరి ఫెబ్రవరి నాటికి పూర్తయిపోతుంది. సమ్మర్ లో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం అని అన్నారు.

## 'జాకీ' తమిళ్ సినిమా టీజర్ విడుదల



శిరీ7 స్టూడియోస్ నిర్మిస్తున్న కొత్త తమిళ సినిమా 'జాకీ' (టీజర్ విడుదలైంది. ఈ సినిమా మధురై గ్రామీణ నేపథ్యంలో రూపొందింది. చెన్నైలో జరిగిన వీధి తిరువిళా - 13వ ఎడిషన్ కార్యక్రమంలో టీజర్‌ను విడుదల చేశారు. 2021లో వచ్చిన 'మడి' సినిమా తర్వాత, శిరీ7 స్టూడియోస్ మరోసారి దర్శకుడు డా. ప్రగభల్ కలిసి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. ప్రేమ కృష్ణదాస్ సి.దేవదాస్ జయదేవదాస్ ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో యువన్ కృష్ణ, రిదాన్ కృష్ణాస్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రల్లో నటించారు. శక్తి బాలాజీ ఈ సినిమాకి సంగీతం అందించారు. నటీనటులు నిజమైన పొట్టేలుతో శిక్షణ తీసుకొని నటించారు. 'జాకీ' సినిమా ద్వారా గ్రామీణ జీవితం, ప్రజల భావోద్వేగాలు, సంప్రదాయ క్రీడను సహజంగా ప్రేక్షకులకు చూపించనున్నారు. టీజర్ విడుదలతో ఈ సినిమా ప్రయాణం మొదలైంది. మరిన్ని విషయాలు త్వరలోనే వెల్లడిస్తామని చిత్ర యూనిట్ తెలిపారు.

# పైపర్స్ వీరోచిత ప్రదర్శన

## సూర్మా క్లబ్ 3-1తో చిత్తు



**న్యూఢిల్లీ:** ఉమెన్స్ హాకీ ఇండియా లీగ్, 2025-26లో ఎస్‌జి పైపర్స్ అటాకింగ్ ఫ్లెయిర్, మిడ్‌ఫీల్డ్ కెమిస్ట్రీ, గోల్ కీపింగ్ వీరోచిత ప్రదర్శనల తో అద్భుత విజయం అందించింది. సూర్మా హాకీ క్లబ్‌ను 3-1 తేడాతో చిత్తు చేసింది. అర్జెంటీనా రైజింగ్ స్టార్ జువానా కాస్టెల్లారో అద్భుతమైన పాస్‌తో స్పష్టమైన అవకాశాన్ని పైపర్స్ సృష్టించింది. సూర్మా పెనాల్టీ కార్నర్‌ను పొందగా, పెన్నీ స్క్విబ్ 12వ నిమిషంలో గోల్ చేసి స్కోరును 1-0కి చేర్చింది. కానీ పైపర్స్ తక్షణమే వరుసగా పెనాల్టీ కార్నర్‌లను అడ్డుకున్నా స్పెయిన్‌కు చెందిన ప్రపంచ స్థాయి పిసి స్పెషలిస్ట్ లోలా రియారా (13) ముందుకు వచ్చి గోల్ చేసి గోల్‌ను సమమైంది. మిడ్‌ఫీల్డర్ ఇషిక అద్భుతమైన పరుగుతో బంతిని కెప్టెన్ నవనీత్ కౌర్‌కు స్లిప్ చేయంతో మొదటి క్వార్టర్ 1-1తో ముగిసింది. రెండో క్వార్టర్‌లో పైపర్స్ వరుస దాడులతో సూర్మా క్లబ్‌ను వెనక్కి నెట్టడంతో పెనాల్టీ కార్నర్ లభించింది, అయితే అది గోల్‌గా మారలేదు, కెప్టెన్ నవనీత్ కౌర్ బంతిని సర్కిల్‌లోకి పంపించగా, జ్యోతి సింగ్ (18) నిర్ణయాత్మకంగా ముగించి పైపర్స్‌ను ఆధిక్యంలోకి తెచ్చింది. 27వ నిమిషంలో గోల్ కీపర్ క్రిస్టినా కోసెంటేనో అండగా నిలిచి పెనాల్టీకార్నర్ వేరియేషన్‌ను అద్భుతమైన సేవ్ చేయడంతో పైపర్స్ 2-1 ఆధిక్యాన్ని కాపాడుకునేలా చేసింది. పైపర్స్ దృఢమైన రక్షణతో సూర్మాను ఉక్కిరిబిక్కిరి చేసి గోల్ కీపర్ కోసెంటినో పైపర్స్‌ను ముందుకు తీసుకెళ్లే భాగంలో ఆధిక్యాన్ని 3-1కి పెంచింది. దీంతో పైపర్స్ నాలుగు మ్యాచ్‌లలో మూడు విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

## యూత్ కాంటెండర్‌లో

# ఫైనల్స్‌కు వివాన్, నైషా



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ యూత్ కాంటెండర్ 2026లో వివాన్ దేవ్-నైషా రేవాస్కర్ జోడీ అండర్ 15 మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌కు చేరుకున్నారు. టాప్ సీడ్ ఆదిత్య దాస్-అంకోలికా చక్రవర్తిని ఓడించడంతో ఫైనల్‌కు చేరుకోవడంతో పాటు, ఈ మ్యాచ్‌లో అదనపు పాయింట్లు వచ్చాయి. వివాన్-నైషా 13-11, 5-11, 11-7, 5-11, 23-21 స్కోరుతో టాప్ సీడ్‌లను తృటిలో ఓడించారు. వారు తోటి ఆటగాళ్ళు రేయాన్ష్ జలన్-తనిష్క కల్భైరవ్ ద్వయంపై ఫైనల్‌కు చేరుకున్నారు. వివాన్ మరియు నైషా ప్రారంభం నుండే తమ పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు. 58 తేడాతో వెనుకబడి, గేమ్ పాయింట్‌ను కాపాడుకున్నారు మరియు తరువాత మొదటి గేమ్‌ను గెలుచుకున్నారు. ఈ జంట మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకోవడమే కాకుండా, ప్రత్యర్థులు మ్యాచ్ పాయింట్ ఎదుర్కొన్న ప్రతిసారీ స్కోరును సమం చేయకుండా అడ్డుకున్నారు. చివరికి వరుసగా 4 పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌ను ముగించారు. అంతకు ముందు సెమీఫైనల్ మ్యాచ్‌లో సంజయ్ జగదీష్-మైరా సంగెల్కర్‌పై 11-3, 15-13, 11-7 స్కోరుతో గెలిచారు. అలాగే టాప్ సీడ్లు అభినంద్ ప్రధివాధి-అనన్య మురళీధరన్ సార్థక్ ఆర్య-సింద్రెలా దాస్ లతో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో స్థానం సంపాదించడం ద్వారా తమ అత్యుత్తమ ప్రదర్శనను ప్రదర్శించారు. సెమీఫైనల్లో అభినంద్-అనన్య 9-11, 14-12, 11-7, 11-8 స్కోరుతో రిత్విక్ గుప్తా-అహోనా రాయ్‌లను ఓడించగా, సార్థక్-సింద్రెలా 11-6, 12-10, 5-11, 11-5 తేడాతో సాహిల్ రావత్-హార్దీ పటేల్‌లను అడ్డుకున్నారు.



## ప్రో రెజ్లింగ్ లీగ్ వేలంలో..

# రూ.60 లక్షలతో సుసాకి టాప్

## భారత్ రెజ్లర్ సిజీత్‌కు రూ.52 లక్షలు

**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన ప్రధాన ఫ్రాంచైజీ ఆధారిత రెజ్లింగ్ లీగ్ (పిడబ్ల్యూఎల్)-2026 ఏడు సంవత్సరాల విరామం తర్వాత 5వ సీజన్ మళ్లీ జరగనుంది. ఈ నెల 15 నుండి నోయిడాలో ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో ఢిల్లీ దంగల్ వారియర్స్, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్, యుపి డామినేటర్స్, మహారాష్ట్ర కేసరి, హర్యానా థండర్స్, పంజాబ్ రాయల్స్ పాల్గొంటున్నాయి. ఇందుకు న్యూఢిల్లీలో జరిగిన వేలంలో రెజ్లర్లపై కాసులు వర్షం కురిపించాయి. ఈ వేలంలో అతిపెద్ద స్టార్ అయిన యుయి సుసాకి (జపాన్)ని అత్యధిక ధరకు కొనుగోలు జరిగింది. గట్టి పోటీ ఎదురైనా హర్యానా థండర్స్ రూ.60 లక్షలకు కొనుగోలు చేసింది. ఈ జపనీస్ లెజెండ్ 4 సార్లు ప్రపంచ ఛాంపియన్, 2 సార్లు ఒలింపిక్ పతక విజేత. ఇందులో 2021 టోక్యోలో జరిగిన స్వదేశీ ఒలింపిక్స్‌లో బంగారు పతకం కూడా ఉంది. మొత్తంగా ఆమె 18 అంతర్జాతీయ ఈవెంట్లలో 17 బంగారు పతకాలను సాధించింది. పోలాండ్‌కు చెందిన హెవీవెయిట్ రెజ్లర్ రాబర్ట్ బరాన్ 125 కిలోల విభాగంలో అగ్రస్థానంలో ఉన్నాడు. అతడిని మహారాష్ట్ర కేసరి రూ.55 లక్షలకు కొనుగోలు చేసింది. ఇక యువ భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ 2025 చివర్లో అండర్ 23 ప్రపంచ టైటిల్‌ను గెలుచుకున్నాడు, ఢిల్లీ దంగల్ వారియర్స్ 52 లక్షలకు కొనుగోలు చేసిన భారతీయులలో సుజీత్ అత్యధిక బిడ్‌లో నిలిచాడు. అంటీమ్ పంఘల్ (భారత్) రూ.52 లక్షలకు యుపి డామినేటర్స్ కొనుగోలు చేసింది. రెండుసార్లు ప్రపంచ పతక విజేత అయిన ఆమె ప్రస్తుతం ప్రపంచ నంబర్ 1 స్థానంలో ఉంది. గత సంవత్సరం ఆడిన 4 పోటీలలో పతకాలు (2 స్వర్ణం, 2 కాంస్య) గెలుచుకుంది. అలాగే 2024 పారిస్ ఒలింపిక్ పతక విజేత భారత్ ఏకైక రెజ్లర్ అమన్ సెహ్రావత్‌ను పురుషుల విభాగంలో టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్ రూ.52 లక్షలకు దక్కించుకుంది.

## విజయ్ హజారే ట్రోఫీ..

# హైదరాబాద్, ఆంధ్రా ఔట్

## క్వార్టర్ రేస్‌కు నో ఛాన్స్

## ఐదు మ్యాచ్‌ల్లో 4 ఓడిపోయిన ఇరు జట్లు

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్, ఆంధ్ర తీవ్రంగా నిరాశపర్చాయి. హైదరాబాద్ వరుసగా ఐదు మ్యాచ్‌లకు నాలుగు ఓడగా, ఆంధ్ర ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచే గెలిచింది. ఇరు జట్లు ఇంకా రెండేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌లు గెలిచినా ఆంధ్ర, హైదరాబాద్ క్వార్టర్స్ చేరే అవకాశాలు లేవు. ఈ ట్రోఫీలో మొత్తం 38 జట్లు పోటీపడుతున్నాయి. ఇందులో 32 జట్లు ఎలైట్ గ్రూప్‌లో ఆడనుండగా, మరో 6 జట్లు ప్లేట్ గ్రూప్‌లో బరిలోకి దిగుతున్నాయి. ఎలైట్ గ్రూప్‌లోని 32 జట్లను ఏ,బీ, సీ, డీ నాలుగు గ్రూపులుగా విభజించగా, ఒక్కో దానిలో 8 జట్లు ఉంటాయి. ప్రతీ గ్రూపులోని జట్టు తమ ప్రత్యర్థి జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతోంది. అంటే ఒక్కో జట్టు ఏడేసి మ్యాచ్‌లు ఆడుతోంది. గెలిచిన జట్టుకు 4 పాయింట్లు, మ్యాచ్ రద్దైనా లేదా ఫలితం తేలకపోయినా చెరో 2 లభిస్తాయి. ఎలైట్ గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఈ 8 జట్ల నుంచి 4 జట్లు సెమీఫైనల్స్ ఆడుతాయి. సెమీఫైనల్లో గెలిచిన జట్లు ఫైనల్లో తలపడుతాయి. ఇక ప్లేట్ గ్రూప్‌లోని 6 జట్లు తమ ప్రత్యర్థితో ఒక్కో మ్యాచ్ ఆడుతాయి. అంటే ఒక్కోటీమ్ ఐదు లీగ్ మ్యాచ్‌లు ఆడుతోంది. ఈ ఐదు మ్యాచ్‌లు ముగిసే సమయానికి టాప్2లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఫైనల్లో గెలిచిన జట్టు తదుపరి ఎలైట్ గ్రూప్‌కు అర్హత సాధిస్తోంది. నాలుగు ఎలైట్ గ్రూపుల్లో కలిపి అత్యంత తక్కువ పాయింట్లు, నెట్ రన్ రేట్ ఉన్న జట్టు ప్లేట్ గ్రూప్‌కు డీమోట్ అవుతుంది. ఈ విధంగానే క్వార్టర్స్ రేసు నుంచి హైదరాబాద్ ఔట్ కానుంది. ఎలైట్ గ్రూప్ బీలో ఉన్న హైదరాబాద్ ఐదు మ్యాచ్‌లకు నాలుగు ఓడి ఏడో స్థానంలో కొనసాగుతుండగా, మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌లను గెలిచినా క్వార్టర్స్ చేరే అవకాశాలు లేవు. ఈ గ్రూప్‌లో ఉత్తరప్రదేశ్ ఇప్పటికే 16 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, జమ్మూ కాశ్మీర్, విదర్భ, బరోడా, బెంగాల్ వంటి జట్లు ఒక్కొక్కటి 12 పాయింట్లతో పోటీలో ఉన్నాయి. హైదరాబాద్ చివరి 2 మ్యాచ్‌ల గెలిచినా 8 పాయింట్లు మాత్రమే వస్తాయి. అలాగే ఎలైట్ గ్రూప్ డీలో ఉన్న ఆంధ్రా ఐదు మ్యాచ్‌లు ఆడి ఒక్క విజయం మాత్రమే నమోదు చేసింది. 4 పాయింట్లతో 7వ స్థానంలో కొనసాగుతోంది. ఈ గ్రూప్‌లో ఇప్పటికే ఒడిశా, రైల్వేస్, హర్యానా, ఢిల్లీ 12 పాయింట్లతో టాప్ 4లో ఉండగా, సౌరాష్ట్ర 8 తో 5వ స్థానంలో ఉంది. ఆంధ్ర తమ చివరి మ్యాచ్‌లు గెలిచినా 8 పాయింట్లతోనే నిలుస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో టాప్5 జట్లలో నాలుగు టీమ్స్ తమ చివరి మూడు మ్యాచ్‌ల్లో ఓటమి పాలవ్వాలి. అంతేకాకుండా ఆంధ్ర రన్ రేట్ మెరుగ్గా ఉండాలి. కానీ ఆంధ్ర రన్‌రేట్ మైనస్‌లో ఉంది. కాబట్టి ఆంధ్ర కూడా క్వార్టర్స్ చేరడం అసాధ్యం.









## యాషెస్ సిరీస్‌లో ఘనంగా

# ఆరంభించిన ఇంగ్లండ్

## తొలి రోజు ఆస్ట్రేలియాపై ఆధిపత్యం

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్ 2025-26లో ఆఖరి టెస్టును ఇంగ్లండ్ ఘనంగా ఆరంభించింది. సిడ్నీ వేదికగా ఆదివారం ప్రారంభమైన ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో ఆస్ట్రేలియాపై ఇంగ్లీష్ జట్టు పై చేయి సాధించింది. అయితే వర్షం కారణంగ ఖమొదటి రోజు కేవలం 45 ఓవర్లు ఆట మాత్రమే సాధ్యపడింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు నష్టానికి 211 పరుగులు చేసింది. క్రీజులో జోరూట్ (72), హ్యారీ బ్రూక్ (78) ఉన్నారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 57 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో రూట్, బ్రూక్ అద్భుతమైన పోరాటం కనపరిచారు. మరో వికెట్ కోల్పోకుండా ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు అజేయంగా 154 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆసిస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, మైఖల్ నీసర్, స్కాట్ బోలాండ్ తలా వికెట్ సాధించారు. కాగా ఇప్పటికే యాషెస్ సిరీస్‌ను 3-1 తేడాతో ఆస్ట్రేలియా సొంతం చేసుకుంది. వరుసగా మూడు మ్యాచ్‌లలో ఓటమి చవిచూసిన ఇంగ్లండ్ మెల్‌బోర్న్ వేదికగా జరిగిన బాక్సింగ్ డే టెస్టులో మాత్రం అద్భుతమైన విజయాన్ని అందుకుంది.

## కమోడిటీ, బులియన్‌లపై

# వెనిజులా దాడుల ఎఫెక్ట్!



**న్యూఢిల్లీ, జనవరి 4:** అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లకు వెనిజులా ఎఫెక్ట్ తీవ్రస్థాయిలోచూపిస్తోంది. వెనెజువెలాపై దాడులు ప్రకంపనలు సృష్టిస్తున్న తరుణంలో ముడి చమురు, బంగారం, వెండి తదితర కమోడిటీల ధరలకు రెక్కలొస్తున్నాయి. వెనెజువెలా ఆర్థిక వ్యవస్థ అంత పెద్దదేమీ కాదంటున్న ఆర్థిక నిపుణులు భారతీయ స్టాక్ మార్కెట్లపై ఈ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండకపోవచ్చనే చెప్తున్నారు. అయితే గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్, సిల్వర్, క్రూడాయిల్ ఇతర కమోడిటీ ట్రేడింగ్ తప్పక ప్రభావితం కాగలదని చెపుతున్నారు. సోమవారం ఫ్యూచర్ మార్కెట్ కొమెక్స్‌లో గోల్డ్ ధర ఔన్స్ 4,380 డాలర్లను తాకవచ్చని, సిల్వర్ కూడా 7578 డాలర్లను చేరవచ్చని ఆరంగ నిపుణుడు అనుజ్ గుప్తా అన్నారు. దీంతో స్పాట్ మార్కెట్‌లోనూ ఔన్స్ గోల్డ్ రూ.4,450 డాలర్లు, ఔన్స్ సిల్వర్ 80 డాలర్లు ఉండొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. ఇక భారతీయ ఫ్యూచర్ మార్కెట్ ఎంసీఎక్స్‌లోనూ బంగారం ధర 24 క్యారెట్ 10 గ్రాములు రూ.1.40లక్షలుగా నమోదు కావచ్చని, వెండి కిలో రూ.2.45లక్షలను తాకవచ్చన్నారు. అమెరికావెనెజువెలా సంక్షోభం సముద్ర మార్గంలో ఇబ్బందులకు దారితీయవచ్చని, ఈ దారిగుండానే ప్రపంచంలోనే వెండి ఎగుమతుల్లో దూసుకుపోతున్న పెరు, చాద్ దేశాలకు ప్రస్తుత పరిస్థితులు చిక్కులు తీసుకురావచ్చని మార్కెట్ నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఈ దెబ్బకు గోల్డ్ ధరలు కొండెక్కుతాయని అంటున్నారు. ఇదే జరిగితే దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల పరుగుకు పట్టపగ్గాలనేవే ఉండకపోవచ్చు. ఇక ముడి చమురు విషయానికొస్తే ఎంసీఎక్స్‌లో బ్యారెల్ మరింత పెరిగే వీలుంటుందని పేర్కొంటున్నారు.

# వాణిజ్యం




## డిపాజిట్లకంటే ఫండ్స్ పెట్టుబడులపైనే

# ఎక్కువ ఫోకస్!

**ముంబయి,జనవరి 4:** పొదుపుచేసే చర్యల్లోప్రజల్లో పెట్టుబడి విధానాలు మారుతున్నాయి. ఈక్విటీలతోపాటు మూచువల్‌ఫండ్స్‌లో పెట్టుబడులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. 2022 నుంచి 2024 చివరి త్రైమాసికం వరకు స్టాక్ ధరల్లో ర్యాలీ వల్ల ప్రజలు ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కనిపిస్తున్నది. ఆర్బీఐ విడుదల చేసిన నెలవారీ బులెటిన్ ప్రకారం, సాధారణ కుటుంబాల బ్యాంక్ డిపాజిట్లు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 8.97 శాతం తగ్గిపోయి, రూ.12.54 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అంతకు ముందు రెండేండ్లలో కనిపించిన వృద్ధి తిరోగమనం బాట పట్టింది. జీవిత బీమా నిధుల్లో పెట్టుబడులు 17.3 శాతం తగ్గి, రూ.5.3 లక్షల కోట్లకు చేరాయి. పీపీఎఫ్ మినహా చిన్న మొత్తాల పొదుపులు 24 శాతం పతనమయ్యాయి. తక్కువ ప్రతిఫలాన్ని ఇచ్చే సురక్షిత పెట్టుబడులను ఇన్వెస్టర్లు గట్టిగా తిరస్కరిస్తున్నారు. ప్రజలు తమ సొమ్మును అధిక ప్రతిఫలాన్ని ఇచ్చే పథకాల్లో పెడుతున్నారు. ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్లు దాదాపు 153 శాతం పెరిగాయి, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు 95 శాతం పెరిగాయి. కరెన్సీ హోల్డింగ్స్ కూడా 77.6 శాతం ఎగబాకాయి. ప్రజలు నగదు అందుబాటులో ఉంచుకునేందుకు సైతం ప్రాధాన్యం ఇస్తున్నారు. వినియోగం కూడా అధికంగా కనిపించింది. 2021-22 నుంచి 2024-25 వరకు పొదుపులో బ్యాంక్ డిపాజిట్ల వాటా 40.9 శాతం నుంచి 35.2 శాతానికి తగ్గింది. అదే కాలంలో మ్యూచువల్ ఫండ్స్ వాటా 2.1 శాతం నుంచి 13.1 శాతానికి పెరిగింది. ఈక్విటీ హోల్డింగ్స్ వాటా 1.3 శాతం నుంచి 2.1 శాతానికి పెరిగింది. సాధారణ కుటుంబాలు పొదుపు చేసే తీరు క్రమంగా మారుతున్నట్లు ఈ గణాంకాలు చెప్తున్నాయి. సురక్షితమైన పొదుపు చేయాలనే భావం నుంచి అవకాశాల ఆధారిత పొదుపు చేయడం వైపు ప్రజలు మారుతున్నట్లు వెల్లడవుతున్నది.

# రియాల్టీలో విక్రయం కాని ఇళ్లు 5.77 లక్షలు!


## అనరాక్ రియాల్టీ కన్సల్టెన్సీ అంచనా



**న్యూఢిల్లీ, జనవరి 4:** భారత్ రియాలీట్టరంగంలో గత ఏడాది ఏడు మేజర్ నగరాల్లో నాలుగుశాతం ఇళ్లు విక్రయం కాకుండా నిలిచిపోయాయి. అంటే సుమారు 5.77 లక్షలయూనిట్లు అమ్మకాలు లేకుండా నిలిచినట్లు తేలింది. అనరాక్ డేటాను పరిశీలిస్తే ప్రైమరీ రెసిడెన్షియల్‌మార్కెట్‌లో అన్‌సోల్డ్ యూనిట్లు 5,76,617 యూనిట్లుగా ఉన్నాయి. అదే గత ఏడాది చివరినాటికి 5,53,073 యూనిట్లు ఉన్నట్లు తేలింది. సాలీనా అన్‌సోల్డ్ ఇళ్లను టాప్ ఏడు నగరాల్లో నాలుగుశాతంగా ఉంటుంది. ఏడు నగరాల్లో వార్షిక పద్ధతిలోచూస్తే 14శాతం క్షీణించి 3,95,625 మాత్రమే అమ్మకం జరిగాయి. కొత్త ఇళ్ల సరఫరా మాత్రం రెండుశాతం పెరిగి 4,19,170యూనిట్లకు చేరినట్లు అనరాక్ ప్రకటించింది. ముంబయి మెట్రోపాలిటన్‌రీజియన్, హైదరాబాద్‌లలోనే ఎక్కువ అన్‌సోల్డ్‌యూనిట్లు ఉన్నాయి. ఢిల్లీ, ఎన్సీఆర్, పూణె, చెన్నై, బెంగలూరు, కోల్‌కత్తా నగరాల్లోకూడా ఇదేపరిస్థితిఉ న్నట్లు అనరాక్ రియల్‌ఎస్టేట్ కన్సల్టెన్సీ ప్రకటించింది. ఢిల్లీఎన్సీఆర్‌ఫరిధిలో ఐదుశాతం అన్‌సోల్డ్స్ నిలిచాయి. 90,455 యూనిట్లు ఉన్నట్లు తేలింది. ముంబయి మెట్రో రీజియన్‌లో ఒకటిశాతం తగ్గి 1,79,228యూనిట్లు ఉన్నాయి. బెంగలూరులో అన్‌సోల్డ్స్ స్టాక్ 23శాతంపెరిగి 64,863యూనిట్లు ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. పూణెలో మూడుశాతంపెరిగి 83,491 యూనిట్లు ఉంటే హైదరాబాద్‌లో 96,140 యూనిట్లు ఉన్నాయి. చెన్నైలో 18శాతం అన్‌సోల్డ్స్‌పెరిగి 33,434 యూనిట్లకు చేరాయి. అదే కోల్‌కత్తాలో అన్‌సోల్డ్ ఇళ్లు 29,007కి చేరాయి. హోమ్‌లోన్లపై తక్కువ వడ్డీరేట్లకు రుణాలు లభిస్తే ఈ అన్‌సోల్డ్ సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని అనరాక్ అంచనావేసింది

## ఎయిర్‌లైన్స్‌లో పవర్ బ్యాంకుల వినియోగంపై

# డిజిసిఎ సర్క్యులర్ జారీ



**న్యూఢిల్లీ, జనవరి 4:** విమాన ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విమానయాన నియంత్రణ, పర్యవేక్షణ సంస్థ డీజీసీఏ కీలక సూచనలు చేసింది. విమాన ప్రయాణికులు పవర్ బ్యాంక్, అదనపు బ్యాటరీలు వాడే విషయంలో తాజాగా కొన్ని నిబంధనల్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఇకపై విమాన ప్రయాణికులు హ్యాండ్ లగేజ్ లో మాత్రమే పవర్ బ్యాంక్, అడిషనల్ బ్యాటరీలు, ఇతర లిథియం బ్యాటరీ డివైజ్ లను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఓవర్ హెడ్ కంపార్ట్ మెంట్, ఇతర కార్గో లగేజ్ లలో వీటిని తీసుకెళ్లడానికి అనుమతించరు. దీని ద్వారా విమానంలో ప్రయాణికులకు మరింత భద్రత కలగనుంది. ఈ నిబంధనలకు సంబంధించి డీజీసీఏ డేంజరస్ గూడ్స్ అడ్వైజరీ సర్క్యులర్ జారీ చేసింది. సాధారణంగా లిథియం బ్యాటరీలు కొన్ని సార్లు వేడెక్కి పేలడం, వాటి ద్వారా నిప్పు రవ్వలు అంటుకుని మంటలు వ్యాపించడం వంటివి జరుగుతున్నాయి. అందులోనూ విమానం గాల్లో ఉండగా ఇలా బ్యాటరీలు పేలడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగితే విమాన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గాల్లో మంటల్ని నియంత్రించడం సాధ్యం కాదు. విమానాల్లోని ఓవర్ హెడ్ కంపార్టుమెంట్లు, కార్గోలు వంటి వాటిల్లో బ్యాటరీల ద్వారా అగ్నిప్రమాదాలను త్వరగా గుర్తించడం సాధ్యం కావట్లేదు. అందుకే డీజీసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. హ్యాండ్ లగేజ్ లో మాత్రమే ఇవి ఉంటే వీటి ద్వారా ఎప్పుడైనా అనుకోని ఘటనలు జరిగితే ముందుగానే గుర్తించి నియంత్రించే వీలుంది. ఇటీవల కొన్ని విమానాల్లో పవర్ బ్యాంకుల ద్వారా మొబైల్స్ ఛార్జింగ్ పెడుతున్నప్పుడు, ఎయిర్ క్రాఫ్ట్ సీట్ పవర్ ఔట్లెట్లలో చార్జింగ్ చేస్తున్నప్పుడు అవి పేలి కొన్ని అగ్ని ప్రమాదాలు సంభవించాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న డీజీసీఏ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. ఇకపై విమాన ప్రయాణానికి ముందుగా ఈ విషయంలో జాగ్రత్తగా తనిఖీలు చేస్తారు. హ్యాండ్ లగేజీలలో మాత్రమే వీటిని అనుమతిస్తారు. విమానంలో కూడా స్పష్టమైన ప్రకటన, హెచ్చరికలు జారీ చేస్తారు. గత అక్టోబర్లో ఒక దేశీయ విమానంలో పవర్ బ్యాంక్ పేలడం వల్ల విమానాన్ని మధ్యలో దింపాల్సి వచ్చింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు.


# 10% పెరిగిన బంధన్‌బ్యాంకు అడ్వాన్సులు!




**న్యూఢిల్లీ, జనవరి 4:** ప్రైవేటురంగంలోని బంధన్‌బ్యాంకు రుణాలు అడ్వాన్సుల్లో పది శాతం వృద్ధినమోదుచేసింది. మొత్తం మూడో త్రైమాసికంలో 1,45,227 కోట్లు ఇచ్చిన ట్లుప్రకటించింది. ఇదే గత ఏడాది ఇదే త్రైమాసికంలో 1,32,019 కోట్లుమాత్రమే ఇచ్చినబ్యాంకుఈసారి కొంత వృద్ధినమోదు చేసింది. బిజినెస్ వివరాలను స్టాక్ ఎక్స్ఛేంజిలకు సమర్పించిన బ్యాంకు డిపాజిట్లుకూడా 11.1శాతంపెరిగి 1,56,723 కోట్లకు చేరినట్లు ప్రకటించింది. అదే గత ఏడాది ఇదే కాలంలో 1,42,002 కోట్లు ఉన్నట్లు తెలిపింది. మొత్తం డిపాజిటలపరంగా చూస్తే స్వల్పంగా క్షీణత ఉంది. 0.9శాతం క్షీణించి 1,58,075కోట్లవరకూ ఉన్నాయి. రిటైల్ డిపాజిట్లు కూడా బలమైన వృద్ధిని సూచించాయి. 17.2శాతం పెరిగినట్లు ప్రకటించింది. రూ.1,13,420 కోట్లకు చేరింది. రిటైల్ టర్మ్ డిపాజిట్లు కూడా 35.8శాతం పెరిగి 70,690 కోట్లకు చేరింది.

అదే గత ఏడాది ఇదేకాలంలో 52,063 కోట్లవరకూ ఉన్నట్లు బ్యాంకు తెలిపింది. కాసా డిపాజిట్లు మాత్రం 4.5శాతం క్షీణించి రూ.42,730 కోట్లకు చేరాయి. కాసా నిష్పత్తి 27.26శాతంగా ఉంది. గత ఏడాది ఇదేకాలంలో ఉన్న 31.73శాతంనుంచి గణనీయంగా తగ్గింది. ఇక బల్క్ డిపాజిట్లు కూడా 2.శాతం క్షీణించాయి. 43,303 కోట్లు వచ్చాయి. ఇక లిక్విడిటీ కవరేజి రేషియో కూడా 149.14 శాతంగా ఉన్నట్లు బ్యాంకు ప్రకటించింది.

# కోల్ ఇండియా అనుబంధ సంస్థ ఐపిఒకు!




**న్యూఢిల్లీ, జనవరి 4:** భారత్‌కోక్‌కోల్ లిమిటెడ్ సంస్థ ఈనెల 9వ తేదీ ఐపిఒకు వస్తోంది. కోల్ ఇండియాకు అనుబంధంగా పనిచేస్తున్న భారత్‌కోకింగ్‌కోల్ మొట్టమొదటి పబ్లిక్ ఇష్యూను ఈనెల 9వ తేదీ ఇస్తోంది. కొత్తసంవత్సరంలో ప్రభుత్వరంగ సంస్థలపరంగా మొట్టమొదటి ఐపిఒగా కూడా వస్తోంది. ఇప్పటికే సెబి వద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఆఫర్‌ఫర్‌సేల్ విధానంలో 46.57 కోట్ల ఈక్విటీషేర్లను జారీచేస్తోంది. జనవరి 13వ తేదీ బిడ్డింగ్‌ముగుస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ ఈనెల 8వ తేదీ ఉంటుంది. బొగ్గు రంగంలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగానే బిసిసిఎల్ ఐపిఒ ఉంటుందని చెపుతున్నారు.

మార్కెట్‌క్రమశిక్షణ పాటించడంతో పాటు బొగ్గురంగంలో అనిశ్చితిని తొలగించి లాభదాయకత తక్కువ ఉన్నవాటిని ఉపసంహరించుకునే విధానంలో కేంద్రం ముందుకుపోతోంది. సోమవారం కంపెనీ ఆర్థిక పరిస్థితులు, లాట్‌సైజు, ఇష్యూధరలు వంటివాటిని ప్రకటిస్తుందని కంపెనీ ప్రతినిదులు పేర్కొంటున్నారు. గత ఏడాదే కోల్ ఇండియాకు అనుబంధంగా పూరినత స్వతంత్ర సంస్థగా ఉన్న సెంట్రల్‌మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ సంస్థ కూడా ఐపిఒకు వచ్చేందుకు సెబివద్ద డ్రాఫ్ట్ పేపర్లు దాఖలుచేసింది. ఈ సంస్థ కూడా ఒఎఫ్‌ఎస్ రూటులోనే వస్తోంది. 2025లో కంపెనీలు రికార్డుస్థాయిలో రూ.1.76 లక్షలకోట్లు ఐపిఒలద్వారా సమీకరించాయి. దేశీయంగా మంచి నగదు లభ్యతను సాధించింది. మొత్తం 2024లో 90 సంస్థలు 1.60 లక్షలు సమీకరిస్తే గత ఏడాది మరింతగాపెరిగింది. అదే 2023లో 57 కంపెనీలు రూ.49,436కోట్లు సమీకరించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.